V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

ప్రజా విశ్వంభర

అక్షరం సాక్షిగా..

ఆదివారం 15-03-2026

RNI No : TGTEL/25/A1676

సంపుటి : 01 | సంచిక : 243 | పేజీలు : 12 | వెల : 5/-

తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




డా॥ కాచం సత్యనారాయణ CMD

## ఎల్పీజీ సరఫరాలో ఇబ్బందులు లేవు

- బుకింగ్ చేసుకున్న అందరికీ గ్యాస్ వస్తుంది
- సిలిండర్ల బ్లాక్‌మార్కెట్ అరికట్టాలని రాష్ట్రాలను కోరాం
- వాణిజ్య సిలిండర్ల విషయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాం
- భారత చమురు శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ

2




## 80% పూర్తయిన భవనాలు మూడు నెలల్లో పూర్తి చేస్తాం

- వేసవిలో వసతి గృహాల మరమ్మత్తు కార్యక్రమాన్ని పూర్తి చేయాలి
- అధికారుల నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోం
- డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచాం
- సంక్షేమ వసతి గృహాల అద్దెలు, ఎలక్ట్రికల్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు వేతనాలు ప్రతినెలా చెల్లిస్తాం
- సంక్షేమ శాఖ అధికారులు సకాలంలో ఆర్థిక శాఖకు బిల్లులు పంపాలి
- డిప్యూటీ సీఎం భట్టి హామీ



2



## మమత సర్కార్‌కు
# కౌంట్‌డౌన్ ప్రారంభం

### బెంగాల్‌లో 'మార్పు అనే తుపానును' ఎవరూ ఆపలేరు
### మళ్లీ చట్టబద్ధమైన పాలన వస్తుంది

- టీఎంసీ ప్రభుత్వం తాను పనిచేయదు.. ఇతరులు పనిచేయడానికి అనుమతించదు..
- అందువల్ల అనేక కేంద్ర పథకాలు నిలిచిపోయాయి
- మార్పు ఆసన్నమైందని గ్రహించిన టీఎంసీ కలవరపడుతోంది
- ఈ ర్యాలీకి రాకుండా ప్రజలను అడ్డుకునే ప్రయత్నం చేసింది
- టీఎంసీ ప్రభుత్వం మహిళలపై అత్యాచారాలకు పాల్పడేవారికి రక్షణ కల్పిస్తోంది : ప్రధాని నరేంద్ర మోడీ

**విశ్వంభర, నేషనల్ బ్యూరో**

బెంగాల్‌లో పర్యటిస్తున్న ప్రధాని మోడీ, మమతా బెనర్జీ సర్కార్‌పై శనివారం విమర్శల వర్షం కురిపించారు. బెంగాల్‌కు 'మహా జంగిల్‌రాజ్' పాలనను తీసుకొచ్చిన వారికి కౌంట్ డౌన్ ప్రారంభమైందని అన్నారు. ఈ నిరంకుశ టీఎంసీ ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా, 'మార్పు అనే తుపాను'ను ఆపలేదని పేర్కొన్నారు. బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లోని భారీ జనసమూహమే ఇందుకు నిదర్శనమన్నారు. బెంగాల్‌లో మళ్లీ చట్టబద్ధమైన పాలన వస్తుందని, అప్పుడు దురాగతాలకు పాల్పడిన టీఎంసీ నాయకులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. 'టీఎంసీ ప్రభుత్వం తాను పనిచేయదు, ఇతరులు పనిచేయడానికి అనుమతించదని, అందుకే బెంగాల్‌లో అనేక కేంద్ర పథకాలు నిలిచిపోయాయని మోడీ ఆరోపించారు. బెంగాల్‌లో మార్పు ఆసన్నమైందని గ్రహించిన టీఎంసీ కలవరపడుతోందన్నారు. అందుకే ఈ ర్యాలీకి రాకుండా ప్రజలను అడ్డుకునే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. అయితే ఎన్ని వ్యూహాలు పన్నినప్పటికీ ప్రజలు ర్యాలీకి హాజరుకాకుండా మమతా సర్కార్ ఆపలేకపోయిందని ఎద్దేవా చేశారు. అంతేకాదు, టీఎంసీ ప్రభుత్వం మహిళలపై అత్యాచారాలకు పాల్పడేవారికి రక్షణ కల్పిస్తోందని, ఇందుకు సందేశ్ ఖలి, ఆర్‌జీ కర్ ఘటనే నిదర్శనమని అన్నారు. టీఎంసీ ప్రజావ్యతిరేక విధానాల వల్ల, చంద్రకోనకు చెందిన బంగాళాదుంప రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారని అన్నారు.

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ శనివారం బెంగాల్‌లో రూ.18,680 కోట్ల విలువైన రవాణా, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో ఒక కొత్త అధ్యాయం ఈ బెంగాల్ నుంచే లిఖించబడుతోందని పేర్కొన్నారు. అలాగే ఖరగ్‌పూర్ మోరెగ్రామ్ ఎకనామిక్ కారిడార్‌కు కూడా ఆయన శంకుస్థాపన చేశారు.

231 కి.మీ పొడవుతో, నాలుగు వరుసల్లో, ఐదు విభాగాలుగా ఈ ఖరగ్‌పూర్ మోరెగ్రామ్ ఆర్థిక కారిడార్‌ను నిర్మించనున్నారు. దీని వల్ల సుమారు 120 కి.మీ దూరం తగ్గుతుంది. దాదాపు 78 గంటల సమయం ఆదా అవుతుంది. ఈ రహదారి పశ్చిమ మేదినీపూర్, బంకురా, హుగ్లీ, పూర్బా బర్ధమాన్, బీర్భూమ్, ముర్షిదాబాద్ జిల్లాల గుండా వెళ్తుంది. ఈ కారిడార్ ఎన్‌హెచ్ 16, ఎన్‌హెచ్ 19, ఎన్‌హెచ్ 14, ఎన్‌హెచ్ 12 వంటి కీలక జాతీయ రహదారులను కలుపుతూ, మల్టీకారిడార్ కనెక్టివిటీని బలోపేతం చేస్తుందని అధికారులు చెబుతున్నారు. వీటితో పాటు ఎన్‌హెచ్ 14పై 5.6 కి.మీ పొడవైన దుబ్రాజ్‌పూర్ బైపాస్ నిర్మాణానికి, అలాగే కంసాబతి, శిలాబతి.. మిగతా2లో...

## ఉద్యమకారులకిచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి

- ఏ ఒక్క ఉద్యమకారుడికి అన్యాయం జరిగిన సహించేది లేదు
- వారి సంక్షేమాన్ని ఆనాటి టీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు
- ఉద్యమకారుల గుర్తింపు విషయంలో కేవలం పోలీసు కేసులే ప్రామాణికం కాదు
- డా.కాచం సత్యనారాయణ గుప్త
- సకల జనుల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు
- ఉద్యమకారులను గుర్తించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీ వేయాలి
- ఆ కమిటీకి చట్ట బద్ధత ఉండాలి: ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం

3



## మూసీ పునరుజ్జీవనం చేయాలి

- మూసీలో మంచినీరు పారేలా చేస్తామంటే.. విపక్షాలు అడ్డుకోవడమేంటి
- 10 వేల మంది ఇళ్లు కోల్పోతున్నారు
- వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు తప్పకుండా చూస్తాం
- ప్రజల ఆరోగ్యం కోసం చేస్తున్న మంచి పనిని ప్రతిపక్షాలు రాజకీయం చేయొద్దు
- విజయవాడ హైవే కోకపేట్‌కు మించి అభివృద్ధి చెందుతుంది
- అభివృద్ధి, ప్రజా సంక్షేమమే మా ప్రధాన ఎజెండా: మంత్రి కోమటిరెడ్డి
- హయత్‌నగర్‌లో రోడ్డు విస్తరణ పనులకు మంత్రి శంకుస్థాపన



2

## మే 11 నుంచి తొలిదశ జనాభా లెక్కలు

- ప్రభుత్వ పనితీరు మెరుగుపడేందుకు జనగణనే కీలకం
- తెలంగాణ ఏర్పాటైన తొలిసారి జనగణన
- రాష్ట్రంలో 11 మే నుంచి జూన్ 09 వరకు తొలిదశ లెక్కింపు
- డిజిటల్ మోడ్‌లో జనగణన చేపట్టేందుకు ఆఫ్‌లైన్ మోడ్‌లో పనిచేసే యాప్ వినియోగం
- జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి



2

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధిలో
## రైతులది కీలక పాత్ర

- వ్యవసాయంలో రైతులకు సాంకేతిక సహకారం అందిస్తాం
- ఏఐ అగ్రోనమిస్ట్‌ను రాష్ట్రమంతటా అందుబాటులోకి తెస్తాం
- ఏలూరులో 500 ఎకరాల్లో కోకో సిటీ ఏర్పాటు చేస్తాం
- యుద్ధం వల్ల కోడిగుడ్లు, సీమ అరటి ఉత్పత్తుల ఎగుమతులు ఆగిపోయాయి
- అన్నదాతలతో ఏపీ సీఎం చంద్రబాబు మాటామంతీ



2

## ఆయిల్ పామ్ హబ్‌గా తెలంగాణ

- రూ.300 కోట్లతో పామాయిల్‌ఫ్యాక్టరీ
- అధిక ఆదాయం పొందే ప్రత్యామ్నాయ పంటగా పామాయిల్ పంట ఎంతో ఉపయోగకరం
- ఒకసారి నాటితే 25 నుండి 30 సంవత్సరాలపాటు నిరంతర ఆదాయం
- ఈ పంట తెలంగాణ రైతులకు బంగారు భవిష్యత్తును అందించగలదు
- రాష్ట్ర వ్యాప్తంగా 2.91 లక్షల ఎకరాల్లో సాగు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల రావు

2



## బండి సంజయ్ 'అంజన్న ఆశీర్వాద యాత్ర'

- 10 వేల మంది కార్యకర్తలతో కాలినడకన కొండగట్టుకు
- 40 కి.మీల పాదయాత్ర చేసి అంజన్నకు మొక్కులు చెల్లించుకోనున్న కేంద్రమంత్రి



2

## మూసీ పేరుతో దోపిడీ చేస్తే అడ్డుకుంటాం

- ప్రజల ఇళ్ల కూల్చివేతను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోం
- నష్టం లేకుండా మూసీని అభివృద్ధి చేయవచ్చు
- మూసీ పేరుతో 3300 ఎకరాల భూములపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కన్నేశారు
- పార్టీలకు అతీతంగా హైదరాబాద్ ప్రజల హక్కులను కాపాడతాం
- బాధితుల వెంట బీఆర్ఎస్ పార్టీ నిలుస్తుంది : కేటీఆర్




2



## రామకృష్ణ పురం డివిజన్‌లో పర్యటించిన కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

**విశ్వంభర, ఎల్బీనగర్ :** శ్రీ రామకృష్ణ పురం డివిజన్ లో వివిధ సమస్యల పరిష్కారం కొరకు మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ని కలసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకవెళ్లిన "బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు,గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ వీరమళ్ళ రామ్ నరసింహ గౌడ్. ఈ సందర్బంగా డివిజన్ లోని విజయపూరి కాలనీలో గత కొన్ని రోజులుగా వర్షపు నీరు , డ్రైనేజీ పొంగిపొర్లుతు దుర్భారమైన వాసనాతో కాలని ప్రజలకు ఇబ్బంది పడుతున్నరని, మిగతా కాలనిలో దోమలు, విధికుక్కలు, గుంతల మాయమైన రోడ్లు, డ్రైనేజీ, కాలనిలలో పార్క్ ల సుందరికరణ, విధి దీపాలు, వేసవి కాలంలో మంచినీటికి ఇబ్బంది లేకుండా చూడాలని అయనకు విన్నవించారు... కార్యక్రమంలో సరూర్నగర్ డిసి శ్రీనివాస్, డి ఈ చందన, అధికారులు పాల్గొన్నారు.

## విద్యా విధానం సామాజిక న్యాయాన్ని ప్రతిబింబించాలి : గుజ్జ సత్యం

### తెలంగాణ విద్యా కమిషన్ నివేదికపై రౌండ్ టేబుల్ సమావేశంలో కీలక వ్యాఖ్యలు



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర విద్యా విధానం రూపకల్పనలో సామాజిక న్యాయం ప్రధాన ప్రమాణంగా ఉండాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం పేర్కొన్నారు. తెలంగాణ లెక్చరర్స్ ఫోరం అధ్యక్షులు ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన "తెలంగాణ విద్యా విధానం - విద్యా కమిషన్ నివేదిక"పై రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన గెస్ట్ స్పీకర్‌గా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ విద్యా కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో విద్యా వ్యవస్థలో పలు సంస్కరణలు ప్రతిపాదించినప్పటికీ, అమలు దశలో వాటి ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు కేటాయిస్తున్న నిధులు ప్రస్తుతం సుమారు 8 శాతం పరిధిలోనే ఉన్నాయని, విద్యా రంగం అభివృద్ధి చెందాలంటే కనీసం 15 నుంచి 18 శాతం వరకు కేటాయింపులు పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలు , విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయకపోతే విద్యా వ్యవస్థలో అసమానతలు పెరిగే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి, ఉపాధ్యాయుల ఖాళీలు, ఉన్నత విద్యాసంస్థల్లో నిధుల కొరత వంటి సమస్యలను పరిష్కరించే దిశగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక అవసరమని సూచించారు. ఇటీవల విద్యా కమిషన్ ప్రతిపాదించిన కొన్ని అంశాలు—పరీక్షా వ్యవస్థలో మార్పులు, విద్యా నాణ్యత పెంపు, సాంకేతికత వినియోగం—వంటి అంశాలను స్వాగతించినప్పటికీ, అవి అమలు స్థాయిలో సామాజిక సమానత్వాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు కావాలని సూచించారు.

## లాంగ్ డ్రైవ్ పేరుతో కారు చోరీ

### ఐదుగురు అరెస్టు



**విశ్వంభర, నల్లకుంట :** లాంగ్ డ్రైవ్ పేరుతో కారు కిరాయికి తీసుకుని గుట్టు చప్పుడు కాకుండా రాజస్థాన్ కు చెందిన వ్యక్తికి విక్రయించిన ముఠాను నల్లకుంట పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఐదుగురిని అదుపులోకి తీసుకుని మహీంద్రా ఎక్స్ యూవీ 300 కారును స్వాధీనం చేసుకున్నారు. ఓయూ ఏసీపీ జి. జగన్, ఇన్స్పెక్టర్ కాసుల మారుతి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్ సికార్ జిల్లాకు చెందిన ప్రభు దయాళ్ సైనీ అదే రంగు, మోడల్ కు చెందిన కారును కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో సోషల్ మీడియాలో సమాచారం పెట్టాడు. దీనిని గమనించిన హైదరాబాదుకు చెందిన ఎండీ ఆసిఫ్, ఉజైర్ కలిసి నల్లకుంట పరిధిలోని లాంగ్ డ్రైవ్ కార్స్ వద్ద ఉన్న మహీంద్రా ఎక్స్ యూవీ 300 కారును లక్ష్యంగా చేసుకున్నారు. షేక్ జాఫర్ అహ్మద్ సహకారంతో మహ్మద్ వాసీమ్, ఖాజా జాబెఉద్దీన్ ద్వారా ఫిబ్రవరి 25న కారును కిరాయికి తీసుకున్నారు. అనంతరం కారును రాజస్థాన్ కు చెందిన ప్రభు దయాళ్ సైనీకి రూ.2.10 లక్షలకు విక్రయించారు. కారు నెంబర్ ప్లేట్ మార్చి, జీపీఎస్ తొలగించి రాజస్థాన్ కు తరలించారు.

బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి కారును స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు ఉజైర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వరలక్ష్మి, క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మోదీపై కాంగ్రెస్ నిరసన

**విశ్వంభర, హైదరాబాద్ :** "భారత్-అమెరికా ట్రేడ్ డీల్ లో దేశ ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వం రాజీపడింది. ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలి. లేకపోతే పదవికి రాజీనామా చేయాలి" అని ఖైరతాబాదు (హైదరాబాదు సెంట్రల్) జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మోత రోహిత్ ముదిరాజ్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు అన్నారు. ప్రధానిపై ఆరోపణలు చేస్తూ ఖైరతాబాదు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి అబిడ్స్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం వరకు వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. "పీఎం ఈజ్ కాంప్రమైజ్డ్ " అనే సందేశంతో సుమారు 100 అడుగుల భారీ బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత్-అమెరికా ట్రేడ్ డీల్ లో దేశ ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వం రాజీపడిందని ఆరోపించారు. అమెరికాలో గౌతమ్ అదానిపై నమోదైన లంచం, మోసం కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆయనను రక్షిస్తున్నట్లు విమర్శించారు. ఎప్స్టిన్ ఫైల్స్ లో వెలుగులోకి వస్తున్న అంశాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, నాంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఫిరోజ్ ఖాన్, కాంగ్రెస్ నాయకురాలు విజయా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమకారులకిచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి







**విశ్వంభర,తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ తోపాటు మిగతా హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఛైర్మన్ డా. కాచం సత్యనారాయణ గుప్త రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ లో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొ. కోదండరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమాన్ని ఆనాటి టీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆనాడు తెలంగాణ ఉద్యమకారులను ఇబ్బందులు పెట్టిన వారికి టీఆర్ఎస్ ప్రభుత్వంలో పెద్దపీట వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ లో శ్రీకాంతాచారి ఆత్మబలిదానం తర్వాతనే రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిందన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ కేంద్రంలో ఆనాటి టీఆర్ఎస్ పార్టీ, జేఏసీ పిలుపునిచ్చిన సకలజనుల సమ్మె, మిలియన్ మార్చ్, సాగరహారం సడక్ బంద్, వంటావార్పు, మానవహారం లాంటి ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన చరిత్ర ఎల్బీనగర్ నియోజకవర్గ ఉద్యమకారులుకు దక్కుతోందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో దాదాపు 40 కులసంఘాలు, అలాగే ప్రజా సంఘాలు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశాయన్నారు. ఆనాడు తెలంగాణ కోసం ఎంత నిబద్ధతతో పనిచేశామో ఈరోజు తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం కోసం అంతే నిబద్ధతతో ప్రొ. కోదండరాం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం పనిచేస్తోందని కాచం సత్యనారాయణ గుప్త స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఉద్యమకారుల గుర్తింపు విషయంలో కేవలం పోలీసు కేసులే ప్రామాణికం కాదన్నారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం స్పష్టమైన విధి విధానాలు తయారు చేయాలన్నారు. ఏ ఒక్క ఉద్యమకారుడికి అన్యాయం జరిగిన సహించేది లేదని కాచం సత్యనారాయణ గుప్త స్పష్టం చేశారు. సకల జనుల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగిందని ప్రొ.కోదండరాం అన్నారు. ఒక్కరి పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం రాలేదన్నారు. తెలంగాణకోసం అమరులైన వారిని, ఉద్యమంకోసం జీవితాలను త్యాగం చేసిన ఉద్యమకారులను కీర్తించాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీ వేయాలని కోరారు. అలాగే ఉద్యమకారు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయటం కోసం విధి విధానాలు తయారు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం విధి విధానాలు తయారు చేయాటానికి ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే కమిటీకి చట్టబద్ధత ఉండాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సంఘం అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ అన్నారు. అలాగే ఆ కమిటీ కాలపరిమతి 6నెలలు మాత్రమే ఉండాలని పేర్కొన్నారు.









## గృహ అవసరాలకు గ్యాస్ కొరత లేదు

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో ప్రజలు భయపడి ముందుగానే ఎక్కువ గ్యాస్ సిలిండర్లు బుకింగ్స్ చేస్తున్నారని దాంతో సాధారణం కంటే రెట్టింపు సిలిండర్లు బుకింగ్ అవుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం అన్నారు. రాష్ట్రంలో గృహ అవసరాలకు సంబంధించి గ్యాస్ కొరత లేదని వాణిజ్య సిలిండర్ల కొరత ఉందన్నారు. శనివారం ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లతో సమావేశం అయిన మంత్రి ఉత్తమ్.. రాష్ట్రంలో 810 మంది ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారని ప్రస్తుత పరిస్థితులపై డిస్ట్రిబ్యూటర్లతో చర్చించామన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. రాష్ట్రంలో 1.3 కోట్ల మంది ఎల్పీజీ వినియోగదారులు ఉన్నారని చెప్పారు. దీపం పథకం కింద 28 లక్షల మంది ఎల్పీజీని వినియోగిస్తున్నారని ప్రతి నెల గృహ వినియోగదారులు 60 లక్షల సిలిండర్లు వాడుతున్నారని చెప్పారు.కాగా తాజాగా పరిస్థితులపై శుక్రవారం సెక్రటేరియట్ లో ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. అపోహలు వద్దన బాట్లింగ్ ప్లాంట్లలో కొరత లేదని చెప్పారు. హోటళ్లకు కొంత ఇబ్బంది ఉన్న మాట వాస్తవమేనని అయితే బ్లాక్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ క్రమంలో రాష్ట్రలో ఎల్పీజీ నిల్వలు సరఫరా, రవాణా వ్యవస్థను సమగ్రంగా పర్యవేక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. సీఎస్ చైర్ పర్సన్ గా, పౌరసరఫరాల శాఖ కమిషనర్ కన్వీనర్ గా వ్యవహరిస్తారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన కమిటీ పనిచేయనుంది.

## ఫీజులు, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి



**విశ్వంభర, బర్కత్‌పుర :** రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజులు, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు పగిళ్ల సతీష్ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాదు బర్కత్‌పురలో విద్యార్థి యువజన నాయకుడు నిఖిల్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులకు ఫీజులు, స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజుల బకాయిల కారణంగా పలువురు విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలు కోల్పోతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. ఈ నిరసన ర్యాలీలో విద్యార్థి యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జాతిని ఏకం చేసిన గీతం వందేమాతరం

- డా. ఆచార్య ఫణీంద్ర

**విశ్వంభర, హైదరాబాద్ :** భారత స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతర గీతం నిర్వహించిన పాత్ర అనిర్వచనీయమైనదని, భారత జాతిని ఏకం చేసిన గీతమని యువ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ హైదరాబాద్ అధ్యక్షులు డాక్టర్ ఆచార్య ఫణీంద్ర అన్నారు. త్యాగరాయ గాన సభ హైదరాబాద్, భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 14 రెండవ శనివారం రోజున కళా సంగీత నాట్య వేదిక త్యాగరాయ గాన సభ లో జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరై కవి, రచయిత విమర్శకులు శతాధిక గ్రంథ ప్రచురణ కర్త వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన వందేమాతరం కవితా సంకలనం మరియు నాకు నచ్చిన పుస్తకం వ్యాస సంకలనాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ కవులను ప్రోత్సహిస్తూ శతాధిక గ్రంథాలను వెలువరించిన వైరాగ్యం ప్రభాకర్ అభినందనీయులని అన్నారు. ముప్పై మంది తెలంగాణాకు సంబంధించిన ప్రముఖ కవులు రాసిన పుస్తకాలపై సమగ్రమైన విశ్లేషణ చేస్తూ 30 మంది రచయితలు అందించిన వ్యాస సంకలనం నాకు నచ్చిన పుస్తకం సాహిత్యం పట్ల అనురక్తిని ఆసక్తిని కలగజేస్తుందని, ఒకే చోట 30 మంది కవులు రాసిన పుస్తకాలను చదివే అవకాశం లభిస్తుందని ఇలాంటి పుస్తకాలను వైరాగ్యం ప్రభాకర్ మరిన్ని వెలువరించాలని కోరారు.విశిష్ట అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది అవార్డు గ్రహీత, షార్ట్ ఫిలిం సొసైటీ టి.ఎస్ కార్యదర్శి సాదనాల వెంకటస్వామి నాయుడు మాట్లాడుతూ నేడు వందేమాతర గీతాన్ని పూర్తిగా చదవాల్సిన అవసరం ఉందని అన్నారు. కవులు తమ రచనలను ఒకటికి రెండు మార్లు చూసుకొని అక్షర దోషాలు లేకుండా జాగ్రత్త పడాలని అన్నారు. నాకు నచ్చిన పుస్తకం వ్యాస సంకలనాన్ని కాకతీయ ప్రభుత్వ కళాశాల హనుమకొండ అసోసియేట్ ప్రొఫెసర్ డా. జరుపుల రమేష్ వందేమాతరం కవితా సంకలనాన్ని ఆధ్యాత్మికవేత్త ప్రవచనకర్త చౌదూరి కళాపీఠం అధ్యక్షులు చౌదూరి నరసింహారావు సమీక్ష చేసిన సభలో ఇరు తెలుగు రాష్ట్రాల కవులతో కవి సమ్మేళనం నిర్వహించడం జరిగింది. సభలో పాల్గొన్న కవులను భవానీ సాహిత్య వేదిక సర్టిఫికెట్ మరియు శాలువాతో ఘనంగా సత్కరించింది.

# యుద్ధం పలకని శాంతి.. ప్రపంచం వలకని కన్నీరు

## రష్యా-ఉక్రెయిన్ పోరు తెచ్చిన ఆర్థిక ప్రకంపనలు




ఫిబ్రవరి 24, 2022. కాలం గడిచిపోవచ్చు కానీ, చరిత్ర పుటల్లో ఆ తేదీ ఒక రక్తసిక్తమైన అధ్యాయానికి నాందిగా మిగిలిపోయింది. తెల్లవారుజామున మంచు కురుస్తున్న వేళ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆదేశాలతో సైనిక ట్యాంకులు ఉక్రెయిన్ సరిహద్దులు దాటాయి. ఆ క్షణం నుండి వినిపించిన తుపాకుల మోత కేవలం కీవ్ వీధుల్లోనే కాదు, సుదూరంగా ఉన్న న్యూయార్క్ స్టాక్ మార్కెట్ నుండి ముంబైలోని సామాన్యుడి వంటగది వరకు ప్రతిధ్వనించింది. ఇది కేవలం రెండు దేశాల సరిహద్దు గొడవ కాదు,ఆధునిక ప్రపంచం నిర్మించుకున్న ఆర్థిక గోడలను కూల్చివేసిన ఒక పెను సంక్షోభం. నేటికీ ఆ సెగలు చల్లారలేదు, ఆ గాయాలు మానలేదు. రష్యా అంటే కేవలం ఒక దేశం కాదు, అది ప్రపంచ ఇంధన అవసరాలను తీర్చే ఒక భారీ పవర్ హౌస్ . ముఖ్యంగా యూరప్ దేశాల మనుగడ రష్యా గ్యాస్ పైనే ఆధారపడి ఉండేది. యుద్ధం మొదలవ్వడమే ఆలస్యం, పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆంక్షల అస్త్రాన్ని ప్రయోగించాయి. ఫలితంగా సరఫరా గొలుసు ముక్కలైంది. జర్మనీ, ఫ్రాన్స్ వంటి పారిశ్రామిక దిగ్గజాలు చీకట్లో మగ్గాల్సిన పరిస్థితి వచ్చింది. 2022లో యూరప్‌లో గ్యాస్ ధరలు ఏకంగా 1000 శాతం పెరిగాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.చమురు మార్కెట్ కూడా అదే దారిలో పయనించింది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 130 డాలర్లను తాకి, 2008 నాటి రికార్డులను తిరగరాసింది. ఈ ధరల పెరుగుదల ఒక చైన్ రియాక్షన్ లా సాగింది. విమాన ప్రయాణాలు భారమయ్యాయి, సరుకు రవాణా వ్యయం ఆకాశాన్నంటింది, సామాన్యుడి స్కూటర్ పెట్రోల్ బిల్లు బడ్జెట్‌ను దాటిపోయింది. ఆకలి తీర్చుకోవడమే కష్టమైన తరుణంలో, ప్రయాణం కూడా ఒక విలాసంగా మారిపోయింది.యుద్ధం కేవలం తుపాకులతోనే కాదు, ఆకలితో కూడా పోరాడుతుంది. ఉక్రెయిన్ రష్యా రెండు దేశాలను కలిపి ప్రపంచ ధాన్యాగారం (Breadbasket of the World) అని పిలుస్తారు. ప్రపంచ గోధుమ ఎగుమతుల్లో 30 శాతం వాటా ఈ రెండు దేశాలదే. యుద్ధం కారణంగా నల్ల సముద్రం (Black Sea) రేవులు మూతపడ్డాయి. ఎక్కడైతే బంగారు రంగులో గోధుమ పంట పండాలో, అక్కడ ఇప్పుడు మందుపాతరలు మొలుస్తున్నాయి. దీని ప్రభావం అక్షరాలా భయంకరం. సూర్యకాంతి తైలం (Sunflower oil), మొక్కజొన్న ధరలు పెరగడంతో ఆఫ్రికా, మధ్య ప్రాచ్య దేశాల్లో కరువు ఛాయలు అలుముకున్నాయి. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం, ఈ యుద్ధం వల్ల 34 కోట్ల మంది ప్రజలు తీవ్రమైన ఆహార అభద్రతలోకి నెట్టబడ్డారు. ఒక చోట జరుగుతున్న యుద్ధం, మరో చోట పసిపిల్లల కడుపు మాడుస్తుందని ఈ సంక్షోభం నిరూపించింది. ధరల పెరుగుదల కేవలం సంఖ్యలకే పరిమితం కాలేదు, అది ద్రవ్యోల్బణం అనే భూతాన్ని నిద్రలేపింది. అమెరికాలో ద్రవ్యోల్బణం 40 ఏళ్ల గరిష్ట స్థాయికి (9.1%) చేరడంతో, అక్కడి ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను భారీగా పెంచింది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న బ్యాంకింగ్ వ్యవస్థలను కుదిపేసింది. డాలర్ బలపడటంతో అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలు కుప్పకూలాయి. దీనికి సజీవ సాక్ష్యం మన పొరుగు దేశం శ్రీలంక. కేవలం ఇంధనం, ఆహార ధరల పెరుగుదలను తట్టుకోలేక ఆ దేశం ఆర్థికంగా దివాళా తీయడం ఒక హెచ్చరికగా మిగిలిపోయింది. చిన్న దేశాలకు ఈ యుద్ధం ఒక మరణశాసనంగా మారింది. ఆధునిక సాంకేతికతకు అవసరమైన నియాన్ గ్యాస్ ,పల్లాడియం , టైటానియం వంటి ఖనిజాలకు రష్యా, ఉక్రెయిన్ ప్రధాన వనరులు. సెమీకండక్టర్ల తయారీ ఆగిపోవడంతో ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు పెరిగాయి. ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలకు వాడే నిక్కెల్ సరఫరా తగ్గిపోవడంతో గ్రీన్ ఎనర్జీ కలలు కూడా నెమ్మదించాయి. ప్రపంచ వాణిజ్యం ఇప్పుడు గ్లోబలైజేషన్ నుండి డిగ్లోబలైజేషన్ వైపు మళ్లుతోంది. నమ్మకమైన దేశాలతోనే వ్యాపారం చేయాలనే కొత్త ధోరణి (Friend shoring) మొదలైంది. ఈ సంక్షోభంలో భారతదేశం అనుసరించిన తటస్థ వైఖరి ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఒకవైపు అమెరికా ఒత్తిడి, మరోవైపు రష్యాతో ఉన్న దశాబ్దాల మైత్రి ఈ రెండింటి మధ్య స్ట్రాటజిక్ అటానమీ (వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి) తో భారత్ తన ప్రయోజనాలను కాపాడుకుంది. రష్యా నుండి తక్కువ ధరకే ముడి చమురు దిగుమతి చేసుకోవడం వల్ల మన ఆర్థిక వ్యవస్థ కొంతవరకు కుదుటపడింది.కానీ, నాణేనికి మరో పార్శ్వం కూడా ఉంది. ఎరువుల ధరలు పెరగడం వల్ల భారతీయ రైతులపై భారం పడింది. రక్షణ సామగ్రి కోసం రష్యాపై ఆధారపడిన మన దేశానికి సరఫరాల్లో జాప్యం ఎదురైంది. ఇది ఆత్మనిర్భర్ భారత్ ప్రాముఖ్యతను మరోసారి గుర్తుచేసింది. మనకు మనం సాటిగా నిలవకపోతే, పరాయి దేశాల యుద్ధాలు మన భద్రతను ప్రమాదంలో పడేస్తాయని స్పష్టమైంది. రష్యాపై విధించిన ఆంక్షలు ఒక కొత్త చర్చకు దారితీశాయి. రష్యన్ బ్యాంకులను SWIFT నుండి తొలగించడంతో, ప్రపంచ దేశాలు డాలర్‌కు ప్రత్యామ్నాయం కోసం వెతుకుతున్నాయి. రష్యా తన చమురును రూపాయిల్లో లేదా యువాన్‌లలో విక్రయించడం డిడాలరైజేషన్ దిశగా పడిన పెద్ద అడుగు. BRICS దేశాలు తమ స్వంత కరెన్సీ లేదా చెల్లింపు వ్యవస్థను రూపొందించుకోవాలని చూస్తుండటం భవిష్యత్తులో ప్రపంచ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చవచ్చు. ప్రతి చీకటి మేఘం వెనుక ఒక వెండి రేఖ ఉంటుందన్నట్లు, ఈ యుద్ధం ప్రపంచాన్ని క్లీన్ ఎనర్జీ వైపు వేగంగా నడిపిస్తోంది. శిలాజ ఇంధనాలపై (Fossil Fuels) ఆధారపడటం ఎంతటి ప్రమాదకరమో యూరప్ గ్రహించింది. సౌర, పవన మరియు హైడ్రోజన్ శక్తిపై పెట్టుబడులు అమాంతం పెరిగాయి. ప్రకృతి ఇచ్చిన వనరులను వాడుకోవడమే నిజమైన స్వేచ్ఛ అని ప్రపంచం గుర్తించింది.

యుద్ధం ముగిసినా, ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి దాదాపు 500 బిలియన్ డాలర్లు అవసరమని అంచనా. ఈ నిధులు ఎక్కడి నుండి రావాలి? ఆ భారం మళ్ళీ ప్రపంచ దేశాలపైనే పడుతుంది. చరిత్ర మనకు ఒక పాఠం చెబుతోంది ఆర్థికంగా మనం ఎంతగా పెనవేసుకుపోయి ఉన్నామంటే, ప్రపంచంలో ఏ మూల తుపాకీ పేలినా, దాని తూటా మరో దేశం యొక్క పొయ్యిని ఆపేస్తుంది. గతంలో వ్యాపారం చేసే దేశాల మధ్య యుద్ధం రాదు అనే ఒక నమ్మకం ఉండేది. కానీ ఆ నమ్మకాన్ని ఈ యుద్ధం తుత్తునియలు చేసింది. ఇప్పుడు ఆర్థిక నిర్ణయాలు కేవలం లాభనష్టాల మీద కాకుండా, భద్రత మరియు రాజకీయ కోణాల్లో తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.తుపాకులు నిశ్శబ్దమైతేనే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మళ్లీ ఊపిరి పీల్చుకోగలదు. అంతవరకు, ఈ అనిశ్చితి నీడలు మనల్ని వెంటాడుతూనే ఉంటాయి. శాంతి అనేది కేవలం ఒక నినాదం కాదు, అది ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి పునాది.



- డా .సూర్యదేవర రామకృష్ణ,
ఫోన్ : 9490754169

# సరి కొత్త పంతలో ఇరాన్ యుద్ధ తంత్రం




సైనికసాంకేతిక రంగం లో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న అమెరికా,ఇజ్రాయెల్ నుతాజా యుద్ధం లో ఇరాన్ ముప్పుతిప్పలు పెడుతుంది.అమెరికా ఇజ్రాయెల్ సంయుక్త దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ కమేనిని కొల్పవడం తో ఇరాన్ తన బుద్ధి బలం తో యుద్ధ రంగాన్ని వేడిక్కిస్తుంది. మధ్యప్రాచ్యంలో ఇటీవల నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ తన సైనిక వ్యూహాలు, యుద్ధ తంత్రాలను కొత్త రీతిలో ప్రదర్శిస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా ఇరాన్ ప్రత్యక్ష యుద్ధానికి దిగకుండా, పరోక్షంగా ,సాంకేతికత ఆధారంగా యుద్ధాన్ని నడిపించే విధానాన్ని అవలంబిస్తోంది. ఈ వ్యూహం వల్ల పెద్ద యుద్ధం లేకుండానే ప్రత్యర్థి దేశాలపై ఒత్తిడి తీసుకురావడంలో ఇరాన్ విజయవంతమవుతోంది.ఇరాన్ యుద్ధ తంత్రంలో ముఖ్యమైన అంశం "ప్రాక్సీ వార్" . అంటే ప్రత్యక్షంగా తన సైన్యాన్ని ఉపయోగించకుండా, మిత్ర బలగాలు లేదా మద్దతు గుంపుల ద్వారా ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకురావడం. మధ్యప్రాచ్యంలో ఉన్న కొన్ని గుంపులు ఇరాన్‌కు మద్దతుగా వ్యవహరిస్తున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ విధానం వల్ల ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొనకుండా కూడా ప్రాంతీయ ప్రభావాన్ని పెంచుకునే అవకాశం ఇరాన్‌కు లభిస్తోంది.మరో ముఖ్యమైన వ్యూహం డ్రోన్, క్షిపణి సాంకేతికత వినియోగం. ఇటీవల జరిగిన సంఘటనల్లో ఇరాన్ తయారు చేసిన డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులు పెద్దగా చర్చకు వచ్చాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం దాడులు చేయగలిగే ఈ ఆయుధాలు ఆధునిక యుద్ధంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. దీనివల్ల ప్రత్యర్థి దేశాల రక్షణ వ్యవస్థలను పరీక్షించే అవకాశం కూడా ఇరాన్‌కు లభిస్తోంది. అదే సమయంలో, సముద్ర మార్గాలను నియంత్రించే వ్యూహం కూడా ఇరాన్ యుద్ధ విధానంలో భాగం. ముఖ్యంగా హార్మోజ్ ప్రాంతం ప్రపంచ చమురు సరఫరాకు కీలక మార్గం. ఈ ప్రాంతంలో సైనిక ఉనికి పెంచడం ద్వారా ఇరాన్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా పరోక్ష ప్రభావం చూపగలదని నిపుణులు భావిస్తున్నారు.ఇరాన్ యుద్ధ తంత్రంలో సైబర్ యుద్ధం కూడా ఒక ప్రధాన ఆయుధంగా మారింది. సైబర్ దాడుల ద్వారా శత్రు దేశాల సమాచార వ్యవస్థలను దెబ్బతీయడం, సమాచార యుద్ధాన్ని నడిపించడం వంటి చర్యలు ఆధునిక యుద్ధంలో కీలకంగా మారుతున్నాయి.మొత్తంగా చూస్తే, ఇరాన్ యుద్ధ వ్యూహం సంప్రదాయ సైనిక దాడుల కంటే సాంకేతికత, ప్రాక్సీ బలగాలు, ఆర్థిక ఒత్తిడి మరియు సమాచార యుద్ధం వంటి పద్ధతుల సమ్మేళనంగా మారింది. ఇది భవిష్యత్తులో మధ్యప్రాచ్య రాజకీయాలను మరింత సంక్లిష్టంగా మార్చే అవకాశముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.సారాంశంగా, ఇరాన్ అమలు చేస్తున్న యుద్ధ తంత్రం సంప్రదాయ యుద్ధ విధానాల కంటే విభిన్నంగా, వ్యూహాత్మకంగా ఉండటం గమనార్హం. ప్రత్యక్ష పోరాటం కన్నా పరోక్ష మార్గాల ద్వారా ప్రభావాన్ని పెంచుకోవడం ఇరాన్ వ్యూహంలో ప్రధాన లక్షణంగా మారింది.



- దొమ్మాట వెంకటేష్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9848057274

# వినియోగదారుడే రాజు

### ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందేశం




అనేక పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా ప్రతి సంవత్సరం మార్చి 15ను ప్రపంచ వినియోగదారుల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. వినియోగదారుల ఉద్యమ పితామహుడిగా పేరుగాంచిన రాల్ఫ్ నాడర్ ఈ ఉద్యమానికి ప్రేరణగా నిలిచారు.

తాను కొనుగోలు చేసిన జనరల్ మోటార్స్ కంపెనీ కారులో ఉన్న లోపాల గురించి పలుమార్లు కంపెనీ దృష్టికి తీసుకెళ్లినా సరైన చర్యలు తీసుకోకపోవడంతో, రాల్ఫ్ నాడర్ కోర్టును ఆశ్రయించారు. కోర్టులో కేసు వేసి భారీ నష్టపరిహారం పొందారు. అయితే ఆయన ఆ డబ్బును వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించకుండా, ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తూ వినియోగదారుల చైతన్యానికి కృషి చేశారు. అనేక సభలు, సమావేశాలు నిర్వహిస్తూ వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. దీంతో ఆయన కొద్ది కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా ప్రభావశీల నాయకుడిగా గుర్తింపు పొందారు.

వినియోగదారుల ఉద్యమం అమెరికాలో ఊపందుకోవడంతో, అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెనెడీ 1962లో అమెరికా పౌరుల కోసం వినియోగదారుల హక్కులను అధికారికంగా ప్రకటించారు. అనంతరం 1972లో అంతర్జాతీయ వినియోగదారుల సంఘాల సంస్థ ప్రాంతీయ సంచాలకుడు అన్వర్ ఫజల్ చేసిన ప్రతిపాదన మేరకు, 1973 నుంచి ప్రతి సంవత్సరం మార్చి 15ను ప్రపంచవ్యాప్తంగా వినియోగదారుల హక్కుల దినంగా జరుపుకుంటున్నారు. రాల్ఫ్ నాడర్ ప్రభావంతో పాశ్చాత్య దేశాల్లో వినియోగదారుల చైతన్యం పెరిగింది. దాని ఫలితంగా నకిలీ, నాసిరకం ఉత్పత్తులు తయారు చేసే అనేక కంపెనీలు మూతపడ్డాయి. వ్యాపార రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుని "వినియోగదారుడే రాజు" అనే భావన బలపడింది.

అయితే భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వినియోగదారుల చైతన్యం ఇంకా పరిమితంగానే ఉందని చెప్పాలి. ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి కారణంగా అభివృద్ధి చెందిన దేశాల్లో నిషేధానికి గురైన కొన్ని ఉత్పత్తులు, మందులు, ఆహార పదార్థాలు కూడా ఇక్కడ మార్కెట్‌లోకి రావడం కనిపిస్తోంది.

దేశంలో వినియోగదారుల హక్కులను పరిరక్షించేందుకు 1986లో అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ చట్టాన్ని తీసుకువచ్చారు. అయితే ఆ చట్టానికి ముందే గుజరాత్, ముంబై, బెంగళూరు, మద్రాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అనేకమంది ప్రొఫెసర్లు, న్యాయవాదులు, ఉద్యమకారులు వినియోగదారుల చైతన్యాన్ని వ్యాప్తి చేశారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి వినియోగదారుల సంఘం పరిగి వసంత కుమార్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో స్థాపించబడింది. అనంతరం రాజం గణేషన్ దంపతులు, నరెడ్ల శ్రీనివాస్, గాలి ఉదయ్ కుమార్, మందటి కృష్ణారెడ్డి, వేముల గౌరీ శంకర్ రావు, శంకర్ లాల్ చౌరసియా తదితరులు ఈ ఉద్యమాన్ని మరింత విస్తరించారు.

నకిలీ, నాసిరకం వస్తువుల సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో వినియోగదారుల దోపిడీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో నరెడ్ల శ్రీనివాస్ వినియోగదారుల సమస్యలకు చట్టబద్ధ పరిష్కారాలు చూపడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన స్ఫూర్తితో ప్రారంభమైన జమ్మికుంట వినియోగదారుల సంక్షేమ మండలి వ్యవస్థాపకులు పి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు టికెట్లపై అధిక చార్జీలు వసూలు చేస్తున్న విషయాన్ని గుర్తించి, సౌత్ సెంట్రల్ రైల్వేపై ఫోరంలో కేసు వేసి చారిత్రాత్మక తీర్పు సాధించారు. అప్పటి నుంచి రైల్వే టికెట్ ధరలను తగ్గించి అమలు చేస్తోంది.

కన్స్యూమర్ ప్రొటెక్షన్ చట్టం, సమాచార హక్కు చట్టాలను ప్రజల కోసం ఆయుధాలుగా ఉపయోగించి సామాన్యుల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన నరెడ్ల శ్రీనివాస్ సేవలను అప్పటి కలెక్టర్లు ఐ.వి. సుబ్బారావు, బన్వర్‌లాల్, పార్థసారధి ప్రశంసించారు. కరోనా రెండో దశలో ఆయన మరణం వినియోగదారుల ఉద్యమానికి పెద్ద లోటుగా మారింది.

నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ వినియోగదారులే. ఉదాహరణకు ఒక కిరాణా దుకాణం యజమాని కూడా మరోచోట వినియోగదారుడే అవుతాడు. అందుకే వినియోగదారుల హక్కులు సమాజంలోని ప్రతి వర్గానికి సంబంధించినవి.

1986 చట్టాన్ని మరింత బలోపేతం చేస్తూ ప్రభుత్వం 2019లో సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీను ఏర్పాటు చేసింది. ఈ చట్టం ద్వారా ఈకామర్స్ మోసాలు, తప్పుదారి పట్టించే ప్రకటనలపై కొంతవరకు నియంత్రణ సాధ్యమైంది. అయితే నియంత్రణ లేకపోవడంతో మల్టీ లెవెల్ మార్కెటింగ్ (MLM) మోసాలు విస్తరిస్తూ, ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. ఈ మోసాలను కూడా వినియోగదారుల పరిరక్షణ చట్ట పరిధిలోకి తీసుకురావాలని ప్రజలు చాలా కాలంగా కోరుతున్నారు.

ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో వినియోగదారుల దోపిడీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో మరింత చైతన్యం అవసరం. వినియోగదారుల హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వం, న్యాయవ్యవస్థతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాల్సిన అవసరం ఉంది.

- పబ్బు శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్
9441331288

### పాపాలను తొలగించే ఏకాదశి

# పాప విమోచన ఏకాదశి

**ఉగాదికి ముందు ఫాల్గుణ మాసంలో కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశినే పాపవిమోచని ఏకాదశి అంటారు. దీనినే పాప నాశని ఏకాదశి అని కూడా అంటారు. అంటే పాపాలను తొలగించే ఏకాదశి అని అర్థం.**



పాపమోచని ఏకాదశి ప్రాముఖ్యతను శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునికి వివరించిన నేపథ్యం భవిష్యోత్తర పురాణంలో ఉంది. మంజు ఘోష అనే అప్సరస మేధావిని వైవాహిక జీవితంలోకి రప్పించిందని పురాణాలు చెబుతున్నాయి. పూర్వం మేధావి అనే మహర్షి తపస్సు చేసుకుంటుంటే ఇంద్రుడి ఆదేశానుసారం మంజుఘోష అనే అప్సరస తన నాట్యంతో ఆయన తపస్సు కు విఘ్నం కలిగించిందంట. ఆమె నాట్యానికి చలించిన మేధావి తన తపస్సుకి విఘ్నం కలిగించిందన్న ఆగ్రహంతో ఆ మంజుఘోషను శపించారట. ఈ ప్రత్యేకమైన ఏకాదశి వ్రతాన్ని ఆచరించడం ద్వారా ఆమెకు శాపవిముక్తి కలుగుతుందని మహర్షి ఆమెకు చెప్పాడు. ఆయన సూచన మేరకు మంజుఘోష ఏకాదశి వ్రతం ఆచరించి శాప విముక్తి పొందింది. ఋషి తాను కూడా అప్సరస వలలో పడి పాపాలు చేసానని భావించి పాపమోచని ఏకాదశిని ఆచరించాలని నిర్ణయించుకున్నాడు. పాప అంటే 'పాపం', 'మోచిని' అంటే తప్పించుకోవడం. ఈ విధంగా ఈ ఏకాదశి ప్రత్యేకంగా పాపాలను నాశనం చేయడంలో మరియు చేసిన పాపాలకు సంబంధించిన అపరాధాన్నినాశనం చేయడంలో సహాయ పడుతుంది.

చేసిన పాపాలను తొలగించినందున ఈ ఏకాదశిని పాపవిమోచని ఏకాదశి అని అన్నారు. ఈ రోజున ఏకాదశి వ్రతం పాటిస్తే తప్పక ఫలితం లభిస్తుందని పురాణాలు సైతం చెబుతున్నాయి. ఈరోజునే శ్రీకృష్ణునిని ఆందోళికోత్సవము జరుపుతారు. ఉయ్యాలలోని కృష్ణుని దర్శించినంత మాత్రమున కలికాలపు దోషాలు పాతాయని,. కృష్ణ ప్రతిమగల ఉయ్యాలను ఊచితే, వేయి అపరాధాలైనా క్షమింపబడతాయనీ, కోటి జన్మల పాపాలు తొలగడమే కాక విష్ణు సాయుజ్యము లభించగలదని పండితులు చెపుతారు.

పాప మోచని ఏకాదశి రోజున సూర్యోదయానికి ముందే నిద్ర లేచి స్నానం చేయాలి. ఈ పవిత్రమైన రోజున శ్రీమహా విష్ణువు ఆలయానికి వెళ్లి ఆరాధించాలి. స్వామి వారికి ఈరోజు పసుపు రంగు దుస్తులను అర్పించాలి. దీని తర్వాత 11 పసుపు పువ్వులు, 11 రకాల తీపి పదార్థాలను స్వామికి అర్పించాలి. అనంతరం విష్ణువు నామాలను, మంత్రాలను జపించాలి. అదే విధంగా ఈ రోజంతా ఉపవాసం ఉండాలి. ఈ రోజున ఉపవాసం ఉండి విష్ణుమూర్తిని ఆరాధిస్తే పాపాలు తొలగిపోతాయని శ్రీకృష్ణుడు స్వయంగా అర్జునుడికి చెప్పినట్టు పురాణ వచనం. అంతేకాకుండా ఈ వ్రతం ఆచరించిన వారికి మోక్షం కూడా లభిస్తుందట.



- రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

# హాస్య రచయితలలో అగ్రగణ్యులు మునిమాణిక్యం

## నేడు ఆయన జయంతి

తమ రచనల ద్వారా మధ్య తరగతి సంసారంలోని సరిగమల్ని ఎన్నింటినో వినిపించిన రచయిత మునిమాణిక్యం నరసింహారావు . తెలుగు హాస్య రచయితలలో ముని మాణిక్యంకు ఒక విశిష్ట స్థానం ఉంది. ఆయన కేవలం హాస్యరచయిత మాత్రమే కాదు. హాస్యోపాసకులు కూడా. విభిన్న వ్యక్తుల మనసులను అలరించే హాస్యోక్తులు,హాస్య సన్నివేశాలు ఎక్కడ ఆయన దృష్టికి తెచ్చినా వాటిమీద మక్కువతో అనువదించి గాని, అనుసరించిగాని, భాషను కొంచెం హాస్య యుక్తంగా మార్చి తెలుగు పాఠకులకు అందజేసే వారు. హాస్య రచయితలలో అగ్రస్థానం మునిమాణిక్యందే.

ఆయన వ్రాసిన 'దాంపత్యోపనిషత్' కథలను మనసు పెట్టి చదువుకుంటే నేటి యువతీ యువకులు విడాకుల మాటే ఎత్తరని చాలా మంది అభిప్రాయం. సంసారాన్ని ఎలా రసభరితంగా చేసుకోవాలో చెప్పిన గొప్ప విశ్లేషకులు ఆయన. గృహస్థ జీవితాన్ని గురించి ఆయన చెప్పినట్లు మరెవరూ చెప్పలేదేమో.

మునిమాణిక్యం నరసింహారావు ఇరవైయ్యవ శతాబ్దం మొదటి పాదంలో ఒక కథకుడిగా రూపుదిద్దుకున్నారు. ముఖ్యంగా దంపతుల నడుమ జరిగే సున్నితమైన హాస్య శృంగార ఘట్టాలను అందించడంలో ఆయన అందె వేసిన చేయి. కుటుంబ జీవితం లోని కష్టసుఖాలు, దాంపత్య జీవితం లోని సౌందర్యం ఆయన కథలలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఆయన సృష్టించిన కాంతం తెలుగు సాహిత్యంలోనే గొప్ప స్థానం పొందింది. కాంతం" పేరు వినగానే మనకు గుర్తుకు వచ్చేది మునిమాణిక్యం నరసింహారావు. కాంతం కథల ద్వారా ఆయన తెలుగు పాఠకులకు సుపరిచితులు. తెలుగు సాహిత్యంలో ఒక "కాంతం" అన్న పాత్రను సృష్టించి ఆ పేరున ఎన్నో రచనలు చేశారు. కాంతం కథలతో తెలుగువాళ్ల మనసుల్లో చిరునవ్వులు పూయించి, మధ్య తరగతి జీవితాల్లో భార్యాభర్తల అనుబంధాన్ని కళ్లకు కట్టిన రచయిత ముని మాణిక్యం నరసింహారావు.



ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో విద్యా ప్రసారాలు అసిస్టెంట్ ప్రొడ్యూసర్ గా పని చేశారు. ఆంధ్ర సార స్వత పరిషత్, తెలుగు పండిత శిక్షణ పాఠశాల హెడ్మాష్టర్ గా హైదరాబాదులో 5 ఏళ్ళు పని చేశారు.

ముని మాణిక్యం నరసింహారావు తెనాలి తాలూకా, సంగం జాగర్లమూడిలో మార్చి 15, 1898 న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు వెంకాయమ్మ, సూర్యనారాయణ. ఆయన తెనాలిలో ఇంటర్మీడియెట్ చదివారు. డిగ్రీ చదవడానికి తాహతు లేకపోతే కొండా వెంకటప్పయ్య సహాయం వల్ల బి.ఎ చదివారు. తర్వాత గుంటూరు, భీమవరం, బందరు, కళాశాల్లో 30 ఏళ్ళు పని చేశారు. ఆదర్శ ఉపాధ్యాయులుగా పేరు తెచ్చుకొన్నారు.

ఆయన భార్య కాంతం. ఆయనకు ఇద్దరు మగ పిల్లలు. ముగ్గురు ఆడపిల్లలు. ఆంధ్ర సారస్వత పరిషత్తులో ఉపాధ్యాయుడిగా, ఆకాశవాణిలో పనిచేశారు. ఆయన రాసిన మొదటి నవల 'టీకప్పులో తుఫాను'. ఇందులోనే మొట్ట మొదటిగా కాంతం పాత్ర కనపడుతుంది. కాంతం కుటుంబం పేద కుటుంబం. కాంతం కథలలో ఒకటి ఆయన రేడియో నాటకంగా రాస్తే ఆయన కుమార్తె కాంతంగా వేసి అందరినీ మెప్పించింది.

ఆయన "కాంతం కథల" కి ఆయన భార్యే ప్రేరణ, స్ఫూర్తి. నిజ జీవితంలోనే దాంపత్య సన్నివేశాలను, చిన్న సంఘటనలను ఆధారంగా చేసుకుని రాసినవి కాబట్టే ఇప్పటికీ కాంతం కథలు నిత్య నూతన మనిపిస్తాయి. మన హాస్యం పేరుతో ఆయన చక్కని గ్రంథం వెలువరించారు. వక్రరేఖ తిరుమాళిగ, దీక్షితులు కాంతం, నేనుమా కాంతం (1933), కాంతం కైఫీయత్, కాంతం కాపురం, మునిమాణిక్యం కథలు, రుక్కుతల్లి శరద్రాత్రులు, అన్నయ మంత్రి, మరపు, స్తుతి ఆత్మస్తుతి, ఇల్లు ఇల్లాలు, మంచివాళ్ళ మాట తీరులు, గాజుల పెట్టి, తల్లి ప్రేమ అయన రచనలలో ప్రసిద్ధం. తిరుమాళిగ, దక్కు తల్లి , దీక్షితులు నవలికలు కరుణ రస భరితాలు. పిల్లలకు, విద్యార్థులకు సరిపడేలా అన్నయ మంత్రి, వక్రరేఖ నవలలను రచించారు. తిరుగు బాటు అనే నాటకం వ్రాశారు.

ఇంటావిడతో పోట్లాట, ప్రణయ కలహం, భార్యను లొంగదీసు కోవడం ఎలా వంటి రచనలు హాస్యస్ఫోరకాలు, మధ్యతరగతి సంసారాల దాంపత్య జీవిత రహస్యాలను ఆయన సజీవ పాత్రలుగా సృష్టించారు. తెలుగు సాహిత్యాన్ని తమ సునిశిత హాస్యంతో సుసంపన్నం చేసిన మునిమాణిక్యం ఫిబ్రవరి 4, 1973న మరణించారు.

# సీసీటీవీ కెమెరాలతో ప్రజలకు భద్రత

**సిఐ సత్యనారాయణ**



**విశ్వంభర, ఇనుగుర్తి:** సీసీటీవీ కెమెరాలు ప్రజల భద్రతకు ఉపయోగపడతాయని సిఐ సత్యనారాయణ అన్నారు. ఇనుగుర్తి మండలం రాము తండాలో గ్రామ సర్పంచ్ భూక్య మీటు నాయక్ 6 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దీంతో సీఐ ఇనుగుర్తి పోలీస్ స్టేషన్లో శనివారం ఎస్సై కరుణాకర్ తో కలిసి సర్పంచ్ ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, సీసీటీవీ కెమెరాలు శాంతి భద్రతల పరిరక్షణకు,నేరాల నివారణకు,అసాంఘిక కార్యక్రమాల అడ్డుకట్టకు,గ్రామ ప్రజల భద్రతకు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. మండలం లోని సర్పంచులు, ఇతర ప్రముఖులు చొరవ తీసుకొని శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి గ్రామంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

# రంజాన్ కానుకల పంపిణీ



**విశ్వంభర, గుండాల :** రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి, బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత రంజాన్ కానుకలను బండకొత్తపల్లి గ్రామంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ద్యాప కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ గద్వాల ఉపేందర్, వార్డు మెంబర్స్ ,కొడారి ఆంజనేయులు, బూర్గుల నర్సయ్య ,చీకటి ఉషా ఉపేందర్, దానెలు పాల్గొని లబ్ధిదారులకు కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రంజాన్ పండుగ సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు ననుబల ఎర్రయ్య , కాంగ్రెస్ నాయకులు సునీల్ రెడ్డి, జైపాల్ రెడ్డి ,డేవిడ్, సాయి, చింటూ, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు ఆర్థిక సాయం



**విశ్వంభర, మర్పల్లి:** మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు వీరన్న తండ్రి కోనపురం నర్సింలు ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ పార్టీ మర్పల్లి మండల అధ్యక్షుడు రామేశ్వర రెడ్డి బీజేపీ పార్టీ తరుపున బాధిత కుటుంబానికి అంత్య క్రియలకు రూ.6,500 సాయం చేశారు. స్థానిక నాయకులు బాధిత ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల లక్ష్మయ్య, మండల ప్రధాన కార్యదర్శి శ్రీమంత్ కుమార్ , సిరిపురం నాగన్న, ఉపాధ్యక్షులు మహిపాల్ రెడ్డి, మధుకర్, ప్రవీణ్ శివకుమార్, ఘనపూర్ రమేష్, సంగమేష్, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 14న బ్లూ బ్లాక్ గ్రీన్ కవాతు



**డాక్టర్ పిడమర్తి రవి**

**విశ్వంభర, బషీర్ బాగ్:** ఏప్రిల్ 14న 3 డిమాండ్స్ తో బ్లూ బ్లాక్ గ్రీన్ షర్ట్స్ కవాతు, సభ నిర్వహిస్తామని మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ చీఫ్ ప్యాట్రన్ పిడమర్తి రవి, ప్యాట్రన్ సురేందర్ సన్నీ తెలిపారు. ఏప్రిల్ 14న సాయంత్రం నాలుగు గంటల నుండి బషీర్ బాగ్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుండి 125 అడుగుల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు వేలాది మందితో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశం తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు 250 గజాల ఇవ్వాలని, ఎస్సీలకు 20 శాతం, బీసీలకు 42 శాతం, ముస్లింలు, గిరిజనులకు 12 శాతం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల జయంతి కంపెనీ ప్రకటించారు. మహనీయుల ఉత్సవాల కమిటీ చైర్మన్ గా కొండల శ్రీనాథ్ రావు, అధ్యక్షుడిగా ఎండి రహీం, కన్వీనర్ గా చందు నాయక్, మహిళా చైర్మన్ గా కోట ఉషారాణి, కన్వీనర్గా వరలక్ష్మి, విద్యార్థి జేఏసీ చైర్మన్ గా బోరెల్లి సురేష్, కన్వీనర్గా జోగు గణేష్, యూత్ కన్వీనర్ గా నక్క మహేష్, అధ్యక్షునిగా రింగు రాంబాబు ను నియమిస్తున్నామని తెలిపారు.

# రంజాన్ కిట్ల పంపిణీ



**విశ్వంభర, అంబర్‌పేట :** రంజాన్ మాసం శాంతి, సహనం, సేవా భావా లకు ప్రతీక అని అన్వర్ ఉల్ ఉలూ ఇన్స్టిట్యూషన్స్ సెక్రటరీ నవాబ్ మహ బూబ్ అలంఖాన్, టిపిసిసి ఉపాధ్యక్షులు, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ నవాబ్ ముజాహిద్ అలంఖాన్ అన్నారు. ఈ సందర్భంగా అంబర్‌పేట ఎకె ప్లాజా ఫంక్షన్ హాల్లో పెద్ద ఎత్తున మహిళలకు రంజాన్ కిట్ల పంపిణీ చేసారు.

# బావిలో యువకుడి శవం

**విశ్వంభరా, ఛత్రినాక:** హైదరాబాద్ పాతబస్తీలోని ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 4వ తేదీన 20 సంవత్సరాల గౌతమ్ కుమార్ అనే వ్యక్తి అదృష్టమైనట్టు కుటుంబ సభ్యులు ఛత్రినాక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. నిన్న రాత్రి రాజన్న బావి సమీపంలో పుల్లమ్మ బావి లో గుర్తు తెలియని మృతదేహాశీ ఉన్నదని స్థానికులు ఛత్రినాక పోలీస్ లకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్యాంక్ బండ్ శివ టీం తో మృతదేహాన్ని వెలికితీశారు. ఆ మృతదేహం గౌతమ్ కుమార్ దిగా గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఇది హత్య లేక ఆత్మహత్య అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# రేగడితండాకు సిసి రోడ్డు



**విశ్వంభర, ఇనుగుర్తి:** మండలంలోని పెద్ద తండా గ్రామపంచాయతీ పరిధిలోని రేగటి తండాలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులను సర్పంచి బానోతు రేణుక నరేష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా రేగడి తండా అభివృద్ధికి నోచుకోలేదని, కేవలం తండావాసులను ఓటు బ్యాంకుగా వాడుకున్నారన్నారు. సరైన రోడ్లు,అంతర్గత దారులతోనే తండా అభివృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు. గ్రామపంచాయతీ పాలకమండలి తండా వాసుల సహకారంతో మరింత అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి బాధావతు శిరీష, వార్డు సభ్యులు బిక్షం,సంతోష్,నరహరి,లక్ష్మి,కవిత కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బాలు, నాయకులు బిచ్చ, సీత,వెంకన్న,రవి,శ్రీను,శోభన్,దంజా సిబ్బంది సరోజ తదితరులు పాల్గొన్నారు.

# దోపిడీ కేసును ఛేదించిన సిసిఎస్ పోలీసులు

**నలుగురు నిందితుల అరెస్ట్**

**18 గ్రాముల బంగారం, 1.5 కేజీల వెండి, 3 ఆటోలు స్వాధీనం**



**విశ్వంభర, సూర్యాపేట:** కేసు వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ నరసింహ వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిందితులు కంచుకొమ్ముల సంతోష్, కంచుకొమ్ముల గణేష్, షేక్ నస్రీన్, కంచుకొమ్ముల సాయికిరణ్ ఒక ముఠాగా ఏర్పడి ఆటోలను దొంగలించి దొంగరించిన ఆటోలో ప్రయాణం చేస్తూ ఒంటరిగా ప్రయాణిస్తున్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని బెదిరించి ఆభరణాలు దొంగలించడం, దొంగలించిన ఆటోలోనే తిరుగుతూ రాత్రివేళ తాళాలు వేసిన ఇండ్లలో దొంగతనం చేయడం వీరి పద్ధతి అని తెలిపారు. సూర్యాపేట కోదాడ ప్రాంతాలకు చెందిన వీరు ముఠాగా ఏర్పడి ఈనెల 6 తేదీన ఆత్మకూర్ ఎస్ మండల పరిధిలోని కోటి నాయక్ తండ శివారులో ఒక వృద్ధురాలిని ఆటోలో ఎక్కించుకుని కొంత దూరము తీసుకువెళ్లి చంపుతామని బెదిరించి ఆమె నోరు మూసి ఆమె మెడలో ఉన్న వెండి గొలుసు దొంగలించుకొని వెళ్లారు. దీనిపై ఆత్మకూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇవ్వగా, దర్యాప్తులో భాగంగా జిల్లా సిసిఎస్ పోలీసులు ఆత్మకూరు పోలీసులు నేరానికి పాల్పడ్డ వారి కదలికలపై నిఘా పెట్టారు. ఈరోజు ఉదయం 6 గంటల సమయంలో ఆత్మకూరు మండల పరిధిలోని ఎనుబాముల గ్రామ స్టేజీ వద్ద సిసిఎస్ ఇన్స్పెక్టర్, ఆత్మకూరు ఎస్సై ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా నలుగురు అనుమానిత వ్యక్తులు ఒక ఆటోలో నిమ్మికల్ వైపు వెళుతుండగా ఆపి తనిఖీ చేసి అదుపులోకి తీసుకున్నారు. కోదాడ రాజీవ్ నగర్ కు చెందిన కంచుకొమ్ముల సంతోష్ ఏ1, కంచుకొమ్ముల గణేష్ ఏ2, కంచుకొమ్ముల సాయికిరణ్ ఏ4, సూర్యాపేటకు చెందిన షేక్ నస్రీన్ ఏ3 ఉగా గుర్తించడం జరిగింది. వీరిని విచారించగా గతములో మునగాల, సూర్యాపేట టౌన్, కోదాడ టౌన్, తిప్పర్తి, పిడుగురాళ్ల, మేళ్లచెరువు, ఫిల్మ్ నగర్, పంజాగుట్ట పోలీస్ స్టేషన్ ల పరిధిలో బంగారము ఆభరణములు, వెండి అభరణములు, వెండి వస్తువులు, ఆటోలు, మోటార్ సైకిల్, సెల్ ఫోన్లు దొంగతనము చేసినట్టు అంగీకరించారు. వారిని అదుపులోకి తీసుకొని వారి నుండి 3 లక్షల విలువైన 18 గ్రాముల బంగారం, 5 లక్షల విలువైన 1.5 కేజీల వెండి, 3 ఆటోలు, ట్యాబ్, ల్యాప్ టాప్, 1 బైకు, 1 టీవి, 2 సెల్ ఫోన్లు సీజ్ చేసినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఎస్సైలు శ్రీకాంత్, హరికృష్ణ, ఆ ర్ఎస్ఐ రాజశేఖర్, సిసిఎస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తార్నాక ఆర్టీసీ ఆసుపత్రికి కొత్త హంగులు

**ఆసుపత్రిలో పోర్టబుల్ ఎక్సరే సౌకర్యం**



**విశ్వంభర, హైదరాబాద్ :** తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రి వైద్య సేవల్లో మరో ముందడుగు పడింది. సామాజిక బాధ్యతలో భాగంగా కెనరా బ్యాంక్ అనుబంధ సంస్థ 'క్యాన్ ఫిన్ హోమ్స్' వారు రూ. 20 లక్షల విలువైన అత్యాధునిక 'మొబైల్ డిజిటల్ పోర్టబుల్ ఎక్సరే' మిషన్‌ను ఆసుపత్రికి విరాళంగా అందజేశారు. ఈ నూతన యంత్రాన్ని కెనరా బ్యాంక్ తెలంగాణ జోనల్ హెడ్ గూడ లక్ష్మణ్,ఆసుపత్రి సూపరింటెండెంట్, సిఎమ్ఓ శైలజ మూర్తి శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శైలజ మూర్తి మాట్లాడుతూ, సమాజ సేవలో భాగంగా బ్యాంకింగ్ సంస్థలు ముందుకు వచ్చి తమవంతు సహాయం అందించడం అభినందనీయమని కొనియాడారు. ఈ మొబైల్ డిజిటల్ పోర్టబుల్ ఎక్సరే మిషన్ అందుబాటులోకి రావడంతో వార్డుల్లో ఉన్న పేషంట్ల వద్దకే నేరుగా వెళ్లి ఎక్సరే తీసే అవకాశం ఉంటుందని, దీనివల్ల రోగులకు మరింత త్వరితగతిన, మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆమె వివరించారు.కెనరా బ్యాంక్ తెలంగాణ జోనల్ హెడ్ గూడ లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వీసీ, ఎండీ నాగిరెడ్డి నేతృత్వంలో తార్నాక ఆసుపత్రి సూపరింటెండెంట్, సిబ్బంది చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. సామాజిక సేవా కార్యక్ర మాల్లో కెనరా బ్యాంక్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ అడ్మినిస్ట్రేటర్ పి. శ్రీనివాస్, కెనరా బ్యాంక్ మేనేజర్లు టి.టి. అచ్యుతానందం, అశోక్ గౌతమ్, పలువురు వైద్యులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీరాములు ఆశయాలను కొనసాగిస్తాం



**విశ్వంభర, నాగారం:** సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ సీనియర్ నాయకులు కామ్రేడ్ యానాల చంద్రారెడ్డి ప్రధాన అనుచరుడు కామ్రేడ్ చెరుకు శ్రీరాములు ప్రథమ వర్ధంతి సభలో అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ అధ్యక్షులు సంపేట కాశయ్య అధ్యక్షతన నాగారం మండలం డి కొత్తపల్లి గ్రామంలో స్థూపం ఆవిష్కరించి జెండా ఎగురవేశారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు మందారి డేవిడ్ కుమార్ స్థూపావిష్కరణ చేయగా,అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రాయి కృష్ణ చిత్రపటానికి పూలమాల జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ, తన చివరి శ్వాస వరకు ఎర్రజెండాను ఎత్తుకొని ప్రజల కోసం పనిచేసిన కామ్రేడ్ చెరుకు శ్రీరాములు ఆశయాలు కొనసాగిస్తామని తెలిపారు. యానాల చంద్రా రెడ్డి ప్రధాన అనుచరుడిగా పనిచేస్తూ అనేక కేసులను నిర్బంధాలను ఎదుర్కొన్నారని ఆయన అన్నారు. గ్రామంలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా సారా ఉద్యమంలో చెరుకు శ్రీరాములు క్రియాశీలకంగా పాల్గొన్నారని ఆయన తెలిపారు. అమరవీరుల ఆశయ సాధన కోసం దోపిడి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతామని ఆయన అన్నారు .ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా కార్యదర్శి జనార్ధన్, నల్లగొండ జిల్లా కార్యదర్శి సాగర్,బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు గాజుల శ్రీనివాస్, జనశక్తి పార్టీ నాయకులు పలస యాదగిరి, బొడ్డు శంకర్, సుధాకర్ రెడ్డి, పోలెబోయిన కిరణ్, సంపేట కృష్ణమూర్తి , సర్పంచ్ దోమలపల్లి సంధ్య గోవర్ధన్, ఉప సర్పంచ్ చెరుకుపల్లి నాగరాజు ప్రజాసంఘాల నాయకులు గజ్జి రవి, పుట్టా సత్తయ్య లింగయ్య, ఉప్పలయ్య, వీరాచారి, శ్రీనివాస్, గణేష్ సైదులు,కాసం వీరయ్య రమేష్, దేవరకొండ కృష్ణ, రింగు శేఖర్ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# 28న రామన్నపేటలో జాతీయ లోక్ అదాలత్

**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ గౌరవ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు సూచనల మేరకు రామన్నపేట మండల కేంద్రంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాలులో ఈ నెల 28న శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న సందర్భంగా సమన్వయ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి యాదాద్రి భువనగిరి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ గౌరవ కార్యదర్శి వి.మాధవి లత, రామన్నపేట మండల న్యాయ సేవా సమితి గౌరవ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష, రెండవ తరగతి మేజిస్ట్రేట్ కోర్టు రామన్నపేట న్యాయమూర్తి డి.సత్తయ్య లు పాల్గొన్నారు. అదే విధంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏపిపి నిజాముద్దీన్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఎస్.శ్రవణ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఎ.మజీద్, బార్ సభ్యులు, అలాగే ప్యానల్ అడ్వకేట్లు ఎం.వెంకట్ రెడ్డి, బి.డేవిడ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పోలీస్ విభాగం నుంచి రామన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, మోత్కూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సి.వెంకటేశ్వర్లు, వలిగొండ సబ్-ఇన్‌స్పెక్టర్ వి.యుగేందర్, అడ్డగూడూరు సబ్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకట్ రెడ్డి, రామన్నపేట ఏఎస్ఐ సురేందర్, అలాగే రామన్నపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శివకృష్ణ హాజరయ్యారు. ఈ సమావేశంలో 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌కు తీసుకోవాల్సిన చర్యలు, వివిధ శాఖల మధ్య సమన్వయం, పెండింగ్ కేసులపై విస్తృతంగా చర్చించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, తమ కేసులను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించు కోవాలని న్యాయమూర్తులు సూచించారు. ఈ లోక్ అదాలత్ లో అత్యధిక కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, పోలీసు యంత్రాంగం పూర్తి సహకారం అందచేయాలని, పోలీసు వారు ముందస్తుగా లోక్ అదాలత్ నోటీసులను రాజీకి ఆమోద యోగ్యమగు కేసులలోని కక్షిదారులకు అందచేయాలని, రామన్నపేట కోర్టు పరిధిలోని ప్రతీ మారుమూల గ్రామములోని ప్రజలకు ఈ లోక్ అదాలత్ నిర్వహణ సమాచారం అందచేసేలా విస్తృత ప్రచారం చేయాలని కోరారు.





# సమస్యల పై వినతిపత్రం

**విశ్వంభర, నిజాంపేట్:** నిజాంపేట్ కైసర్ నగర్, షాపూర్ నగర్ కాలనీ వాసులు సమస్యలపై కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కు వినతిపత్రం ఇచ్చారు. వెంటనే స్పందించిన కూన శ్రీశైలం గౌడ్ త్వరలో కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

# ఉగాది పురస్కారాలకు దరఖాస్తులు




**విశ్వంభర, బషీర్ బాగ్:** ఉగాది సందర్భంగా 'లయన్స్ ఇంటర్నే షనల్ డిస్ట్రిక్ట్ 320-ఏ హైద రాబాద్' ఆధ్వర్యంలో ఈనెల 29న సికింద్రాబాద్ లయన్స్ భవన్ లో 'లయన్స్ ఉగాది పురస్కారాల' ప్రధా నోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్నర్ క్యాబినేట్ ఈవెంట్స్ ఉగాది సంబరాల చైర్మన్ లయన్ డా.ఈ.ఎస్.సూర్య నారాయణ తెలిపారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిస్ట్రిక్ట 320-ఏ చీఫ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ లయన్ పి.రమేష్ చంద్రబాబు, డిస్ట్రిక్ 320-ఏ ఇన్నర్ క్యాబినెట్ ఆడిషనల్ సెక్రటరీ లయన్ పి.ఉమా శంకర్ రెడ్డి లతో కలసి ఆయన మాట్లాడారు. ఈ పురస్కారాలను ముఖ్య అతిధిగా లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320-ఎ గవర్నర్ లయన్ జి.మహేంద్ర కుమార్ రెడ్డి, విశిష్ట అతిథులుగా, 1వ వైస్ డిస్టిక్ గవర్నర్ లయన్ సురేష్ జగ్నాని, 2వ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ శశికాంత్ హాజరవుతారని తెలిపారు. ఎంపిక కొరకు వివిధ రంగాలలో సేవలు అందిస్తున్నవారు వారి ప్రతిభను తెలియచేసే సర్టిఫికెట్స్ తోపాటు 4 పాస్పోర్ట్ సైజు ఫోటోలను ధరఖాస్తుకు జతచేసి ఈనెల 20 లోపు తమ ఆఫీస్ అడ్రస్ లయన్స్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ 320-ఎ, డోర్ నెం.1-20-164, గోకుల్ నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్-15కు పంపాలని కోరారు.

# కవి రాజిరెడ్డి కి అందెశ్రీ ఉగాది పురస్కారం



**విశ్వంభర, ఇనుగుర్తి:** మండల కేంద్రం ఇనుగుర్తి కి చెందిన అభ్యుదయ,ఆధునిక,భావ కవి శీలం రాజిరెడ్డిని రాష్ట్రస్థాయి అందెశ్రీ ఉగాది పురస్కారం వరించింది. సిద్దిపేటలో వెన్నెల సాహితీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనం లో రాజిరెడ్డి పాల్గొని అందె శ్రీ తో తనకున్న సాహిత్య సన్నిహిత సంబంధాలను సాటి కవులతో పంచుకొని లోక కవి అందె శ్రీ పై కవిత వినిపించారు.దీనిని కవులు,సభికులు మంత్రముగ్దులై ఆలకించి కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు.అనంతరం తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షులు కొండి మల్లారెడ్డి తదితర ప్రముఖుల చేతుల మీదుగా రాజిరెడ్డికి మెమొంటో,శాలువా పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా కవి శీలం మాట్లాడుతూ, అందెశ్రీ తో తనకు ఎంతో ఆత్మీయ అనుబంధం ఉన్నదని ఆయన పేరుతో పురస్కారం పొందడం ఆనందంగా ఉందని తెలిపారు.

# పటేల్ గూడలో ఇఫ్తార్ విందు

**విశ్వంభర, సంగారెడ్డి:** పటేల్ గూడ బీహెచ్ఈఎల్ మెట్రో ఎంక్లేవ్ కాలనీలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు ఇక్బాల్, శ్రీకాంత్, యునుస్, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజా విశ్వంభర
V3 NEWS లక్ష్యం సమాజహితం

# ఇంద్రేశంలో వాచ్‌మెన్ దంపతుల దారుణ హత్య

**విశ్వంభర, సంగారెడ్డి :** పటాన్‌చెరు మండలం ఇంద్రేశం మున్సిపల్ పరిధిలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న దంపతులు అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో దారుణంగా హత్యకు గురైన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. ఇటీవల వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంద్రేశం ప్రాంతంలో దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ జంట హత్యలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. పోలీసుల వివరాల ప్రకారం మృతులు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దొంగచింత తాండకు చెందిన ధరావత్ సోముల (45), ఆయన భార్య ధరావత్ మంగమ్మ (40)గా గుర్తించారు. జీవనోపాధి కోసం వారు కొన్నేళ్ల క్రితం ఇంద్రేశం ప్రాంతానికి వలస వచ్చారు. సోముల గత మూడున్నర సంవత్సరాలుగా స్థానిక బిల్డర్ వెంకటేశ్వర రెడ్డి వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



పెద్ద కుమార్తెకు ఇప్పటికే వివాహం కాగా, చిన్న కుమార్తె సానియా హాస్టల్‌లో ఉండి చదువుకుంటోంది. ఈ రోజు ఆమె పదవ తరగతి పరీక్ష రాస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో తల్లిదండ్రులు దారుణంగా హత్యకు గురవడం కుటుంబాన్ని విషాదంలో ముంచేసింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. మృత దేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఇటీవల మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన ఇంద్రేశం ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, దొంగతనాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వాచ్‌మెన్ దంపతుల హత్య మరింత కలకలం రేపింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్ తెలిపారు.



## విద్యార్థినికి సన్మానం

**విశ్వంభర, కేసముద్రం :** మహబూబాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి 'బాలవక్త' పోటీలలో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థినిని పాఠశాలలో సన్మానించారు. మహబూబాబాద్‌లో శ్రీ వీరభద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన బాలవక్త పోటీలలో కేసముద్రం మండల కేంద్రంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని గోవిందు శ్రీవిద్య డిజిటల్ విద్య వరమా, శాపమా అనే అంశంపై ప్రసంగించి ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరం



**విశ్వంభర, మియాపూర్:** మియాపూర్ డివిజన్ పరిధిలో మాతృశ్రీ నగర్ వసంత్ నగర్ కాలనీలో స్థానిక కాంగ్రెస్ నాయకులు మందారపు సాయిబాబా చౌదరి ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో ప్రజలకు ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, అందరూ ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని వెనువెంటనే తగు చికిత్సలు చేయించుకొని ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. కాలనీ వాసులు, మహిళలు పురుషులు భారీ ఎత్తున వచ్చి క్యాన్సర్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ పరీక్ష శిబిరం రేపు కూడా అందుబాటులో ఉంటుందని ఈరోజు రానివారు రేపు ఉదయం నుంచి సాయంత్రం వరకు వచ్చి క్యాన్సర్ పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గాదే శివ చౌదరి, భానుప్రకాష్, కొప్పిశెట్టి దినేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు



**విశ్వంభర,సూర్యాపేట:** రాజ్య సభ ఎంపీగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి ని శనివారం హైదరాబాదులో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, టిపిసిసి కార్యదర్శి ధరావత్ వెంకన్న నాయక్ లు కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## నిలకడగా తమ్మినేని వీరభద్రం ఆరోగ్యం



**విశ్వంభర, గచ్చిబౌలి :** సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం గుండె సంబంధిత సమస్యలతో హైదరాబాదులోని గచ్చిబౌలి ఏఐజి ఆసుపత్రిలో ఐసియులో చికిత్స పొందుతున్నారు. గత నాలుగు రోజులుగా ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. ఊపిరితిత్తుల్లో నీరు చేరడం తదితర సమస్యలతో ఆయన బాధపడుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వైద్యులు అవసరమైన చికిత్స అందిస్తున్నారని, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. మరో రెండు రోజుల్లో కోలుకునే అవకాశముందని వైద్యులు పేర్కొన్నట్లు సమాచారం. శనివారం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, పార్టీ నాయకులు బి వెంకట్, టి సాగర్, ఎండి అబ్బాస్, భూపాల్, ఆర్ వెంకట్రాములు, పి జయలక్ష్మి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

## కారల్ మార్క్స్‌కు నివాళి

**విశ్వంభర, పాల్వంచ :** కారల్ మార్క్స్ 143వ వర్ధంతి సందర్భంగా పాల్వంచలో ఆయన చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మార్క్స్ ఆలోచనలు కార్మికులు, శ్రమజీవుల హక్కుల సాధనకు దిశానిర్దేశం చేశాయని తెలిపారు. సమానత్వ సమాజ నిర్మాణానికి మార్క్స్ సిద్ధాంతాలు ఇప్పటికీ మార్గదర్శకంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబిర్ పాషా,మొన్న లక్ష్మి కుమారి, సర్పంచ్ సృజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



**విశ్వంభర, హనుమకొండ:** కాజీపేట సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సాయంత్రం వార్షికోత్సవవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాజీపేట ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, యువత మత్తుపదార్థాలకు, సెల్ఫోన్ లకు బానిసలు కావద్దని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మంచి ఆశయాన్ని ఎంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని కోరారు. అదేవిధంగా తల్లిదండ్రుల పట్ల , పెద్దల పట్ల గౌరవ మర్యాదలతో ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఈ టివి పడుతా తీయగా విన్నర్ స్వరాగ్ కీర్తన్, ఆర్.జె. మమత, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల అధినేత తాళ్ల మల్లేశం, డైరెక్టర్లు తాళ్ల వంశీ చైతన్య, వరుణ్ వైష్ణవి దంపతులు, ప్రిన్సిపాల్ డాక్టర్ వేలు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి ,హెచ్.ఓ.డి. శిల్పా, మహేందర్, భాగ్యలక్ష్మీ, అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లికి నిరాకరించిందని యువతికి హెచ్ఐవి ఇంజక్షన్

**విశ్వంభర, ఘట్కేసర్:** యువతి పెళ్లికి నిరాకరించిందని ఓ యువకుడు హెచ్ఐవి ఇంజక్షన్ ఇచ్చాడు. పోచారం ప్రాంతానికి చెందిన మనోహర్ అనే యువకుడికి ఒక యువతితో వివాహం నిశ్చయమైంది. కుటుంబ సభ్యుల సమక్షంలో పెళ్లి మాటలు కూడా జరిగాయి. అయితే కొద్ది రోజుల తర్వాత మనోహర్‌కు హెచ్ఐవీ ఉందని యువతి కుటుంబానికి తెలిసింది. దీంతో యువతి వెంటనే పెళ్లికి నిరాకరించింది. పెళ్లి రద్దు కావడంతో మనోహర్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. యువతిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 11వ తేదీన ఆమె ఇంటికి వెళ్లి తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేశాడు. యువతి పెళ్లికి నిరాకరించడంతో మనోహర్ ముందే తీసుకువచ్చిన సిరంజ్‌తో ఆమెకు బలవంతంగా ఇంజెక్షన్ ఇచ్చాడు. ఇంజెక్షన్ ఇచ్చిన వెంటనే అతడు అక్కడి నుంచి పారిపోయాడు. పోలీసుల ప్రాథమిక విచారణలో మనోహర్‌తో పాటు అతని తల్లిదండ్రులకు కూడా గతంలోనే హెచ్ఐవీ ఉన్నట్లు బయటపడింది. ఈ విషయం తెలిసిన తర్వాతే యువతి పెళ్లికి నిరాకరించింది. యువతి కుటుంబ సభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బీజేపీ ఎక్స్ సర్వీస్ మెన్ సెల్ కన్వీనర్‌గా సుంకర



**విశ్వంభర,సూర్యాపేట:** తెలంగాణ రాష్ట్రంలో మాజీ సైనికుల గుర్తింపు, వారి సమస్యల పరిష్కారం, సైనికులు రాజకీయంగా ఎదగడానికి ఒక వేదిక అవసరం అనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో "ఎక్స్ సర్వీస్ మెన్ సెల్" ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సెల్‌కు కన్వీనర్‌గా సూర్యాపేట జిల్లా వాసి రిటైర్డ్ కల్నల్ సుంకర శ్రీనివాసరావు ని నియమించారు. రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా మాజీ సైనికుల సంక్షేమం కోసం సేవలందిస్తున్న అఖిల భారత పూర్వ సైనిక్ సేవా పరిషత్ తెలంగాణ ప్రాంత రాష్ట్ర అధ్యక్షులు రిటైర్డ్ కల్నల్ సుంకర శ్రీనివాసరావు సేవలను గుర్తించి, రాష్ట్ర బీజేపీ నాయకత్వం ఈ బాధ్యతలను వారికి అప్పగించింది. ఈ సందర్భంగా కల్నల్ సుంకర శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని మాజీ సైనికుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే రాష్ట్రంలోని వివిధ జిల్లాల మాజీ సైనికుల అసోసియేషన్లతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను కూలంకషంగా చర్చించి రాష్ట్ర నాయకత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అఖిల భారత పూర్వ సైనిక్ సేవా పరిషత్ సభ్యులు, భూపాలల్లి, సిద్దిపేట తదితర జిల్లాల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

### 13 ద్విచక్ర వాహనాలు సీజ్

### ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం



**విశ్వంభర, సూర్యాపేట:** వాహనాల తనిఖీలు, జరిమానాలు ప్రజల భద్రత కోసం, రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే అని ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు ఈరోజు జిల్లా కేంద్రం 60 ఫీట్ల రోడ్డు నందు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్ లో భాగంగా మైనర్లు నడుపుతున్న 13 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేయడం జరిగిందని ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు. నిరంతర వాహనాల తనిఖీలు, వాహనాల జరిమానాలు, ఎన్ఫోర్స్మెంట్ నిర్వహణ అనేది ప్రజల భద్రత రోడ్డు ప్రమాదాల నివారణ కోసమేనని ఎస్ఐ సాయిరాం. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల వారు అజాగ్రత్తగా వాహనాలు నడుపుతూ వారు ప్రమాదంలో పడడమే కాక ఎదుటివారిని కూడా ప్రమాదంలో పడేస్తారని తెలిపారు. మైనర్ డ్రైవింగ్ అనేది చట్టాలు నేరమని పిల్లలు వాహనాలు నడుపుతూ దొరికినట్లయితే తల్లిదండ్రులపై వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మైనర్ డ్రైవింగ్ కేసుల్లో చిక్కుకునే పిల్లలకు లైసెన్సులు కూడా రావని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలు ప్రారంభం



**విశ్వంభర, హైదరాబాదు :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాల్లో పోలీసు బందోబస్తు నడుమ విద్యార్థులు మొదటి రోజు పరీక్షను రాసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. . హైదరాబాదు నగరంలోని ప్రధాన కేంద్రాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పరీక్షలు ప్రశాం తంగా నిర్వహించ బడినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పరీక్షలు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం కొనసాగనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



## పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ



**విశ్వంభర, సూర్యాపేట:** ఈరోజు నుండి ప్రారంభమైన 10వ తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించి సూర్యాపేట జిల్లా కేంద్రంలో కాకతీయ హై స్కూల్, జిల్లా పరిషత్ పాఠశాల పరీక్షా కేంద్రాలను ఎస్పి నరసింహ పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, పరీక్షా సరళిని పరిశీలించి విధులు నిర్వహిస్తున్న ఎగ్జామినేషన్ సెంటర్ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి సూచనలు సలహాలు అందించారు. పరీక్షా కేంద్రాల వద్ద నేషేద ఆజ్ఞలు 144 సెక్షన్ అమలు చేస్తున్నామని తెలిపినారు. పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ ప్రశాంతంగా పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. నిషేధ ఆజ్ఞలు ఉన్నందున పరీక్ష కేంద్ర పరిసరాల్లో లౌడ్ స్పీకర్లు, మైకులు, వాహన హరన్ లు ఉపయోగించరాదని కోరారు, జిరాక్స్ సెంటర్స్, ఇంటర్నెట్ కేంద్రాలు మూసివేయాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడికి గురవకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పరీక్షలు హాజరయ్యే విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి, ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలి అని కోరారు. వాహన పరిమితికి మించి ఎక్కువ మంది విద్యార్థులను వాహనాల్లో తరలించవద్దు అని కోరారు.

## నర్సరీ పనులను పర్యవేక్షించిన ఎండిఓ




**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామంలో 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామంలోని నర్సరీ పనులను మండల పర్యవేక్షణ అధికారి ఎండీ రావూఫ్ అలీ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రపాలనగరం గ్రామ సర్పంచ్ గర్ధాస్ విక్రమ్, పంచాయతీ కార్యదర్శి రసూల్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మంజుల, ఎండీ అమినోద్దీన్, గ్రామ పంచాయతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన మంత్రి



**విశ్వంభర, రామన్నపేట :** నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని నల్లగొండ జిల్లా, చిట్యాల మండలం, పెద్దకాపర్తి గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కందిమల్ల శశిపాలు రెడ్డి కుమారుడి వివాహానికి జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, నార్కట్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తుల ఉషయ్య గౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు

### జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్



**విశ్వంభర, మహబూబాబాద్ :** జిల్లాలోని 45 పరీక్షా కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా జరుగుతున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్ తెలిపారు. జిల్లాలో రెగ్యులర్ 8147 మంది విద్యార్థులు అలాట్మెంట్ కాగా 8141 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు, 6 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు , వన్స్ ఫెయిల్డ్ లో 4 మంది విద్యార్థులు అలాట్ కాగా ముగ్గురు విద్యార్థులు హాజరయ్యారు కాగా ఒక్కరు గైర్హాజరు అయినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు, ప్రశ్నాపత్రాల భద్రత , పరీక్షల నిర్వహణలో పూర్తి జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. కేంద్రాల వద్ద పోలీస్ భద్రత, తాగునీరు, విద్యుత్, ప్రథమ చికిత్స వంటి ఏర్పాట్లు కూడా చేసినట్లు వివరించారు. పరీక్షా కేంద్రాలను చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ మూడు టీములు 20 సెంటర్లను తనిఖీ చేశారని తెలిపారు.

## సర్పంచి, వార్డు సభ్యునికి సన్మానం



**విశ్వంభర,ఇనుగుర్తి:** మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన సర్పంచి బిక్షపతి గౌడ్, ఇనుగుర్తి కి చెందిన వార్డు సభ్యులు వేముల శ్రీనివాస్ గౌడ్ లకు గౌడ యువజన సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో హైకోర్టు ప్రముఖ అడ్వకేట్ నలమాస కృష్ణా గౌడ్ చేతులమీదుగా ఘన సన్మానం జరిగింది. మానుకోట జిల్లాలోని గౌడ సర్పంచులు,వార్డు సభ్యుల తోపాటు మున్సిపాలిటీలకు చెందిన కౌన్సిలర్లను జిల్లా కేంద్రం మానుకోటలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణా గౌడ్ మాట్లాడుతూ, పరాయి పాలకులైన ముష్కర తురక నవాబులను తరిమికొట్టి తెలంగాణ గోలకొండకు తొలి స్వదేశీ హిందూ రాజుగా ప్రఖ్యాతిగాంచిన సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో సమస్యలపై పోరాడి పరిష్కరించాలని అన్నారు.

## ఘనంగా టెక్ స్ప్రింగ్ ఫెస్ట్

**విశ్వంభర, హనుమకొండ :** హనంకొండ జిల్లా 55 డివిజన్ భీమారం సమీపంలో ఉన్న ఎస్ వీ ఎస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ నిర్వహిస్తున్నటెక్ స్ప్రింగ్ ఫెస్ట్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం ఇనాగురల్ సెషన్లకు ముఖ్య అతిథిగా శ్రీకాంత్ సిన్హా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు సాంకేతిక విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని భవిష్యత్తులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వైస్ చైర్పర్సన్ ఎర్రబెల్లి సువర్ణ మాట్లాడుతూ విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజ్ మెంట్ సభ్యులు డా. ఈ.వి. రావు, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్ అధ్యాపకులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



# ఇందూరులో ఘనంగా బ్రహ్మోత్సవాలు



**విశ్వంభర, నిజామాబాద్:** నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని నర్సింగ్ పల్లి ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు ఉదయం నిత్య హవన పూర్ణాహుతి తర్వాత సామూహిక భగవద్గీత పఠణ కార్యక్రమం నిర్వహించారు. తదుపరి షాక్తా పరిషత్ బృందం గురువు శ్రీ పవన్ శర్మ మహిళా శిష్య బృందం చే విష్ణు సహస్రనామ పారాయణం, లలిత సహస్రనామ పారాయణం, సౌందర్యలహరి సామూహిక గానం ఏర్పాటు చేశారు. భక్తులు భక్తి పరవశ్యంలో మునిగిపోయారు. భక్తులు నిజామాబాద్ నగరం, నర్సింగ్ పల్లి చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మారుమ్రోగాయి. సాయంత్రం అశ్వవాహనంపై మాడ వీధుల్లో ఊరేగిన శ్రీనివాసుడు అశ్వ వాహనం పై వచ్చిన శ్రీవారు సిరి సంపదలను తీసుకొని వస్తాడని శ్రీశ్రీశ్రీ దేవనాథ జీయర్ స్వామి వారు తెలిపారు. సాయంత్రం పూర్ణాహుతి తరువాత శ్రీవారిని అశ్వవాహనంపై మాడ వీధుల్లో ఊరేగించి దోపోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. "ఆళ్వారుల్లో చివరి ఆళ్వారు అయిన తిరుమంగై ఆళ్వారు జీవిత చరిత్రను దోపోత్సవంగా ప్రదర్శించారు". తిరుమంగై ఆళ్వారుగా మారిన పరకాలుని కథ రూపకమే దోపోత్సవం. గ్రామానికి చెందిన ఆడబిడ్డలు మంగళ హారతులతో స్వామి వారిని ఆహ్వానించారు. గ్రామ యువత ఆట పాటలతో అశ్వవాహన ఊరేగింపులో పాల్గొన్నారు. అన్ని కార్యక్రమాలు శ్రీ శ్రీ శ్రీ దేవనాథ స్వామి వారి మంగళా శాసనాలతో జరగడం పూర్వ జన్మ సుకృతం అని ఆలయ ధర్మకర్త శ్రీ నరసింహ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రధాన ధర్మకర్త నర్సింహారెడ్డి తోపాటు సినీ నిర్మాతలైన దిల్ రాజు, శిరీష్ విజయసింహా రెడ్డి, డీసీపీ బసవ రెడ్డి , సాయ రెడ్డి, ఎంపీటీసీ రాములు, నర్సారెడ్డి, పృథ్వి, ప్రవీణ్, నరాల సుధాకర్, రమేష్, భాస్కర్, నరేందర్, గంగారెడ్డి, సాయిలు, రాములు, మురళి. యజ్ఞాచార్యులు అనంత్ కుమార్ ఆచార్య తో పాటు ఆలయ అర్చక స్వాములు సంపత్ కుమారాచార్య , రోహిత్ కుమారాచార్యులు, విజయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా గణిత శాస్త్ర దినోత్సవం

**విశ్వంభర, బషీర్ బాగ్:** ప్రాచీన భారతీయ గణిత సంపద ముఖ్యంగా వేద గణితం ఆధునిక గణన పద్ధతులకు ప్రపంచవ్యాప్తంగా ప్రేరణగా నిలుస్తుందని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికల పురుషోత్తం అన్నారు. శనివారం తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో అని బిసెంట్ మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో అంతర్జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటుచేసిన సదస్సులో ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన ప్రసంగించారు. గణితం కేవలం సంఖ్యలకే పరిమితం కాదని అది తార్కిక ఆలోచన సమస్య పరిష్కారం, ఆవిష్కరణలకు పునాది అని వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డి. చెన్నప్ప ప్రసంగిస్తూ సంఖ్యల శాశ్విత జ్ఞానాన్ని స్మరించుకుంటూ విద్యార్థులు యువకులలో గణిత ఆలోచనను పెంపొందించడానికి మనందరం కట్టుబడి ఉండాలని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రీసెర్చ్ స్కాలర్ మరియు ఎన్ఎస్ఎస్ యూత్ మోటివేటర్ డాక్టర్ రవితేజ చౌహాన్ మాట్లాడుతూ ప్రపంచ గణిత శాస్త్ర దినోత్సవం జగద్గురు భారతి కృష్ణ మహారాజ్ జయంతిని వేదిక్ మ్యాథమెటిక్స్ తిరిగి వెలుగులోకి తీసుకువచ్చి ప్రపంచానికి పరిచయం చేసిన మహానుభావుడుగా ప్రసిద్ధి చెందారని ఉదాహరణలతో తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ గణిత శాస్త్రవేత్త అంతర్జాతీయ ఖ్యాతి పొందిన వేదిక్ మ్యాథమెటిక్స్ నిపుణులు డాక్టర్ సాయికిరణ్ కు భారతికృష్ణ తీర్థ మహారాజ్ స్మారక గణిత ప్రతిభ పురస్కారం 2025 ను శాలువా పూలమాల జ్ఞాపిక మరియు ప్రశంసా పత్రంతో ముఖ్య అతిథి ప్రొఫెసర్ పురుషోత్తం, డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి ప్రిన్సిపాల్ రాజవల్లి తదితరులు పాల్గొని డాక్టర్ సాయికిరణ్ కు శుభాకాంక్షలు తెలిపారు.



# ధర్పల్లిలో ఏసిపి పర్యటన

**విశ్వంభర, నిజామాబాద్:** ధర్పల్లి మండలం,హోన్నజీపేట గ్రామంలో ఎస్సీ ఎస్టీ చట్టం కింద కేసు విషయమై ఏసిపి ప్రకాష్ గ్రామాన్ని సందర్శించారు. బాధితులతో నేరుగా మాట్లాడారు. అనంతరం గ్రామస్తులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. న్యాయం చేసే విధంగా కేసు విచారణ చేస్తామని హామీ ఇచ్చారు. కేసులపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతుందని చట్టాన్నికి విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసిపి ప్రకాష్ తెలిపారు. అనంతరం సీఐ బిక్షపతి ఎస్సై సోమ శ్రీనివాస్. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం ధర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాంతామని మహిళ హత్య కేసు కు సంబంధించి ఘటన స్థలం స్వయంగా సందర్శించి ఘటనపై పూర్తి వివరాలు సేకరించారు. ఘటనకు సంబంధించిన పరిస్థితులను పరిశీలించి కేసు కొనసాగించాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుదారులు నేరుగా పోలీస్ స్టేషన్లో కానీ లేదా ఏసిపి కార్యాలయంలో కానీ ఫిర్యాదు చేయొచ్చని ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పోలీస్ వారిని సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసిన లేదా పేకాట ఆడుతున్నారని సమాచారం వెంటనే పోలీసులకు, అందించాల్సిందిగా ఆయన కోరారు. సిఐ బిక్షపతి, ఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భట్టి విక్రమార్క కుమారుడు, కోడలిని ఆశీర్వదించిన చంద్రబాబు



**విశ్వంభర, హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు విచ్చేసి, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య, కోడలు సాక్షి దంపతులను ఆశీర్వదించారు. ప్రజాభవన్‌కు చేరుకున్న చంద్రబాబుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క – నందిని దంపతులు పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, వారి భవిష్యత్తు సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందజేశారు. మార్చి 5వ తేదీన సూర్య విక్రమాదిత్య వివాహ వేడుక జరిగిన విషయం తెలిసిందే. ఆ సమయంలో భట్టి విక్రమార్క స్వయంగా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి చంద్రబాబును వివాహానికి ఆహ్వానించారు. అయితే, అప్పట్లో ఉన్న అత్యవసర కార్యకలాపాలు, బిజీ షెడ్యూల్ కారణంగా చంద్రబాబు వివాహానికి హాజరుకాలేకపోయారు. ఈ క్రమంలోనే నేడు ప్రత్యేకంగా ప్రజాభవన్‌కు విచ్చేసి నూతన దంపతులకు తన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాల సందర్శన



**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాలను రామన్నపేట మండల ఎంపీడిఓ రాములు సందర్శించారు. పరీక్షా కేంద్రాల ఏర్పాట్లు, నిర్వహణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడిఓ వెంట రామన్నపేట మేజర్ గ్రామ పంచాయతీ పంచాయతీ సెక్రెటరీ పాల్గొన్నారు.

# బోడే రామచందర్‌కు ఆహ్వానం



**విశ్వంభర, బషీర్ బాగ్:** యాదవ జేఏసీ రాష్ట్ర కమిటీ బీసీవై పార్టీ చీఫ్ బోడే రాంచందర్ యాదవ్ ను పార్టీ కార్యాలయంలో కలిసి మార్చి 15న బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహిస్తున్న యాదవ్ జేఏసీ సమావేశానికి ఆహ్వానం అందించినట్లు యాదవ జేఏసి అధ్యక్షులు దాసరి అజయ్ కుమార్, వైస్ చైర్మన్ చిలుకల శ్రీనువాస్, లీగల్ టీమ్ పొన్నం రవీందర్, జుర్రు అరుణ్ కుమార్, సీనియర్ న్యాయవాది నాగుల శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

# తల్లిదండ్రులను వేధిస్తున్న కొడుకులు

## పోలీసులకు వృద్ధుల ఫిర్యాదు

## కేసు నమోదు చేసిన చిన్నకోడూరు పోలీసులు



**విశ్వంభర, సిద్దిపేట:** ఆస్తి రాసిచ్చిన తర్వాత తల్లిదండ్రులను పట్టించుకోకుండా, కనీసం తిండి పెట్టకుండా వేధిస్తున్న ఇద్దరు కొడుకులపై చిన్నకోడూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. గంగాపూర్ గ్రామానికి చెందిన కొండి నారాయణరెడ్డి (94)కి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు రాజిరెడ్డి సిద్దిపేటలో వ్యాపారం చేస్తుండగా, చిన్న కుమారుడు పరమేశ్వర్ రెడ్డి గంగాపూర్‌లోనే వ్యవసాయం చేస్తున్నాడు. నారాయణరెడ్డి తనకున్న 7ఎకరాల భూమిని ఇద్దరు కొడుకులకు సమానంగా రిజిస్ట్రేషన్ చేశాడు. వయసు పైబడటంతో తమను చూసుకుంటారని ఆస్తిని అప్పగించగా కొడుకులు మాటమార్చారు. తల్లిదండ్రులను ఓ పాత ఇంట్లో ఉంచి, కనీస సౌకర్యాలు కల్పించకుండా తిండి కూడా సరిగ్గా పెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రశ్నిస్తే బూతులు తిడుతూ చంపుతామని బెదిరిస్తున్నారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, చిన్నకోడూరు ఎస్ఐ చంద్రమోహన్ మానవత్వంతో స్పందించారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు రాలేని స్థితిలో ఉండటంతో పోలీసులే నేరుగా నారాయణరెడ్డి నివాసానికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించారు. నిస్సహాయ వృద్ధ తల్లిదండ్రులను వేధించడం చట్టరీత్యా నేరమని, బాధ్యులైన కొడుకులపై కేసు నమోదు చేసి, చట్టరీత్య చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీను తెలిపారు.

## మహిళల సాధికారతకు సయోధ్య కృషి

**విశ్వంభర, గోల్నాక :** బస్తీల్లోని మహిళలు స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా ఎదగాలని సయోధ్య సంస్థ వివిధ శిక్షణ కార్యక్రమాలు చేపడుతోందని మాజీ కార్పొరేటర్లు దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, అమృత, డి.పి. పద్మ, దుర్గాప్రసాద్ రెడ్డి అన్నారు. గోల్నాక డివిజన్ తులసిరాం నగర్ లంకలో శనివారం సయోధ్య మహిళా మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆరోగ్య శిబిరం, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు గైనిక్ వైద్య సేవలు, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అలాగే ఇంటి నుంచే ఉపాధి పొందేందుకు టైలరింగ్, జూట్ బ్యాగులు తయారీ, వంట శిక్షణ, ద్విచక్ర వాహనం నడపడం వంటి నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆధార్, పాన్ కార్డు మార్పులు, ఆరోగ్యశ్రీ, ఈ-శ్రమ, లేబర్ కార్డులు, పుట్టిన సర్టిఫికెట్లు, వృద్ధాప్య పెన్షన్ దరఖాస్తులపై కూడా సహాయం అందించనున్నట్లు చెప్పారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన నేతలు



**విశ్వంభర, ఇనుగుర్తి :** ఇనుగుర్తి మండల కేంద్రంలోని పుప్పాల పద్మా – వెంకన్న కుమారుడి రాకేష్ వివాహ వేడుక శనివారం జరిగింది. ఈ శుభకార్యానికి మహబూబాబాద్ గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మయ్య గౌడ్ చిలువేరు, మాలమహానాడు జాతీయ కార్యదర్శి మన్నే బాబురావు, రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ముఖ్య అతిథులు గా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మంద బాబురావు ,జాతీయ కార్యదర్శి ఆశోద భాస్కర్, ఉపేందర్, మానుకోట జిల్లా అధ్యక్షులు చిట్టిమల్ల మహేష్, పప్పుల వెంకన్న, పాలకుర్తి నియోజకవర్గ అధ్యక్షులు ఎనమాల రాకేష్, కారం ప్రశాంత్, అనపర్తి నాగేష్ , ఉప్పలయ్య, ఏఎన్ఎం, కవిత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**విశ్వంభర, బాగ్ లింగంపల్లి :** మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ వ్యవస్థాపకుడు టి.ఎస్.వి. ప్రసాద్ ప్రసన్న అన్నారు. భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాదులోని బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల సాధికారత, సమాజంలో వారి పాత్రపై మాట్లాడారు. కార్యక్రమంలో చైర్పర్సన్ కేస్ సుఫల, కార్యదర్శి తులసి పద్మజ, కోశాధికారి రోహిణి, వైస్ ప్రెసిడెంట్లు అనురాధ, వి.ఎస్. లక్ష్మి, జాయింట్ సెక్రటరీలు అరుణ, విజయలక్ష్మి పాల్గొన్నారు. కార్యక్రమానికి వాణిశ్రీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సెక్రటరీ తులసి కృష్ణమూర్తి, మోటివేషన్ స్పీకర్ లక్ష్మీ ప్రియ ప్రసంగించారు. కార్యక్రమంలో ఈసీ సభ్యులు రేణుకాదేవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



**విశ్వంభర, శంషాబాద్ :** ఆన్‌లైన్ లావాదేవీలు చేసేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులతో ఓటిపిలు, బ్యాంకు వివరాలు పంచుకోవద్దు అని శంషాబాద్ డిసిపి సూచించారు. పహాడీషరీఫ్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం తుక్కుగూడలో సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. శంషాబాద్ డిసిపి, ఆర్జీఐ డివిజన్ ఏసిపి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, ఫిషింగ్ దాడులు, నకిలీ లింకులు, ఓటిపి మోసాలు, సోషల్ మీడియా హ్యాకింగ్ వంటి సైబర్ నేరాల గురించి వివరించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# వసతి గృహాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి

## మరమ్మతుల బిల్లులు ప్రతి 15 రోజులకు క్లియర్ చేస్తాం

## వారసత్వంగా ఉన్న ఆలయాలను అభివృద్ధి చేయండి

## ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు





**విశ్వంభర, హైదరాబాద్ :** సంక్షేమ వసతి గృహాల కోసం నిర్మిస్తున్న భవనాల్లో 80 శాతం పూర్తయిన వాటిని యుద్ధ ప్రతిపదికన రాబోయే మూడు నెలల్లో పూర్తిచేసి రానున్న విద్యా సంవత్సరంలో అందుబాటులోకి తీసుకురావాలని సంక్షేమ శాఖ అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తో కలిసి ఆయా సంక్షేమ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలను సమీక్షించారు. తదుపరి వైద్య, ఆరోగ్యశాఖ, దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వసతి గృహాల మరమ్మతుల బిల్లులు ప్రతి 15 రోజులకు ఒకసారి క్రమం తప్పకుండా ఆర్థిక శాఖకు వచ్చే విధంగా ఒక సీనియర్ అధికారిని నియమించి బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ఈ వేసవిలో వసతి గృహాల మరమ్మత్తు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారుల నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని తెలిపారు. సంక్షేమ వసతి గృహాల అద్దెలు, ఎలక్ట్రికల్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు ప్రతినెలా చెల్లిస్తామని సంక్షేమ శాఖ అధికారులు సకాలంలో ఆర్థిక శాఖకు బిల్లులు పంపాలని డిప్యూటీ సీఎం సూచించారు. గత ప్రభుత్వ కాలంలో ఈ బిల్లులు ఏడు నెలలకు ఒకసారి చెల్లించేవారని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. వసతి గృహాలకు సరఫరా చేస్తున్న మెటీరియల్ క్వాలిటీ చెక్ కోసం ఒక నిర్దిష్ట యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకొని నిరంతరం సమీక్షించాలని డిప్యూటీ సీఎం సూచించారు. డైట్ చార్జీలు 40 శాతం పెంచాం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచాం, సంక్షేమ వసతి గృహాలకు సంబంధించిన బిల్లులను మొదటి ప్రాధాన్యతగా గుర్తించి చెల్లిస్తున్నాం ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు నిత్యం వసతి గృహాలను సందర్శించి స్థానికంగా జరుగుతున్న బోధన, భోజనంలో నాణ్యత, సంక్షేమ వసతి గృహాల్లో సదుపాయాలను పరిశీలించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రపంచం మొత్తం ఆయుర్వేదం వైపు చూస్తున్న నేపథ్యంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా మెడిసినల్ ప్లాంట్లు పెంచేందుకు ఆయుష్ శాఖ ఏర్పాట్లు చేసుకోవాలని అందుకు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ సమావేశంలో డిప్యూటీ సీఎం సూచించారు. ఉపాధి హామీ పథకం లో భాగంగా గ్రామాల్లో పెద్ద సంఖ్యలో మెడిసినల్ ప్లాంట్లు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజలు అడవిని కాపాడుకుంటారని అటవీశాఖ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. పర్యాటక రంగం విస్తరిస్తే స్థానిక ప్రజలకు ఉపాధితో పాటు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. కాలుష్య కారకాలు వాటిని నియంత్రించకపోతే వచ్చే ప్రమాదాలు అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. తరతరాలుగా వారసత్వంగా వస్తున్న దేవాలయాల అభివృద్ధిపై దృష్టి సారించాలని దేవాదాయ శాఖ సమావేశం లో డిప్యూటీ సీఎం సూచించారు. సమావేశాల్లో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఉన్నతాధికారులు సభ్య సాచి గోష్, కృష్ణ ఆదిత్య, క్రిస్టినా, సువర్ణ, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి .. ప్రాణాలు కాపాడుకోండి : వీహెచ్

**విశ్వంభర, నాంపల్లి :** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి, విధిగా హెల్మెట్ ధరించాలని మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు అన్నారు. రోడ్ సేఫ్టీ వారోత్సవాల సందర్భంగా శనివారం హైదరాబాదు అసెంబ్లీ దారిలో హనుమంతరావు ఆధ్వర్యంలో వాహనదారులకు ఉచితంగా హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంగ్ రూట్‌లో వెళ్లడం, ముగ్గురు ఒకే వాహనంపై ప్రయాణించడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని చెప్పారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించుకొని వాటిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు మోతే రోహిత్, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, నారాయణస్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆర్. లక్ష్మణ్ యాదవ్, లక్‌పతి యాదగిరి గౌడ్ శంభుల శ్రీకాంత్ గౌడ్ , తొలుపునూరి కృష్ణ గౌడ్, గడ్డం శ్రీధర్ గౌడ్, శ్రీకాంత్ నేత, పంజాల వెంకటేష్ గౌడ్, జహంగీర్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.





## దిలీప్ కుమార్‌కు శుభాకాంక్షలు

**విశ్వంభర, ఖమ్మం:** విశ్వంభర దినపత్రిక , ఎ3 ఎలక్ట్రానిక్ మీడియా ఖమ్మం జిల్లా స్టాఫర్ ఎలుగోటి వెంకట్ ఈరోజు ఖమ్మం జిల్లా కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గద్దల దిలీప్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వంభర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు సంబంధించిన సమస్యలు, సామాజిక అంశాలు ప్రభుత్వ కార్యక్రమాలపై మీడియా కీలక పాత్ర పోషిస్తుందని గద్దల దిలీప్ కుమార్ పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న వివిధ అంశాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా ప్రధాన పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు , వ్యాపార రంగానికి సంబంధించిన వార్తలను నిష్పక్షపాతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కుంభం రవికుమార్, నరసింహ యాదవ్, ఎస్కే మల్సూర్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



**విశ్వంభర, మహబూబాబాద్ :** డోర్నకల్ మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగి షేక్ జమాల్ కి గత ఆరు నెలల నుండి వేతనాలు రావడం లేదని, ఆర్థిక ఇబ్బందులు తాళలేక జమాల్ ఆత్మహత్య చేసుకున్నారని ఎన్ హెచ్ ఎం జేఏసీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కుమార్ తెలిపారు. తక్షణమే మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఎన్ హెచ్ ఎం జేఏసీ సభ్యులు సమావేశమై రాష్ట్ర ఎన్‌హెచ్‌ఎం జేఏసీ నాయకులతో విషయాన్ని చర్చించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు ఎన్హెచ్‌ఎం జిల్లా కమిటీ యూనియన్ తరపున డాక్టర్ కుమార్ ఆధ్వర్యంలో 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలోఎన్ హెచ్ ఎం జేఏసీ జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షుడు డా. కందుల నాగరాజు, ఉపాధ్యక్షులు దార్ల జ్యోతి, సువర్ణ , నవీన్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు .

## నీటిని పొదుపుగా వాడుకోవాలి

**విశ్వంభర, రామన్నపేట:** వేసవి దృష్ట్యా మంచినీటిని వృథా చేయకుండా, సాగు, తాగు నీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వాడుకోవాలని నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఈఈ బొడ్డు సురేందర్ రావు సూచించారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వానకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడం మూలంగా భూగర్భ జలాలు పెరిగాయని,ఆ నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తాగు సాగునీటిని పొదుపుగా వాడుకోని పక్షంలో భూగర్భ జలం పెరిగిన స్థాయిలోనే అడుగంటే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే ఉమ్మడి నల్గొండ జిల్లాలో పలు ప్రాంతాలలో భూగర్భ జలాలు అడుగంటుతున్నట్లు వార్తాపత్రికల్లో కథనాలు వస్తున్నాయని అన్నారు. నల్లాల ద్వారా వచ్చే నీటిని వృథా చేయరాదని సూచించారు. రైతులు అదే పనిగా మోటర్ ఆన్ చేసి నీటిని వృథా చేయరాదని, పంటలకు సరిపోయిన తర్వాత మోటార్ విధిగా బంద్ చేయాలని ఆయన సూచించారు.

## అంగన్వాడీలో బాల మేళా



**విశ్వంభర, సిద్దిపేట:** జిల్లా కేంద్రంలోని 5వ వార్డులోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం బాల మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. మేళాలో విద్యార్థులు తాము నేర్చుకున్న ఆటాపాటలు పాడుతూ డ్యాన్స్ చేశారు. అనంతరం కౌన్సిలర్ అన్నగోని వినోద్ గౌడ్ సతీమణి లావణ్య చిన్నారులకు స్టీల్ టిఫిన్ బాక్సులను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో శారద, సూపర్‌వైజర్ స్వప్న, అంగన్వాడీ టీచర్లు జ్యోతి, చంద్రకళ, స్వప్న, సరస్వతి, మహేశ్వరి, సంతోషి, రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి ఏఎల్ఎంఎస్సి కమిటీ

**విశ్వంభర,ఇనుగుర్తి:** మండలంలోని పెద్ద తండా గ్రామపంచాయతీ పరిధిలోని భూక్యతండ అంగన్వాడి సెంటర్ లో ఏ ఎల్ ఎం ఎస్ సి కమిటీని శనివారం సర్పంచి బానోతు రేణుక నరేష్ అధ్యక్షతన ఎంపిక చేశారు. కమిటీ చైర్మన్ గా సర్పంచ్ రేణుక నరేష్, కన్వీనర్ అంగన్వాడీ టీచర్ అనిత, సభ్యులుగా హెచ్‌ఎం వద్ది సాయికుమార్, వార్డు సభ్యులు బానోతులక్ష్మి,నరహరి, గర్భిణి జరుపల శిరీష, బాలింత భూక్య జ్యోతి, ప్రీ స్కూల్ తల్లి భూక్యహారిక,బానోతు మౌనిక ఆశా వర్కర్ శోభ బానోతు జ్యోతి,భూక్య వెన్నెల ను నియమించారు. అనంతరం సర్పంచి రేణుక నరేష్ మాట్లాడుతూ పౌష్టికాహారాన్ని సకాలంలో లబ్ధిదారులకు అందించాలని సూచించారు. రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో వార్డ్ మెంబర్ భూక్యా నరహరి అంగన్వాడీ హెల్పేర్,మౌనిక, గర్భిణీ స్త్రీలు,బాలింతలు,తల్లులు, పేరెంట్స్ పాల్గొన్నారు.



# అత్యాధునిక టెక్నాలజీతో ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ

- ఆయిల్‌ఫామ్ పంటలతో రైతులకు స్థిరమైన ఆదాయం
- రైతులు ధైర్యంగా ముందుకొచ్చి పంటలు పండించాలి
- ప్రతీ జిల్లాలో ఆయిల్ ఫ్యాక్టరీ ప్రారంభించే యోచన
- మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్
- కలెక్టర్ హైమావతితో కలిసి ప్రారంభ ఏర్పాట్లు పరిశీలన



**విశ్వంభర, సిద్దిపేట:** దేశంలోనే అత్యాధునిక టెక్నాలజీతో నర్మెటలో నిర్మించిన ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని ఈనెల 22వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అదే రోజు రూ.40కోట్ల రూపాయలతో ఆయిల్ రిఫైనరీ యూనిట్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేస్తారని చెప్పారు. నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో రూ.300కోట్ల రూపాయలతో నిర్మించిన ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ కె.హైమావతి, ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ భాషా, సీపీ రష్మీ పెరుమాళ్‌తో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో తుమ్మల మాట్లాడుతూ, ఇప్పటివరకు రాష్ట్రంలో ఆయిల్ పంప్ ఫ్యాక్టరీలో క్రూడ్ ఆయిల్ మాత్రమే తీస్తున్నామన్నారు. చీడ, పీడ బాధలు, అడవి పందులు, కోతులు, వడగండ్ల వానల బాధలు లేని రైతుకు స్థిరమైన అధిక ఆదాయాన్ని సమకూర్చే ఆయిల్‌ఫామ్ తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలన్నారు. రైతులు ధైర్యంగా ముందుకొచ్చి ఆయిల్‌ఫామ్ పంటలు పండించాలని చెప్పారు. వ్యవసాయశాఖ మంత్రిగా మొదటి సంతకం నర్మెట్ట ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి చేశానని అప్పుడు రూ.12వేలు ఉన్న ధర ఇప్పుడు రూ.21వేలకు చేరిందని తెలిపారు. రూ.25వేలు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వాతావరణం ఆయిల్‌ఫామ్ పంటలు పండటానికి అనుకూలమైందని, రాష్ట్రంలో 20లక్షల ఎకరాలు, దేశవ్యాప్తంగా 70లక్షల ఎకరాల్లో పంటలు పండించడానికి అనుకూలమన్నారు. ఈనెల 20, 21, 22 తేదీలలో ఫ్యాక్టరీ ఆవరణలో రైతు మేళా నిర్వహించి, వ్యవసాయ పనిముట్లను ప్రదర్శించి శాస్త్రవేత్తలు, అధికారులు, అనుభవం గల ఆయిల్‌ఫామ్ రైతులతో అవగాహన కల్పిస్తామని చెప్పారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గుజరాత్‌లో పాల సేకరణ గ్రామీణ స్థాయి నుంచి జరుగుతుందని, అక్కడి అమూల్ పాలు దేశ వ్యాప్తంగా వ్యాపించిందన్నారు. ఇక్కడ ప్రతీ జిల్లాకు ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభించాలని మంత్రి తుమ్మల భావిస్తున్నారన్నారు. ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణం త్వరగా పూర్తి అయ్యేందుకు ప్రత్యేక చొరవ చూపారన్నారు. రైతులు సంతోషంగా ఉండాలంటే ఆయిల్‌ఫామ్ పంటలను వేసుకోవాలని సూచించారు. కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ సాధారణంగా వరిని పండించడం రైతులకు అలవాటైందని, పంట మార్పిడి చేసుకోకపోతే భవిష్యత్‌లో ఇబ్బంది పడతారని చెప్పారు. లాభాదాయకంగా వ్యవసాయం సాగించాలంటే తప్పనిసరిగా ఆయిల్‌ఫామ్ సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీవో సదానందం, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి, ఆయిల్‌ఫెడ్ అధికారులు సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాండ్ మోతతో అసెంబ్లీ దద్దరిల్లాలి




**విశ్వంభర, ముషీరాబాదు :** విశ్వంభర, ముషీరాబాదు : బ్యాండ్ వాయిద్య కళాకారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాలో బ్యాండ్ మోతతో అసెంబ్లీ దద్దరిల్లాలి, అప్పుడు మాత్రమే పాలకులు మన సమస్యలపై స్పందిస్తారు అని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.వి. రమణ అన్నారు.శనివారం హైదరాబాదు ముషీరాబాదులోని వృత్తిదారుల భవనంలో బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం సమావేశం గరుడ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.వి. రమణ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న 2026--27 బడ్జెట్‌లో వృత్తిదారుల సంక్షేమానికి 25 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బ్యాండ్ వాయిద్య కళాకారులకు ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజు నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని బ్యాండ్ వాయిద్య కళాకారులందర్నీ ఐక్యం చేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. గీత నేత కార్మికులకు ఇచ్చినట్లే కళాకారులందరికీ పెన్షన్, ఎక్స్‌గ్రేషియా కల్పించాలని, ఫెడరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 17న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే వృత్తిదారుల మహాధర్నాకు బ్యాండ్ వాయిద్య కళాకారులు తమ వృత్తి పరికరాలతో పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. త్వరలో హైదరాబాదులో బ్యాండ్ వాయిద్య మేళా నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఏ హనుమంతు, పి ప్రవీణ్, మహమ్మద్ అనిల్, వాసు, నరసింహులు, బాబ్జి, సోను, శ్రీశైలం, వెంకటేష్, ఆయుఖాన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరతపై సిపిఎం నిరసన







**విశ్వంభర, చిక్కడపల్లి :** దేశంలో గ్యాస్ కొరతకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విదేశాంగ విధానమే ప్రధాన కారణం అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు టి. జ్యోతి అన్నారు. డొమెస్టిక్, కమర్షియల్ గ్యాస్ కొరతను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం సిపిఎం గ్రేటర్ హైదరాబాదు సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాదు గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద పొయ్యిలో కట్టెలు వేసి వంట చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న గ్యాస్ సమస్యలకు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. గతంలో మూడవ ప్రపంచ దేశాలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించడంతో భారత్‌కు గౌరవం ఉండేదని, ప్రస్తుతం అమెరికా, ఇజ్రాయిల్‌తో భాగస్వామ్యం పెరగడం వల్ల పరిస్థితులు మారాయని పేర్కొన్నారు. అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం గ్రేటర్ హైదరాబాదు సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం. వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో సుమారు 33 కోట్ల గ్యాస్ కనెక్షన్లు, తెలంగాణలో ఒక కోటి 30 లక్షల కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. గ్యాస్ బుకింగ్ వ్యవస్థలో సమస్యల కారణంగా వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నగరంలో హోటళ్ల కార్యకలాపాలు కూడా ప్రభావితమవుతు న్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. శ్రీనివాసరావు, ఎం. మహేందర్, కే.ఎన్. రాజన్న, ఎం. దశరథ్, నగర కమిటీ సభ్యులు ఆర్. వెంకటేష్, జె. కుమారస్వామి, ఎన్. మారన్న, సి. మల్లేష్, ఆర్. అశోక్, జి. నరేష్, నాయకులు రమాదేవి, లీల తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలలకు ఎంపికలు



**విశ్వంభర, సిద్దిపేట:** రాష్ట్ర ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం రూరల్ మండల స్థాయి ఎంపికలు ఈనెల 17న ఉదయం 9గంటలకు చింతమడక జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల మైదానంలో నిర్వహి స్తున్నట్టు ఎంఈవో కొత్త రాజిరెడ్డి శనివారంనాడొక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే విద్యార్థులు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ఫామ్, బోనఫైడ్, ఆధార్ కార్డు, లాస్ట్ ఇయర్ ప్రోగ్రెస్ రిపోర్ట్, పుట్టిన తేదీ ధ్రువపత్రం, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోస్ 5, కుల ధ్రువీకరణ పత్రం తీసుకుని రావాలని తెలిపారు. ఎంపిక విధానం ఎత్తు, బరువు, ఫ్లెక్సిబిలిటీ, వర్టికల్ జంప్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 30మీ. ఫ్లయింగ్ స్టార్ట్, 10ఐ6షటిల్ రన్, 800మీ, పరుగు అంశాలలో పోటీలు నిర్వహించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440478436, 9704061543 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.



## భగత్ సింగ్ స్ఫూర్తితో యువత పోరాడాలి

**విశ్వంభర, విద్యానగర్ :** భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ 95వ వర్ధంతి సందర్భంగా మార్చి 23 నుంచి 30 వరకు నిర్వహించనున్న సభల పోస్టర్‌ను శనివారం హైదరాబాదులోని విద్యానగర్ మార్క్స్ భవన్‌లో పీడీఎస్‌యూ, పీవైఎల్ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కంపాటి పృథ్వీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. అనిల్ మాట్లాడుతూ , భగత్ సింగ్ స్ఫూర్తితో అన్యాయ విధానాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలని పిలుపునిచ్చారు. పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్వీ రాకేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దింటి రామకృష్ణ నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దీక్షిత, కృష్ణ, సాయి ప్రసాద్, పవన్, అంజి, వినోద్, కిరణ్, రాజు, రాంబాబు, సాయి, నరేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు



**విశ్వంభర, త్రిపురారం:** త్రిపురారం మండలంలోని జడ్పీహెచ్ఎస్ మోడల్ స్కూల్, కంప సాగర్ పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగాయి. మోడల్ స్కూల్ పాఠశాలలో 200 మంది విద్యార్థులకు గాను 200 మంది హాజరైనారు అదేవిధంగా ఉన్నత పాఠశాలలో 149 మంది విద్యార్థులకు గాను 149 మంది మొత్తము 349 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరైనారు, శనివారం రోజున 10వ తరగతి పరీక్షలను స్థానిక తహసిల్దార్ గాజుల ప్రమీల మండలంలోని రెండు సెంటర్లను సందర్శించి ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యము లేకుండా జరగాలని తెలిపారు వారితోపాటు మండల విద్యాధికారి రమావత్ రవి తదితరులు ఉన్నారు.

## యుపిఎస్సి టాపర్లతో సెమినార్

**విశ్వంభర, అశోక్ నగర్:** యుపిఎస్సి పరీక్షలో విజయం సాధించాలంటే స్థిరత్వం, క్రమశిక్షణ, సరైన వ్యూహం అత్యంత కీలకం అని యుపిఎస్సి సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఆలిండియా ర్యాంక్ 259 సాధించిన ఎస్. వర్షిత్ రెడ్డి, ర్యాంక్ 682 సాధించిన విజయసింహ రెడ్డి అన్నారు. విజన్ ఐఏఎస్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాదులో స్ఫూర్తిదాయక సెమినార్ నిర్వహించారు. యుపిఎస్సి పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో తమ అనుభవాలు, అధ్యయన వ్యూహాలను పంచుకున్నారు. హైదరాబాదుకు చెందిన ఎస్. వర్షిత్ రెడ్డి బిట్స్ పిలాని హైదరాబాదు క్యాంపస్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసి, తరువాత సాంకేతిక సంస్థల్లో రెండు సంవత్సరాలు పనిచేశారు. ప్రస్తుతం విజయవాడలోని డిజిజిఐలో ఇన్స్ట్రక్టర్‌గా పనిచేస్తున్నారు. విజయసింహ రెడ్డి కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేసి రాష్ట్ర సేవల పరీక్షలో ఉత్తీర్ణులై ప్రస్తుతం హైదరాబాదులో శిక్షణ పొందుతున్నారు. సెమినార్‌కు విజన్ ఐఏఎస్ సౌత్ రీజియన్ బ్రాంచ్ హెడ్ హరేకృష్ణ సింగ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నేరం

- పాఠశాలలు, కళాశాలల పరిసర ప్రాంతాల్లోని షాపులపై నిఘా
- ఎస్పీ డా. శబరీష్






**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల పరిసర ప్రాంతాల్లో ఉన్న షాపులపై జిల్లా పోలీసు అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశాల మేరకు విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని మరియు మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టే ఉద్దేశంతో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు పాఠశాలలు, కళాశాలల సమీపంలోని కిరాణా షాపులు, టీ స్టాల్స్, పాన్ షాపులు మరియు ఇతర దుకాణాలను పరిశీలించారు. తనిఖీలలో భాగంగా విద్యార్థులకు హానికరమైన వస్తువుల విక్రయంపై ప్రత్యేక దృష్టి సారించారు. షాపు యజమానులకు సూచనలు చేస్తూ, సిఓటిపిఏ ఆక్ట్--2003 ప్రకారం సెక్షన్ 6(ఏ) ప్రకారం 18 సంవత్సరాల లోపు వయస్సు గల వారికి సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నేరమని తెలిపారు. అలాగే సెక్షన్ 6(బి) ప్రకారం పాఠశాలలు మరియు విద్యాసంస్థల నుండి 100 గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయం చేయడం చట్ట విరుద్ధమని, జేజే యాక్ట్ -2015 సెక్షన్ 77 ప్రకారం 7 సంవత్సరాల వరకు కఠిన జైలు శిక్ష మరియు ?1,00,000 వరకు జరిమానా ఉంటుందని హెచ్చరించారు. అదేవిధంగా ఎన్ డి పి ఎస్ యాక్ట్--1985 ప్రకారం మాదకద్రవ్యాలు (డ్రగ్స్) విక్రయం, నిల్వ, రవాణా లేదా వినియోగం చేయడం తీవ్రమైన నేరమని తెలిపారు. అలాంటి కార్యకలాపాల్లో ఎవరైనా పాల్గొంటే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే షాపు యజమానులు తమ దుకాణాల వద్ద "18 సంవత్సరాల లోపు వారికి పొగాకు ఉత్పత్తుల విక్రయం చేయరాదు" అనే బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనలు పాటించని దుకాణాలపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ, జిల్లాలో విద్యార్థులను మాదకద్రవ్యాలు మరియు ఇతర చెడు అలవాట్ల నుండి దూరంగా ఉంచడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పాఠశాలలు మరియు కళాశాలల పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్, పొగాకు ఉత్పత్తుల విక్రయం జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలని, వారు ఎవరితో తిరుగుతున్నారు, ఎక్కడికి వెళుతున్నారు అనే విషయాలను గమనిస్తూ ఉండాలని సూచించారు. పిల్లలు చెడు అలవాట్లకు మరియు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు సమాజం కలిసి బాధ్యత తీసుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలో విద్యార్థులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా ఎస్పీ డా. శబరీష్ తెలిపారు.

## పంచాయతీ కార్మికుల శ్రమను గుర్తించాలి



**విశ్వంభర, అనంతగిరి:** గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పంచాయతీ నిధుల ద్వారా చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సర్కిలను రద్దు చేయాలని అనంతగిరి మండల గ్రామ పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడు మట్టపల్లి వీరబాబు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆందోళనలు, పోరాటాలు చేస్తున్న నేపథ్యంలో ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి కార్మికుల వేతనాలు చెల్లింపు ప్రక్రియలపై జరుగుతున్న కాలయాపనకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు అన్నారు. పంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల వలే గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా ప్రభుత్వం కార్మికుల అకౌంట్లో వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పంచాయతీ కార్మికుల శ్రమను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని మొదటి పి ఆర్ సి లో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల అయిన హోంగార్డు, మున్సిపల్, అంగన్వాడి, ఆశ వర్కర్లకు ,డైలీ వేజ్, వర్క్ చార్జ్డ్ ఉద్యోగులందరినీ గుర్తించిన విధంగా పంచాయతీ కార్మికులను రెండో పి ఆర్ సి లో గుర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. పంచాయతీలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల వారికి పి ఆర్ సి ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పంచాయతీ ద్వారానే కార్మికులకు వేతనాలు చెల్లించమని మార్చి రెండో తేదీన జారీ చేసిన సర్క్యులర్ ను రద్దు చేయాలని ,వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే



**విశ్వంభర, మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలోని 47వ వార్డ్ ఇస్లాం పురం లో మాజీ కౌన్సిలర్ ఘని, కౌన్సిలర్ ఫరూక్ ఆధ్వర్యంలో రంజాన్ ఉపవాస దీక్షలలో భాగంగా నిర్వహించిన.ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ మాట్లాడుతూ.. భక్తి శ్రద్ధతలో నిర్వహించే పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్షలను 24 రోజులు విజయవంతంగా పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రతిఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేసారు. ప్రతిఒక్కరు ఈ పవిత్ర ఉపవాస దీక్షలను భక్తి శ్రద్దలతో పూర్తి చేసుకొని అల్లా ఆశీస్సులు పొందాలని అన్నారు. మనం ఎల్లప్పుడూ మన మిర్యాలగూడలో కుల మతాలకు అతీతంగా ఐకమత్యంతో ఉంటూ.. ఇరు మతాలను గౌరవించుకుంటూ ఈ సమాజానికి ఆదర్శ వంతంగా ఉండాలని అన్నారు. అలాగే మిర్యాలగూడ నియోజకవర్గ ముస్లిం మైనారిటీ సోదరులకు అందరికీ ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుడిపాటి నవీన్, అబ్దుల్లా, ఇంద్ర కుమార్, రవి నాయక్, మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ నేత జన్మదిన వేడుకల్లో సబితా రెడ్డి

**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండల కేంద్రంలోని స్థానిక టీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని, గొప్ప స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మునగపాటి నవీన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళు ప్రారంభించిన బిఎల్ఆర్



**విశ్వంభర, మిర్యాలగూడ:** మిర్యాలగూడ మండలం కేశవపురం, రామోజీ తండా గ్రామంలోని లబ్ధిదారుల పలు నూతన ఇందిరమ్మ ఇళ్ళను శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు ప్రజా ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పాటైనా రెండున్నర సంవత్సరాలలో మన మిర్యాలగూడ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి పేద కుటుంబాల సొంత ఇంటి కలను నెరవేర్చాము అని అన్నారు. అతిత్వరలోనే మిర్యాలగూడ పట్టణంలో కూడా 2500 ఇళ్లకు శ్రీకారం చుట్టబోతున్నాము అని అన్నారు. గత ప్రభుత్వంలో పేద ప్రజల సంక్షేమం పక్కకు పెట్టి కమిషన్ ల కోసం రాష్టాన్ని అప్పుల కుప్పగా చేసింది అని అన్నారు.. ప్రజా ప్రభుత్వంలో పేద కుటుంబాలకు సన్నబియ్యం, నూతన రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ళు లాంటి అనేక సంక్షేమాలను పేద ప్రజలకు అందించి వారి అందరి ఆశీస్సులతో మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో, నిన్న జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వానికి నిరాజనాలు పలికి అధిక స్థానాల్లో ఆశీర్వధించారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ, మండల నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కంటి చికిత్సా శిబిరం



**విశ్వంభర, అనంతగిరి:** మండల పరిధిలో గల వాయిలసింగారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వర్గీయ గద్దె రామారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు గద్దె రఘు,గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సోషల్ వర్కర్,స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల ప్రవీణ్ రాజశేఖర్ లయన్స్ క్లబ్ కోదాడ వారి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి శాస్త్ర చికిత్స మెగా శిబిరాన్ని వినియోగించుకోవాలని సర్పంచి నందిగామ శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు ఉదయం 9 గంటలకు చికిత్స ప్రారంభం అవుతుందని, వాయిలసింగవరం, రత్నవరం, చుట్టుపక్కల తండా పరిసర గ్రామం ప్రజలు ఆధార్ కార్డు వెంట తీసుకుని వచ్చి ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని,ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుందని వారు తెలిపారు. లయన్స్ కంటి ఆసుపత్రి సూర్యపేట వైద్యులు పరీక్షించి కంటి పొరలు ఉన్నవారికి,కళ్ళజోడు అవసరమైన వారికి సబ్సిడీ ధర(రూ.250)కు మాత్రమే అందజేస్తారని ఈ అవకాశాన్ని వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారుసూచించారు.

## వనస్థలిపురంలో కలికితురాయి చేనేత, పట్టు వస్త్రాలయం ప్రారంభం

**ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన రజినీ సాయిచంద్**

**మహిళలు మెచ్చే సరికొత్త చేనేత పట్టు వస్త్రాలు: కాల్వ రాంరెడ్డి, రాధిక**

**విశ్వంభర, ఎల్బీనగర్ :** హైదరాబాద్ మహానగరంలోని అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలతో అత్యధికంగా పోటీపడుతున్నటువంటి ఎల్బీనగర్ ఈస్ట్ జోన్ ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతూ సరికొత్త వ్యాపార రంగం వైపు దూసుకెళ్తున్న తరుణంలో మరో మైలురాయికి వనస్థలిపురం వనస్థలి హిల్స్ ప్రాంతం వేదిక అయింది. ప్రముఖ చేనేత పట్టు వస్త్రాలను మహిళలకు అందించే దివంగత తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారధి, సాంస్కృతిక చైర్మన్ సాయిచందు సతీమణి రజనీ సాయిచంద్ నూతన వ్యాపార రంగం వైపు అడుగులు వేస్తూ వస్త్ర వ్యాపార రంగంలో వనస్థలిపురం ప్రాంతాన్ని ఎంచుకోవడంతోపాటు వనస్థలి హిల్స్ ప్రాంతంలో కలికితురాయి చేనేత, పట్టు వస్త్రాలయం నూతన మొదటి షో రూమ్ ను శనివారం కుటుంబ సభ్యులతో కలిసి ఆమె ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్ మహానగరంలోనే వనస్థలిపురం ప్రాంతం అంటే పచ్చదనానికి మారుపేరుగా ఉన్నటువంటి ఈ ప్రాంతంలో నూతన వస్త్ర వ్యాపారంగంలోకి తమ కుటుంబాన్ని అడుగుపెట్టడంతో పాటు మొదటి షో రూమ్ లో వనస్థలిని ప్రాంతంలో ఏర్పాటు చేయడం తమకెంతో ఆనందం ఇచ్చిందన్నారు. ఈ షో రూమ్ లో పట్టు వస్త్రాలతో పాటు చేనేత వస్త్రాలను సైతం అందుబాటులో ఉంచామన్నారు. మహిళలకు సరికొత్త వస్త్రాలను నాణ్యతతో కూడిన వస్త్రాలను అందించడం లక్ష్యంతోనే మొదటి షో రూమ్ ను ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సరళమైన ధరలతో మహిళలకు నచ్చే చేనేత పట్టు చీరలను అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సహస్ర రాఘవ హర్షిత నది చరిష్ చందు తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా ఎస్పీ నరసింహ**



**విశ్వంభర,సూర్యాపేట:** గ్యాస్ సిలిండర్ బుకింగ్ పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ అన్నారు. నకిలీ వాట్సాప్ లింకులు, తక్షణ డెలివరీ ఆశ చూపి అడ్వాన్స్ డబ్బులు అడగడం, కే వై సి అప్‌డేట్ పేరుతో ఓ టి పి అడగడం వంటివి మోసపూరిత చర్యలలో నేరగాళ్ళు నేరాలకు పాల్పడు తున్నారని పేర్కొన్నారు. అధికారిక యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలి, తెలియని లింక్‌లను క్లిక్ చేయకూడదని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా గ్యాస్ కొరత ఉందని, వెంటనే బుక్ చేసుకోండి" అని వచ్చే సందేశాలు లేదా వాట్సాప్ లింక్‌లను నమ్మవద్దని, ఇవి వ్యక్తిగత వివరాలను, డబ్బును దొంగిలించడానికి పన్నే పన్నాగంగా గ్రహించాలన్నారు. అదే విదంగా గ్యాస్ సిలిండర్ డెలివరీకి ముందు ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ పేమెంట్ చేయమని కోరితే అది మోసమని గ్రహించాలని అన్నారు. గ్యాస్ సిలిండర్‌ను అధికారిక మొబైల్ యాప్‌లు, ఏజెన్సీ వెబ్‌సైట్‌ల ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలన్నారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఒకవేళ మోసపోతే, వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని అన్నారు.

## ఐపీఎల్ టికెట్లపై వివాదం హెచ్‌సీఏపై టీసీఏ ఆరోపణలు




**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్ల పంపిణీపై వివాదం చెలరేగింది. ప్రతి మ్యాచ్‌కు వేల సంఖ్యలో ఉచిత పాస్‌లు వస్తున్నప్పటికీ అవి యువ క్రికెటర్లకు అందడం లేదని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) ఆరోపించింది.టీసీఏ ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఐపీఎల్ మ్యాచ్‌కు సుమారు 4,000 ఉచిత పాస్‌లు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కు అందుతున్నాయని తెలిపారు. ఆ పాస్‌లను అసోసియేషన్ అధికారులు తమ వద్దే ఉంచుకుంటున్నారని, నిజంగా క్రికెట్ ఆడుతున్న యువ ఆటగాళ్లకు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ పాస్‌లను ముందుగా హెచ్‌సీఏ , టీసీఏలో నమోదు చేసుకున్న యువ క్రికెటర్లకు ఇవ్వాలని టీసీఏ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధి చెందాలంటే నిజమైన ఆటగాళ్లను ప్రోత్సహించాల్సిందేనని పేర్కొంది. ఉప్పల్ స్టేడియంలో భద్రతా అంశాలపైనా టీసీఏ ఆందోళన వ్యక్తం చేసింది. అగ్నిమాపక భద్రతా అనుమతులు లేకుండానే మ్యాచ్‌లు నిర్వహిస్తే ప్రమాదకర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించింది. అవసరమైన భద్రతా ప్రమాణాలు పాటించకపోతే ఐపీఎల్ మ్యాచ్‌లను ఇతర రాష్ట్రాలకు తరలించే పరిస్థితి రావచ్చని కూడా పేర్కొంది. హెచ్‌సీఏలో పరిపాలనను శుభ్రం చేయడానికి బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా ప్రత్యేక పర్యవేక్షణ కమిటీని నియమించాలని టీసీఏ కేంద్రాన్ని కోరింది. మాజీ హెచ్‌సీఏ అధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్ కూడా కోర్టు ఆదేశాలను పట్టించుకోలేదని ఆరోపించింది. హెచ్‌సీఏలో మొత్తం ఆర్థిక అవకతవకలు రూ.300 కోట్లకు పైగా ఉండవచ్చని టీసీఏ అంచనా వేసింది. రాజకీయ నాయకులు, పవర్ బ్రోకర్లు, ప్రైవేట్ అకాడమీలు కలిసి తెలంగాణ క్రికెట్‌ను దెబ్బతీస్తున్నారని పేర్కొంది. నిజాలు బయటపడే వరకు చట్టపరమైన పోరాటం కొనసాగిస్తామని టీసీఏ ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి స్పష్టం చేశారు.

## ఆర్య వైశ్యులకు అన్ని విధాలా అండగా ఉంటా

**నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరైన ఉప్పల**



**విశ్వంభర, కొంపల్లి :** ఆర్యవైశ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. వాసవి ఆర్యవైశ్య సంఘం (సుచిత్ర , కొంపల్లి) ఆధ్వర్యంలో నూతన కమిటీకి సంబంధించిన ఇన్స్టాలేషన్ , ఓట్ సెర్మోని కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త , కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద ముఖ్య అతిథులుగా హాజరై ఆర్య వైశ్య సంఘం నూతన అధ్యక్షుడు కమిటీ సభ్యులకు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ఎంఎల్సీ బొగ్గారపు దయానంద్ , వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వా సుజాత , ధర్మిక రక్ష ఫౌండర్ చికోటి ప్రవీణ్ , నందానంద ట్రస్ట్ వ్యవస్థాపకులు నందనంపాటి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ లకు ఆర్యవైశ్య సంఘం తరఫున ఆదివారము ముషీరాబాద్ హాస్టల్ అభినందన సభ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ , టీజీ వెంకటేష్ పాల్గొంటారని ఆయన తెలిపారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఆర్యవైశ్యులందరూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు ఆర్యవైశ్యుల అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అయిత రాములు, కొడిపాక నారాయణ ,సీఎం ఓఎస్డి వేముల శ్రీనివాస్ గుప్తా, ఆర్య వైశ్యసంఘం అధ్యక్షుడు చిట్టిమిల్లి శ్రీనివాస్ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్యాస్ ఏజెన్సీనిలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**విశ్వంభర, సరూర్ నగర్ :** సరూర్నగర్ లోని ఓ గ్యాస్ ఏజెన్సీని ఆకస్మికంగా రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, సరూర్నగర్ తహసిల్దార్ వేణుగోపాల్ తో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా అక్రమాలకు పాల్పడిన, బ్లాక్ మార్కెట్లో గ్యాస్ ను విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని గ్యాస్ ఏజెన్సీలకు హెచ్చరించారు. గోడౌన్ లో స్టాక్, బుకింగ్ వివరాలను పరిశీలించారు. ఆన్లైన్లో బుకింగ్ ఉన్నవారికి గ్యాస్ పెర్ఫరా చేయాలని, ఆఫీస్ వద్ద నేరుగా సిలిండర్లు ఇవ్వరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ సివిల్ సప్లై అధికారిని వనజాత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ది బాధ్యతారాహిత్యం

- ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది
- ఆపార్టీకి దేశం గురించి ఎలాంటి విజన్ లేదు
- అసోం రాష్ట్ర యువతను హింస, ఉగ్రవాదం వైపు మళ్లించింది
- బీజేపీ ప్రభుత్వం యువతకు అపారమైన అవకాశాలను కల్పించింది



**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాల వల్ల తలెత్తే ప్రభావాలు దేశ ప్రజలపై పడకుండా కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ శనివారం అన్నారు. అయితే భారత్ సాధిస్తున్న వేగవంతమైన అభివృద్ధిని జీర్ణించుకోలేని కొన్ని అంతర్జాతీయ శక్తుల చేతుల్లో కాంగ్రెస్ పార్టీ ఒక కీలు బొమ్మగా మారిందని, అందుకే ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు, యుద్ధవాతావరణం నెలకొన్న తరుణంలో, బాధ్యతారాహిత్యంగా దేశంలో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. అసోంలోని సిల్చార్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రసంగించిన మోడీ, కాంగ్రెస్ ఈశాన్య రాష్ట్రాలను తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో బరాక్ వ్యాలీకి సముద్ర మార్గం లేకుండా సరిహద్దు గీశారని, దీని వల్ల ఆ ప్రాంతానికి సముద్ర మార్గం లేకుండా పోయిందని ఆయన అన్నారు. 'కాంగ్రెస్ పార్టీకి అసోం గురించి గానీ, దేశం గురించి గానీ ఎలాంటి విజన్ (దూరదృష్టి) లేదు. నన్ను దూషించడం, అబద్ధాలు, వదంతులు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడం మాత్రమే ఆ పార్టీ వారికి తెలుసు' అని మోడీ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అసోం రాష్ట్ర యువతను హింస, ఉగ్రవాదం వైపు మళ్లించిందని మోడీ ఆరోపించారు. కానీ బీజేపీ ప్రభుత్వం యువతకు అపారమైన అవకాశాలను కల్పించిందని పేర్కొన్నారు. "కాంగ్రెస్ ఆలోచనలు ఎక్కడ ఆగిపోతాయో, అక్కడి నుంచే మా పని ప్రారంభమవుతుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అభివృద్ధిలో వెనుకబడిన వారికి ప్రాధాన్యత ఇవ్వడమే బీజేపీ ప్రధాన మంత్రమని ఆయన పేర్కొన్నారు. ఈశాన్య భారతదేశంలో మొదటి యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ ఫోర్ లేన్ హైస్పీడ్ కారిడార్ అయిన షిల్లాంగ్ సిల్చార్ కారిడార్‌కు మోదీ శనివారం భూమి పూజ చేశారు. సుమారు రూ.22,860 కోట్ల పెట్టుబడితో చేపట్టిన ఈ 166 కి.మీ ప్రాజెక్టు, మేఘాలయఅసోం మధ్య మెరుగైన మార్గాన్ని ఏర్పరుస్తుంది. దీని వల్ల గువాహటి నుంచి సిల్చార్ మధ్య ప్రయాణ సమయం సుమారు 8.5 గంటల నుంచి దాదాపు 5 గంటలకు తగ్గుతుంది. దీనితో పాటు సిల్చార్‌లోని ఎన్‌హెచ్ 306పై ఎలివేటెడ్ కారిడార్‌కు కూడా మోడీ భూమి పూజ చేశారు. అసోంలో వ్యవసాయ విద్య, పరిశోధనలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో కరీంగంజ్ జిల్లాలోని పథర్‌కండిలో కొత్త అగ్రికల్చర్ కాలేజీకి కూడా ఆయన శంకుస్థాపన చేశారు.




## గృహకార్మికుల కోసం చట్టం తీసుకురావాలి

**విశ్వంభర, హైదరాబాద్ :** "గృహకార్మికుల హక్కులను రక్షించేందుకు తెలంగాణలో డొమెస్టిక్ వర్కర్స్ బిల్లు ప్రవేశపెట్టాలి" అని గృహకార్మికుల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గృహకార్మికుల యూనియన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన ప్రజా సమావేశంలో గృహకార్మిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 11 లక్షల గృహకార్మికులు పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనాలు, సామాజిక భద్రత, చట్టపరమైన రక్షణ కల్పించేలా డొమెస్టిక్ వర్కర్స్ బిల్లు తీసుకురావాలని కోరారు. సమావేశం అనంతరం ప్రెస్ క్లబ్ నుంచి అబిడ్స్ జనరల్ పోస్టాఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి పోస్టుకార్డులు పంపించారు. మార్చి 16 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇదే తరహా కార్యక్రమాలు సూర్యాపేట, వనపర్తి, సంగారెడ్డి, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లో కూడా నిర్వహించారు. కార్యక్రమంలో గృహకార్మికుల యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు వి. మంజుల, మాంట్‌ఫోర్ట్ సోషల్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ వర్గీస్ తెక్కనాత్, పి.ఓ.డబ్ల్యూ ప్రతినిధి సంధ్యా, సామాజిక కార్యకర్త సజయా, మీరా సంగమిత్ర, అడ్వకేట్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి



**విశ్వంభర, నారాయణగూడ :** "నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ ఫెయిర్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకుని అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి అన్నారు. నిపుణ హ్యూమన్ డెవలప్మెంట్ సొసైటీ, కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ విద్యాసంస్థల ఆవరణలో నిర్వహించిన మెగా జాబ్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగ యువత సరైన మార్గదర్శకత్వంతో ముందుకు సాగితే మంచి అవకాశాలు సాధించగలరన్నారు. ఉపాధి అవకాశాలను కల్పించే కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.
నిపుణ హ్యూమన్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్ సుభద్ర మాట్లాడుతూ పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన అభ్యర్థులకు వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ జాబ్ ఫెయిర్ నిర్వహించినట్లు తెలిపారు. మెగా జాబ్ ఫెయిర్‌కు మొత్తం 4,733 మంది అభ్యర్థులు హాజరుకాగా, అందులో 743 మంది ఎంపికయ్యారు. మరో 1,219 మంది తదుపరి ఇంటర్వ్యూ దశకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కేశవ్ మెమోరియల్ విద్యాసంస్థల కార్యదర్శి సుబ్రహ్మణ్యం శ్రీధర్ రెడ్డి, నిపుణ హ్యూమన్ డెవలప్మెంట్ సొసైటీ ప్రతినిధి కీర్తన్, కళాశాల ప్రిన్సిపల్ పి. స్రవంతి, ప్లేస్మెంట్ ఆఫీసర్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

## సోనమ్ వాంగ్‌చుక్‌పై నిర్బంధం ఎత్తివేత

### కేంద్ర హోంశాఖ ప్రకటన



**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** లద్ధాఖ్ పర్యావరణ వేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను విడుదల చేయాలని కేంద్రం నిర్ణయించింది. గత ఆరు నెలలుగా ఆయనపై కొనసాగుతున్న నిర్బంధాన్ని తక్షణమే రద్దు చేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ శనివారం పేర్కొంది. జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద ఉన్న అధికారాలను వినియోగిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. లద్ధాఖ్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా సహా రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ గతేడాది సెప్టెంబరులో లేహ్ జిల్లాలో యువత ఆందోళన చేపట్టింది. అవి హింసాత్మకంగా మారడంతో నలుగురు మృతిచెందారు. వాంగ్‌చుక్ ప్రకటనతోనే లేహ్‌లో హింస చెలరేగిందని అప్పట్లో కేంద్రం తెలిపింది. లద్ధాఖ్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా కల్పించాలని, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ 2025 సెప్టెంబర్‌లో లేహ్‌లో భారీ ఎత్తున ఆందోళనలు జరిగాయి. అవి హింసాత్మకంగా మారడంతో నలుగురు మృతిచెందారు. ఈ క్రమంలో వాంగ్‌చుక్ ప్రకటనతోనే లేహ్‌లో హింస చెలరేగిందని అప్పట్లో కేంద్రం తెలిపింది. దీంతో గతేడాది సెప్టెంబర్ 26న లేహ్ జిల్లా మెజిస్ట్రేట్ వాంగ్‌చుక్‌ను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. పోలీసులు జాతీయ భద్రతా చట్టం కింద ఆయనను అరెస్టు చేసి రాజస్థాన్‌లోని జోధ్‌పుర్ జైలుకు తరలించారు. లద్ధాఖ్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు, వారి ఆందోళనలను తొలగించేందుకు భాగస్వామ్య పక్షాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని కేంద్రం తెలిపింది. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోనమ్ వాంగ్‌చక్ శనివారం మధ్యాహ్నం జైలు నుంచి విడుదలయ్యారు. ఈ మేరకు రతనాడ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ దినేశ్ లఖావత్ ఓ ప్రకటనలో తెలిపారు.

## పంజాబ్ ప్రభుత్వం కేజ్రీవాల్‌కు ఎటిఎంలా మారిపోయింది



**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. భగవంత్ మాన్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, ఆ పార్టీ అగ్రనేత అరవింద్ కేజ్రీవాల్‌కు ఒక 'ATM'లా మారిపోయిందని షా ఆరోపించారు. అప్పులు, డ్రగ్స్, అక్రమ మత మార్పిడులు, అవినీతి, గ్యాంగ్‌స్టర్ల అరాచకాలతో పంజాబ్ నాశనమైందన్నారు. మాదకద్రవ్యాల సమస్య నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయగలిగే శక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బీజేపీకి మాత్రమే ఉందన్నారు. శనివారం పంజాబ్‌లోని మోగా జిల్లా, కిల్లి చాహ్లన్ గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో అమిత్ షా పాల్గొని మాట్లాడారు. పంజాబ్ ప్రజలు గతంలో కాంగ్రెస్ పార్టీకి, శిరోమణి అకాలీదళ్, ఆమ్ ఆద్మీ పార్టీకి అవకాశాలు ఇచ్చారని షా గుర్తు చేశారు. 2027లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే మాదకద్రవ్యాల వ్యాపారాన్ని సమూలంగా నిర్మూలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మరోవైపు, రాష్ట్రంలో శాంతిభద్రతల గురించి షా ప్రస్తావించారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల ముప్పును అంతం చేసే ధైర్యం 'ఆప్'నకు లేదని, దాన్ని అరికట్టడంలో కాంగ్రెస్, అకాలీలు ఇప్పటికే విఫలమయ్యాయని విమర్శించారు. అయితే వాటిని రాష్ట్రం నుంచి పూర్తిగా తొలగించగలిగే వారు ఎవరైనా ఉన్నారంటే, అది కేవలం నరేంద్ర మోదీ ప్రభుత్వమేనని షా వ్యాఖ్యానించారు. ఎందుకంటే, తమ ప్రభుత్వం హయాంలో జమ్ము కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేశామని, ఉగ్రవాదం కూడా చివరి దశలో ఉందని, నక్సలిజం నేడు అంతిమ దశకు చేరుకుందని షా పేర్కొన్నారు. కాబట్టి, రాబోయే ఎన్నికల్లో తమను గెలిపిస్తే రెండేళ్లలో పంజాబ్‌లో మాదకద్రవ్యాల వ్యాపారాన్ని సమూలంగా నిర్మూలిస్తామని షా హామీ ఇచ్చారు. మరోవైపు, రాష్ట్రంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల కారణంగా పరిశ్రమలు పంజాబ్‌ను విడిచిపెట్టి వెళ్లిపోతున్నాయని, ఫలితంగా నిరుద్యోగులు పెరుగుతున్నారని షా వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో మాన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను (అన్ని పంటలకు కనీస మద్దతు ధర కల్పించడం, వృద్ధాప్య పెన్షన్ మొత్తాన్ని పెంచడం) నెరవేర్చిందా అని ఆయన ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, 2027లో పంజాబ్‌లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అమిత్ షా మాట్లాడారు. ప్రజలు తమకు ఒక్క అవకాశం ఇస్తే అంతా మార్చి చూపిస్తామన్నారు. గతంలో అకాలీదళ్ సర్కార్‌లో బీజేపీ భాగస్వామిగా ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు పంజాబ్ ప్రజల ఆశీస్సులు తీసుకునేందుకే తాను ఇక్కడికి వచ్చానని చెప్పారు.



**విశ్వంభర, నారాయణగూడ :** "హ్యాకథాన్‌లు విద్యార్థుల్లో సృజనాత్మకత, వినూత్న ఆలోచనలను వెలికితీసి సాంకేతికత ఆధారిత పరిష్కారాల వైపు దారితీస్తాయి" అని భవన్స్ న్యూ సైన్స్ కాలేజ్ చైర్మన్ డాక్టర్ ఎస్. జై కిషన్ తెలిపారు. హైదరాబాదు నారాయణగూడలోని భవన్స్ న్యూ సైన్స్ కాలేజ్‌లో "ఉద్భవథాన్-2026" పేరుతో ఉదయం 10 గంటల హ్యాకథాన్ కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఏజెంటిక్ AI, ఓపెన్ ఇన్నోవేషన్ అంశాలపై ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన ఈ హ్యాకథాన్‌లో వివిధ విద్యాసంస్థల విద్యార్థులు బృందాలుగా పాల్గొని వినూత్న ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. కృష్ణారావు మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి వాస్తవ సమస్యలకు పరిష్కారాలు కనుగొనే దిశగా ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు మంచి వేదికగా నిలుస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, సహకారం, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. హ్యాకథాన్ ముగింపులో పాల్గొన్న జట్లు తమ ప్రాజెక్టులను న్యాయనిర్ణేతల ముందుంచి ప్రదర్శించగా, ఉత్తమ ప్రదర్శన కనబరిచిన బృందాలకు అవార్డులు అందజేశారు. కార్యక్రమానికి డెనోవేట్ బృందం సహకారం అందించింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి. అలేఖ్య, సురేందర్, అర్చన, మాధవి, డాక్టర్ వై. అశోక్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసే వేదికలు హ్యాకథాన్‌లు

## గిరిజనుల మధ్య జనసేన ఆవిర్భావ దినోత్సవం

- ప్రజల సమస్యలు తెలుసుకున్న జనసేనాని

**విశ్వంభర, ఏపీ బ్యూరో :** ఎవరికి ఏ సమస్య ఉన్నా నాతో పంచుకోండి. మీ కష్టాలు వినేందుకే వచ్చా' అని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గిరిజనులకు స్పష్టం చేశారు. అల్లూరి జిల్లాలో గిరిజనుల మధ్యే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పవన్ నిర్వహించారు. అడవితల్లి బాట పథకంలో భాగంగా నిర్మించిన రహదారుల పరిశీలనకు పాడేరు మండలం నందిగరువు గిరిజన గ్రామానికి వచ్చిన ఆయన దారి పొడవునా గిరిపుత్రులతో మమేకమయ్యారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈసారి ప్రజల మధ్యలోనే నిర్వహించాలని నిర్ణయించిన అధినేత పవన్‌కల్యాణ్ ఈ క్రమంలో గిరిజనుల చెంతకు వచ్చారు. అడవితల్లి బాట పథకంలో భాగంగా నిర్మించిన రహదారులు పరిశీలనతో గిరిపుత్రుల బాగోగులు తెలుసుకునేందుకు ఆయన అల్లూరి జిల్లాలో పర్యటించారు. ముందుగా అల్లూరి జిల్లా ఓనూరు నుంచి నందిగరువుకు కాలినడకన పయనమైన పవన్‌కల్యాణ్ మార్గమధ్యలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఓనూరు జంక్షన్ వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పవన్ వెంట పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, అరకు పార్లమెంటు ఇంచార్జి గంగులయ్య, నేతలు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు. అల్లూరి జిల్లా నందిగరువులో పార్టీ పతాకాన్ని పవన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిజన కళాకారుల థింసా నృత్యాన్ని పవన్‌కల్యాణ్ ఆస్వాదించారు. పవన్ సమక్షంలో పలువురు జనసేనలో చేరారు. వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఓనూరులో అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. గర్భిణి స్త్రీలకు పౌష్టికాహారం అందించారు.



### శుభాకాంక్షలు తెలియజేసిన సీఎం చంద్రబాబు, లోకేశ్

జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కి ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో, తెలుగు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో జనసేన పోషిస్తున్న పాత్ర అభినందనీయమని కొనియాడారు. ప్రజలకు అండగా నిలుస్తూ వారి భవిష్యత్ కోసం పనిచేస్తున్న జనసైనికులకు, వీరమహిళలకు, నేతలకు సీఎం ఈ సందర్భంగా శుభాభినందనలను తెలిపారు. జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. జనసేన ఏడు సిద్ధాంతాలతో ప్రజా జీవితాల్లో భాగం కావడం చాలా సంతోషమని మంత్రి అన్నారు. ఈ శుభ సందర్భంలో జనసేనాని పవనన్నకు, నేతలు, కార్యకర్తలకు లోకేశ్ హృదయపూర్వక అభినందనలను తెలియజేశారు.

## నాణ్యమైన విద్యకు ప్రభుత్వం కట్టుబడి ఉంది : రియాజ్



**విశ్వంభర, బాగ్ లింగంపల్లి:** రాష్ట్రంలో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ శాఖ చైర్మన్ రియాజ్ పేర్కొన్నారు. విద్యలో సమూలమైన మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. శనివారం హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ లెక్చరర్ ఫోరం ఆధ్వర్యంలో విద్యా పరిరక్షణ కమిటీ రిపోర్ట్ పై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ లెక్చరర్ ఫోరం చైర్మన్ డాక్టర్ కత్తి వెంకటస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రియాజ్ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యకు అవసరమైన నిధులు అందేలా బడ్జెట్ కేటాయింపుల కోసం కృషి చేస్తానని చెప్పారు. నాణ్యమైన విద్య అందించడం ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యారంగ ప్రముఖులు గోనారెడ్డి, రామకృష్ణ, గాలి వినోద్ కుమార్, గుజ్జా సత్యం, వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డీయే కూటమితో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదు

- విజయ్ పార్టీ



**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ త్వరలో ప్రకటించే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ చర్చలు వేడెక్కాయి. ముఖ్యంగా దళపతి విజయ్ నేతృత్వంలోని తమిగళ వెట్రి కజగంపైనే అందిరి దృష్టి నెలకొంది. అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్‌డీఏతో పొత్తు ఉంటుందని వార్తలు వస్తోన్న ఈ క్రమంలో విజయ్ పార్టీ క్లారిటీ ఇచ్చింది. ఎన్‌డీఏ కూటమితో పొత్తుకు ఎటువంటి ఆస్కారం లేదని స్పష్టం చేసింది. ఈ విషయమై జరుగుతున్న చర్చలు కేవలం ఊహాగానాలు మాత్రమే అని కొట్టిపారేసింది.
టీవీ కే జిల్లా కార్యదర్శులతో జరిగిన వర్చువల్ సమావేశంలో పార్టీ బలాబలాలు సహా పొత్తులపై చర్చ జరిగిందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నిర్మల్ కుమార్ తెలిపారు. ఎన్‌డీఏతో పొత్తుకు అవకాశమే లేదన్న ఆయన సిద్ధాంతాల పరంగా బీజేపీ తమకు శత్రువని పేర్కొన్నారు. ఎన్నికల్లో పొత్తు పెట్టుకొని పోటీ చేస్తే విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయని జిల్లా కార్యాదర్శులు, టీవీకే ప్రధాన కార్యదర్శికి తెలియజేసినట్లు తెలిసింది. ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ఈ ప్రచారం జరుగుతోందని పేర్కొంటూ, పార్టీ సభ్యులు అధికారిక ప్రకటనలనే నమ్మాలని కోరారు. అటు టీవీకేతో పొత్తు గురించి తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్‌ను ప్రశ్నించగా, ఆయన సూటిగా సమాధానం ఇవ్వలేదు. మీరు కూటమి గురించి ఆలోచిస్తున్నారని, తను మాత్రం తమిళనాడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనే దృష్టి ఉందని చెప్పారు. ముఖ్యంగా చట్ట వ్యవస్థ వైఫల్యం, మహిళల భద్రతపై ఆందోళన చెందుతున్నాని అన్నారు. టీవీకే స్థాపన సమయంలో విజయ్ తమ ప్రధాన రాజకీయ ప్రత్యర్థి డీఎంకే అని, సిద్ధాంతపరమైన ప్రత్యర్థి బీజేపీ అని స్పష్టం చేశారు. అయితే ఎన్‌డీఏ కూటమిలో చేరేందుకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్యవర్తిత్వం చేసినట్లు వచ్చిన వార్తలు వచ్చాయి. దీంతో టీవీకే-ఎన్‌డీఏ కూటమి అవకాశంపై చర్చలు మళ్లీ తెరపైకి వచ్చాయి. టీవీకేను ఎన్‌డీఏలో చేర్చేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఆసక్తి చూపుతున్నారని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో పార్టీ క్లారిటీ ఇవ్వడంతో పొత్తుపై స్పష్టత వచ్చింది. ఇక ఎన్నికల్లో పోటీ చేసేందుకు టీవీకే ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించింది. పార్టీకి వచ్చిన దరఖాస్తుల్లో నుంచి సుమారు 60 మందిని విజయ్ ఇంటర్వ్యూ చేసి కొన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులుగా ఎంపిక చేసినట్లు సమాచారం. అయితే కూటమి ఏర్పడితే ఆ సీట్లలో కొన్ని మిత్రపక్షాలకు ఇవ్వాల్సి వస్తుందా అనే అంశంపై కూడా జిల్లా నాయకుల అభిప్రాయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్‌డీఏ సీట్ల కేటాయింపుపై చర్చలను ఇంకా ప్రారంభించ లేదు. ఇక అధికార డీఎంకే నేతృత్వంలోని కూటమిలో భాగమైన 21 పార్టీలతో సీట్ల కేటాయింపులపై చర్చలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే పొత్తులో భాగంగా మిత్రపక్షం కాంగ్రెస్‌కు డీఎంకే 28 సీట్లు కేటాయించింది. కాగా, తమిళనాడు అసెంబ్లీ గడువు మే 10న ముగియనుంది. త్వరలోనే ఎన్నికల తేదీలను ప్రకటించే అవకాశం ఉంది. ఈ ఎన్నికల్లో అధికార డీఎంకే కాంగ్రెస్ కలిసి పోటీ చేయనున్నాయి. బీజేపీ అన్నాడీఎంకే కలిసి పోటీ చేస్తున్నాయి. నటుడు విజయ్ కూడా బరిలోకి దిగడంతో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొంది. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్ర రాజకీయ పార్టీలతో ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కీలక సమావేశం నిర్వహించారు. ఎన్నికల తేదీల నిర్ణయంలో పండుగల తేదీలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని రాజకీయ పార్టీలు కోరాయి. దీనిని పరిశీలిస్తామని సీఈసీ హామీ ఇచ్చారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే 133 స్థానాల్లో గెలుపొందింది. కాంగ్రెస్ 18 సీట్లు, పీఎంకే 5 సీట్లు, వీసీకే 4, ఇతరులు 8 స్థానాల్లో గెలుచుకున్నాయి. డీఎంకే నేతృత్వంలోని కూటమి మొత్తం 159 సీట్లు సాధించింది. ఎన్‌డీఏ 75 సీట్లు గెలుచుకుంది, అందులో అన్నాడీఎంకే 66 స్థానాల్లో విజయం సాధించింది.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
ప్రజా "విశ్వంభర"
తెలుగు దిన పత్రిక
ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా
రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్
పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108

# అద్భుత భాగస్వామ్యానికి 25 ఏళ్లు

- ఈడెన్ గార్డెన్స్ వేదికగా టెస్టు క్రికెట్ చరిత్రలోనే గొప్ప పునరాగమనాల్లో ఒకటి
- గుర్తుచేసుకున్న లక్ష్మణ్




**విశ్వంభర, స్పోర్ట్స్** : భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించిన ఈడెన్ గార్డెన్స్ అద్భుతానికి నేటితో 25 ఏళ్లు పూర్తయ్యాయి. 2001లో ఆస్ట్రేలియాపై ఫాలో ఆన్ ఆడుతూ టీమిండియా సాధించిన ఈ చారిత్రక విజయం టెస్టు క్రికెట్ చరిత్రలోనే గొప్ప పునరాగమనాల్లో ఒకటిగా నిలిచిపోయింది. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, ఆ విజయంలో కీలక పాత్ర పోషించిన మాజీ బ్యాటర్, ప్రస్తుత బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నాడు.

2001 మార్చి 14న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో నాలుగో రోజు ఆట ప్రారంభమయ్యే సమయానికి భారత్ ఓటమి అంచున ఉంది. తొలి టెస్టులో ఘోర పరాజయం పాలైన టీమిండియా, రెండో టెస్టులో ఫాలో ఆన్ ఆడుతోంది. నాలుగో రోజు ఉదయం భారత్ స్కోరు 254/4. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 20 పరుగులు వెనుకబడే ఉంది. చేతిలో ఆరు వికెట్లు మాత్రమే ఉండటంతో ఆసీస్ విజయం లాంఛనమేనని అందరూ భావించారు.

అయితే, ఓవర్‌నైట్ స్కోరు 109 పరుగులతో క్రీజులో ఉన్న వీవీఎస్ లక్ష్మణ్ అసాధారణమైన పోరాటాన్ని ప్రదర్శించాడు. అతనితో పాటు రాహుల్ ద్రవిడ్ కూడా అద్భుతంగా నిలిచాడు. ఈ ఇద్దరూ కలిసి ఆసీస్ బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తూ భారత స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. లక్ష్మణ్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడి టెస్ట్ క్రికెట్ గతిని మార్చేశాడు.

ఈ చారిత్రక భాగస్వామ్యంపై లక్ష్మణ్ 'ఎక్స్' వేదికగా స్పందించాడు. "25 ఏళ్ల క్రితం ఈడెన్ గార్డెన్స్‌లో నేను, రాహుల్ పంచుకున్న భాగస్వామ్యం ఎప్పటికీ ప్రత్యేకం. ఓటమి ఖాయమనుకున్న దశలో మేం నమ్మకం, సహనం, పట్టుదలను ఎంచుకున్నాం. ఆ భాగస్వామ్యం కేవలం పరుగుల గురించి మాత్రమే కాదు, ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకం, టీమ్‌వర్క్, ప్రతి సెషన్ కోసం పోరాడటం గురించి. రాహుల్‌తో కలిసి ఆ ప్రయాణంలో పాలుపంచుకున్నందుకు గర్వంగా ఉంది. క్రికెట్‌లో పునరాగమనాలు ఎప్పుడైనా సాధ్యమేనని గుర్తుచేసిన టెస్టు అది" అని ద్రవిడ్‌తో ఉన్న ఫొటోను షేర్ చేస్తూ లక్ష్మణ్ పేర్కొన్నాడు.

ఆ చారిత్రక ఇన్నింగ్స్‌లో లక్ష్మణ్ 281 పరుగుల వద్ద ఔటయ్యాడు. అప్పటికి ఇదే ఓ భారత బ్యాటర్ చేసిన అత్యధిక టెస్ట్ స్కోరు. మరోవైపు ద్రవిడ్ 180 పరుగులు చేసి రనౌట్ అయ్యాడు. భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌ను 657/7 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా 212 పరుగులకే కుప్పకూలింది. హర్భజన్ సింగ్ ఆరు వికెట్లతో చెలరేగి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

# సన్‌రైజర్స్ టీమ్‌లో పాకిస్థాన్ స్పిన్నర్

**విశ్వంభర, స్పోర్ట్స్** : ది హండ్రెడ్ లీగ్‌లో సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ మేనేజ్‌మెంట్ పాకిస్థాన్ ఆటగాడిని కొనుగోలు చేయడం ప్రస్తుతం క్రీడావర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. దీంతో ఆ ఫ్రాంచైజీ మేనేజ్‌మెంట్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఈ వేలంలో జట్టు ఓనర్ కావ్యామారన్, కోచ్ డానియల్ వెట్టోరీ పాల్గొనడం మరింత వివాదం అవుతుంది. తాజాగా ఈ వ్యవహారంపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పందించారు. 'మా పరిధి ఐపీఎల్ వరకే ఉంటుంది. విదేశీ లీగ్‌ల్లో జరిగే వాటిని మేం పట్టించుకోం. బీసీసీఐకు సంబంధంలేని లీగ్‌ల్లో ఏ ఫ్రాంచైజీ ఎవరిని కొనుగోలు చేసినా మాకు సంబంధం ఉండదు. విదేశీ లీగ్‌ల్లో ఏం జరిగినా, ఎవరిని కొనుగోలు చేసినా అది పూర్తిగా మేనేజ్‌మెంట్ వాళ్లదే బాధ్యత. సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ విదేశీ లీగ్ వేలంలో పాల్గొని పాక్ ఆటగాడిని కొనుగోలు చేసింది. అది వాళ్ల నిర్ణయం. కానీ, ప్రస్తుతానికి ఐపీఎల్‌లో మాత్రం ఆ దేశానికి చెందిన ప్లేయర్లు లేరు' అని బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా తెలిపారు.

**నార్తర్న్ లీడ్స్ జట్టే సన్‌రైజర్స్‌గా**

కాగా, ఇంగ్లాండ్ డొమెస్టిక్‌లో ది హండ్రెడ్ క్రికెట్ లీగ్ ఒకటి. గతేడాది ఈ లీగ్‌లో నార్తర్న్ సూపర్ ఛార్జర్స్‌గా బరిలోకి దిగిన లీడ్స్ జట్టును సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ పూర్తిగా కొనుగోలు చేసింది. ఇందులో 51 శాతం వాటాను యార్క్‌షైర్ నుంచి, మిగిలిన 49 శాతం వాటను ఇంగ్లాండ్, వేల్స్ క్రికెట్ బోర్డు నుంచి దక్కించుకొని ఈసారి సన్‌రైడర్స్ లీడ్స్ జట్టుగా బరిలోకి దిగుతోంది. ఈ క్రమంలో 2026 సీజన్ కోసం రీసెంట్‌గా వేలం జరిగింది. ఈ వేలంలో స్వయంగా ఓనర్ కావ్యామారన్, కోచ్ డానియల్ వెట్టోరీ పాల్గొన్నారు. ఈ క్రమంలో పాకిస్థాన్‌కు చెందిన స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను రూ.2.34 కోట్ల ధరకు కొనుగోలు చేశారు. అయితే అది విదేశీ లీగ్ అయినప్పటికీ ఐపీఎల్‌కు సంబంధించిన సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ పాక్ ప్లేయర్‌ను కొనుగోలు చేయడంపై విమర్శలు వచ్చాయి.

**కోచ్ స్పందన!**

అయితే పాకిస్థాన్ ప్లేయర్‌ను కొనుగోలు చేయడంపై కోచ్ వెట్టోరీ స్పష్టతనిచ్చాడు. అబ్రార్‌ను ఎందుకు జట్టులోకి తీసుకోవాల్సి వచ్చిందో చెప్పాడు. 'తొలుత వేలంలో ఆదిల్ రషీద్‌ను మిస్ అయ్యాం. దీంతో జట్టులో ఒక ఫారిన్ స్పిన్నర్ ఉండాలని మేం భావించాం. ఈ క్రమంలోనే ఐదుగురు స్పిన్నర్లను అనుకున్నాం. అందులో అబ్రార్ మెరుగైన బౌలర్‌గా భావించాం. అందుకే అతడిని కొనుగోలు చేశాం' అని వివరణ ఇచ్చాడు. అయితే భారత్ పాక్ మధ్య సంబంధాలపై స్పందించేందుకు మాత్రం విట్టోరి నిరాకరించాడు. కోచ్ వివరణ ఇచ్చినప్పటికీ అభిమానులు మాత్రం విమర్శలు ఆపడం లేదు.

**అకౌంట్ సస్పెండ్**

ఈ పరిణామాల వేళ సన్‌రైజర్స్ లీడ్స్ సోషల్ మీడియా ఎక్స్ అకౌండ్ సస్పెండ్ అయ్యింది. యూజర్లు ఈ ఖాతా ప్రొఫైల్ ఓపెన్ చేయాలని ప్రయత్నిస్తుంటే 'దిస్ అకౌంట్ ఈజ్ సస్పెండెడ్' అని వస్తుంది. దీంతో ఈ ఆకౌంట్‌ను భారత్‌లో నిలిపివేశారని నెటిజన్లు భావిస్తున్నారు. అయితే దీనిపై ఎక్స్ నుంచి ఎలాంటి వివరణ రాలేదు.

**సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు**

హ్యారీ బ్రూక్ (కెప్టెన్), మిచెల్ మార్ష్, అబ్రార్ అహ్మద్, నాథన్ ఎల్లిస్, బ్రైడాన్ కార్స్, ర్యాన్ రికెల్టన్ (బ్యాటర్/వికెట్ కీపర్), జాక్ క్రాలీ, మాథ్యూ పాట్స్, డాన్ లారెన్స్, బెన్ హోవెల్, టామ్ లాస్, టామ్ అల్సోప్, రీస్ టోప్లీ, ఎడ్వర్డ్ బర్నార్డ్.

## రోజర్ బిన్నీ, ద్రవిడ్, మిథాలీ రాజ్‌కు

# అరుదైన గౌరవం

**విశ్వంభర, స్పోర్ట్స్** : భారత దిగ్గజ క్రికెటర్లు రోజర్ బిన్నీ, రాహుల్ ద్రవిడ్, మిథాలీ రాజ్ అరుదైన గౌరవం దక్కింది. తమతమ కెరీర్‌లో భారత క్రికెట్‌కు అందించిన సేవలకు గానూ బీసీసీఐ ఈ ముగ్గురిని 'జీవితకాల సాఫల్య పురస్కారం' తో గౌరవించింది. కల్నల్ CK నాయుడు పేరుతో ఇస్తున్న ఈ పురస్కారానికి ఈసారి ఈ ముగ్గురు ఎంపికయ్యారు. ఈ మేరకు బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా వెల్లడించారు. అలాగే 2024 25 ఏడాదికిగానూ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత క్రికెటర్లకు బీసీసీఐ నమన్ అవార్డులు ప్రకటించింది. అత్యుత్తమ అంతర్జాతీయ పురుష క్రికెటర్‌గా వన్డే, టెస్టు ఫార్మాట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేసింది. అలాగే మహిళల విభాగంలో స్మృతి మంధాన ఉత్తమ అంతర్జాతీయ మహిళా క్రికెటర్‌గా వరుసగా రెండోసారి ఎంపికైంది. వీళ్లతోపాటు ఆయా విభాగాల్లో బీసీసీ నమన్ అవార్డులు ప్రకటించింది. మార్చి 15న ఢిల్లీ వేదికగా జరగనున్న కార్యక్రమంలో ఈ అవార్డుల ప్రదానం ఉంటుంది.

**2024- 2025 - నమన్ పురస్కారాల పూర్తి జాబితా**

- కల్నల్ సి.కె. నాయుడు జీవితకాల సాఫల్య పురస్కారం : రాహుల్ ద్రవిడ్
- కల్నల్ సి.కె. నాయుడు జీవితకాల సాఫల్య పురస్కారం: రోజర్ బిన్నీ
- బీసీసీఐ మహిళల జీవితకాల సాఫల్య పురస్కారం: మిథాలీ రాజ్
- పాలి ఉమ్రిగర్ పురస్కారం అత్యుత్తమ అంతర్జాతీయ పురుష క్రికెటర్ : శుభ్‌మన్ గిల్
- అత్యుత్తమ అంతర్జాతీయ క్రికెటర్ : స్మృతి మంధాన
- అత్యుత్తమ అంతర్జాతీయ అరంగేట్రం (పురుషులు) : హర్షిత్ రాణా
- అత్యుత్తమ అంతర్జాతీయ అరంగేట్రం (మహిళలు): ఎన్ శ్రీ చరణి
- అంతర్జాతీయ వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన మహిళా క్రికెటర్ : స్మృతి మంధాన
- అంతర్జాతీయ వన్డేల్లో అత్యధిక వికెట్లు తీసిన మహిళా క్రికెటర్ : దీప్తి శర్మ
- బీసీసీఐ దేశవాళీ టోర్నమెంట్‌లలో అత్యుత్తమ ప్రదర్శన: ముంబయి క్రికెట్ అసోసియేషన్
- లాలా అమర్‌నాథ్ పురస్కారం రంజీ ట్రోఫీలో అత్యుత్తమ ఆల్‌రౌండర్ (ఎలైట్ గ్రూప్): హర్ష్ దూబే (విదర్భ)
- లాలా అమర్‌నాథ్ పురస్కారం దేశవాళీ పరిమిత ఓవర్ల పోటీలలో అత్యుత్తమ ఆల్‌రౌండర్: ఆయుష్ మత్రే (ముంబయి)
- మాధవరావు సింధియా పురస్కారం రంజీ ట్రోఫీలో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడు (ప్లేట్ గ్రూప్): స్నేహల్ కౌతంకర్ (గోవా)
- మాధవరావు సింధియా పురస్కారం రంజీ ట్రోఫీలో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడు (ఎలైట్ గ్రూప్): వై వి రాథోడ్ (విదర్భ)
- మాధవరావు సింధియా పురస్కారం రంజీ ట్రోఫీలో అత్యధిక వికెట్లు తీసిన ఆటగాడు (ప్లేట్ గ్రూప్): సుచిత్ జె (నాగాలాండ్)
- మాధవరావు సింధియా పురస్కారం రంజీ ట్రోఫీలో అత్యధిక వికెట్లు తీసిన ఆటగాడు (ఎలైట్ గ్రూప్): హర్ష్ దూబే (విదర్భ)
- ఎం.ఏ. చిదంబరం ట్రోఫీ యూ23 కల్నల్ సి.కె. నాయుడు ట్రోఫీ అత్యధిక పరుగులు (ప్లేట్ గ్రూప్) R జశ్వంత్ శ్రీరామ్ (పుదుచ్చేరి)
- ఎంఏ చిదంబరం ట్రోఫీ: యూ23 కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ అత్యధిక పరుగులు (ఎలైట్ గ్రూప్) మాక్‌నీల్ హెచ్. ఎన్ (కర్ణాటక)
- ఎంఏ చిదంబరం ట్రోఫీ : యూ23 కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ అత్యధిక వికెట్లు (ప్లేట్ గ్రూప్) : దీప్‌జ్యోత్ సైకియా (అసోం)
- ఎంఏ చిదంబరం ట్రోఫీ: యూ23 కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ అత్యధిక వికెట్లు (ఎలైట్ గ్రూప్) : విక్కీ (మహారాష్ట్ర)
- ఎంఏ చిదంబరం ట్రోఫీ : యూ19 కూచ్ బెహార్ ట్రోఫీ అత్యధిక పరుగులు (ప్లేట్ గ్రూప్) : రాఘవన్ రామమూర్తి (పుదుచ్చేరి)
- ఎంఏ చిదంబరం ట్రోఫీ : యూ19 కూచ్ బెహార్ ట్రోఫీ అత్యధిక పరుగులు (ఎలైట్ గ్రూప్) : నిత్య జే పాండ్ర (బరోడా)
- ఎంఏ చిదంబరం ట్రోఫీ : యూ19 కూచ్ బెహార్ ట్రోఫీ అత్యధిక వికెట్లు (ప్లేట్ గ్రూప్) అర్కాజిత్ రాయ్ (త్రిపుర)
- ఎంఏ చిదంబరం ట్రోఫీ : యూ19 కూచ్ బెహార్ ట్రోఫీ అత్యధిక వికెట్లు తీసిన (ఎలైట్ గ్రూప్) ఎలైట్ : హేమచదేశన్ జీ(తమిళనాడు)
- జగ్మోహన్ దాల్మియా ట్రోఫీ : యూ16 విజయ్ మర్చంట్ ట్రోఫీ అత్యధిక పరుగులు (ప్లేట్ గ్రూప్) : ప్రీతమ్ రాజ్ (బిహార్)
- జగ్మోహన్ దాల్మియా ట్రోఫీ : యూ16 విజయ్ మర్చంట్ ట్రోఫీ అత్యధిక పరుగులు (ఎలైట్ గ్రూప్) : శంతను సింగ్ (ఉత్తరప్రదేశ్)
- జగ్మోహన్ దాల్మియా ట్రోఫీ: యూ16 విజయ్ మర్చంట్ ట్రోఫీ అత్యధిక వికెట్లు (ప్లేట్ గ్రూప్) : కిషన్ సర్కార్ (త్రిపుర)
- జగ్మోహన్ దాల్మియా ట్రోఫీ: యూ16 విజయ్ మర్చంట్ ట్రోఫీ అత్యధిక వికెట్లు (ఎలైట్ గ్రూప్) : యశ్వర్ధన్ సింగ్ చౌహాన్ (మధ్యప్రదేశ్)
- జగ్మోహన్ దాల్మియా ట్రోఫీ: ఉత్తమ మహిళా క్రికెటర్ (సీనియర్ డొమెస్టిక్): షఫాలీ వర్మ (హరియాణా)
- జగ్మోహన్ దాల్మియా ట్రోఫీ: ఉత్తమ మహిళా క్రికెటర్ (జూనియర్ డొమెస్టిక్): ఐరా జాదవ్ (ముంబయి)




# దిగొచ్చిన బంగారం, వెండి ధరలు

**విశ్వంభర, బిజినెస్** : అంతర్జాతీయంగా అనిశ్చితి కారణంగా స్టాక్ మార్కెట్లు, రూపాయి విలువతో పాటు బంగారం, వెండి ధరలు కూడా మరింత కిందకు దిగివస్తున్నాయి. శనివారం కూడా బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండడమే బంగారం, వెండి తగ్గుదలకు కారణంగా కనిపిస్తోంది. శనివారం ఉదయం 10:10 గంటల సమయంలో హైదారాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,59,660కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.1030 మేర తగ్గుదల నమోదు చేసింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,350 దగ్గర ఉంది (live gold rates). నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.950 మేర తగ్గింది. మరోవైపు వెండి ధరలు కూడా శనివారం తగ్గుదల నమోదు చేశాయి. వెండి కిలోకు రూ.4,900 వేల మేర తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.75 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.8 లక్షలుగా ఉంది. గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచన.

# అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం

**ఇండిగో ఫ్యూయల్ చార్జీ బాదుడు**




**విశ్వంభర, బిజినెస్** : పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్, అమెరికాఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు అంతర్జాతీయ చమురు మార్కెట్‌పై ప్రభావం చూపడంతో విమాన ఇంధన ధరలు (ఏటీఎఫ్) పెరుగుతున్నాయి. దీని ప్రభావం ఇప్పుడు విమానయాన రంగంలో స్పష్టంగా కనిపిస్తోంది. ఇంధన ధరలు పెరగడంతో విమానయాన సంస్థలు నిర్వహణ వ్యయాలను సమతుల్యం చేసుకునేందుకు ప్రయాణికులపై అదనపు ఛార్జీలు విధించడం ప్రారంభించాయి.

ఇప్పటికే టికెట్ ధరలను పెంచిన విమానయాన సంస్థలు ఇప్పుడు ఫ్యూయల్ సర్‌ఛార్జ్ పేరిట కొత్తగా అదనపు భారం మోపేందుకు సిద్ధమయ్యాయి. దేశీయంగా పెద్ద విమానయాన సంస్థలలో ఒకటైన ఇండిగో కూడా ఇంధన సర్‌ఛార్జ్ అమలు చేయాలని నిర్ణయించింది. మార్చి 14 నుంచి ఈ కొత్త ఛార్జీలు అమల్లోకి రానున్నట్లు సంస్థ ప్రకటించింది. ఇండిగో ప్రకటించిన వివరాల ప్రకారం, ఒక్కో విమాన టికెట్‌పై రూ.425 నుంచి రూ.2300 వరకు ఫ్యూయల్ సర్‌ఛార్జ్ వసూలు చేయనున్నారు. దీనివల్ల ఇప్పటికే పెరిగిన విమాన టికెట్ ధరలు మరింత పెరగనున్నాయి. ప్రయాణించే మార్గాన్ని బట్టి ఈ అదనపు ఛార్జీలు వేరువేరుగా ఉండనున్నాయి.

**టికెట్లపై అదనపు ఫ్యూయల్ ఛార్జీ**

దేశీయ మార్గాల్లో ప్రయాణించే విమాన టికెట్లపై రూ.425 చొప్పున అదనపు ఫ్యూయల్ ఛార్జీ విధించనున్నారు. మధ్యప్రాచ్య దేశాలకు వెళ్లే విమాన టికెట్లపై రూ.900 చొప్పున సర్‌ఛార్జ్ వసూలు చేయనున్నారు. అలాగే ఆగ్నేయాసియా, చైనా, పశ్చిమాసియా ప్రాంతాలకు వెళ్లే విమానాలకు రూ.1800 వరకు అదనపు ఛార్జీ విధించనున్నారు. యూరప్‌కు వెళ్లే విమాన టికెట్లపై అయితే రూ.2300 వరకు ఫ్యూయల్ సర్‌ఛార్జ్ వసూలు చేయనున్నట్లు ఇండిగో తెలిపింది.

విమానయాన సంస్థల నిర్వహణ వ్యయాల్లో ఇంధనం కీలక పాత్ర పోషిస్తుంది. మొత్తం నిర్వహణ వ్యయాల్లో దాదాపు 40 శాతం వరకు ఇంధన వ్యయం ఉంటుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయంగా ఏటీఎఫ్ ధరలు పెరగడంతో విమానయాన సంస్థలపై ఆర్థిక భారం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో తప్పనిసరి పరిస్థితుల్లో స్వల్ప మొత్తంలో ప్రయాణికులపై అదనపు ఛార్జీలు విధించాల్సి వచ్చిందని ఇండిగో సంస్థ తన ప్రకటనలో వెల్లడించింది.

**రూ.399 చొప్పన ఇంధన సర్‌ఛార్జ్ వసూలు!**

ఇక మరోవైపు ఎయిరిండియా కూడా ఇప్పటికే టికెట్లపై ఇంధన సర్‌ఛార్జ్ అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు మార్చి 12 నుంచి దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో ప్రయాణించే టికెట్లపై అదనపు ఫ్యూయల్ ఛార్జీలు విధిస్తున్నాయి. దేశీయ మార్గాలు, సార్క్ దేశాలకు వెళ్లే విమాన టికెట్లపై రూ.399 చొప్పున ఇంధన సర్‌ఛార్జ్ వసూలు చేస్తున్నారు. అలాగే పశ్చిమాసియా దేశాలకు వెళ్లే విమాన టికెట్లపై 10 డాలర్లు అదనంగా వసూలు చేస్తున్నారు. ఆఫ్రికా దేశాలకు వెళ్లే టికెట్లపై 30 నుంచి 90 డాలర్ల వరకు అదనపు సర్‌ఛార్జ్ విధించారు.

ఆగ్నేయాసియా ప్రాంతాలకు వెళ్లే విమాన టికెట్లపై 20 నుంచి 60 డాలర్ల వరకు అదనపు ఛార్జీలు అమలు చేస్తున్నారు. ఇక మార్చి 18 నుంచి యూరప్‌కు వెళ్లే విమాన టికెట్లపై సర్‌ఛార్జ్ మరింత పెరగనుంది. ప్రస్తుతం ఉన్న ఛార్జీపై మరో 25 డాలర్లు పెంచి మొత్తం 125 డాలర్లుగా నిర్ణయించారు. అలాగే ఆస్ట్రేలియా, అమెరికాకు వెళ్లే విమాన టికెట్లపై కూడా సర్‌ఛార్జ్ పెంచనున్నారు. ఈ మార్గాల్లో అదనంగా 50 డాలర్లు పెరిగి మొత్తం 200 డాలర్ల వరకు ఇంధన ఛార్జీ ఉండనుంది. ఇలా అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరగడం వల్ల విమానయాన రంగంపై ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. పెరుగుతున్న ఇంధన ధరలు విమానయాన సంస్థలకు భారీ ఆర్థిక భారంగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆ భారం కొంతమేర ప్రయాణికులపై మోపాల్సిన పరిస్థితి ఏర్పడిందని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు.

# వంట గ్యాస్ కొరత భయాలు

## ఇండక్షన్ స్టవ్‌లకి పెరిడిన డిమాండ్.. ఇండక్షన్ స్టవ్ కోనేప్పడు జాగ్రత్తలు తప్పని సరి



**విశ్వంభర, బిజినెస్** : పశ్చిమాసియా ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో ఎల్‌పీజీ (వంట గ్యాస్) సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడవచ్చనే ఆందోళనలు దేశవ్యాప్తంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే వంట గ్యాస్‌కు ప్రత్యామ్నాయాల కోసం ప్రజలు ఎగబడుతున్నారు. ముఖ్యంగా ఇండక్షన్ స్టవ్ ల కోసం విపరీతంగా ఆర్డర్లు పెడుతున్నారు. దీంతో అవి హాట్ కేక్‌ల్లా అమ్ముడపోతున్నాయి. దీంతో క్విక్ కామర్స్ సైట్లలో చూస్తుంటే చాలా వరకు 'అవుట్ ఆఫ్ స్టాక్' అనే బ్యాడ్జ్‌లు కనిపిస్తున్నాయి.

ముఖ్యంగా బ్లింకిట్ , జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ , బిగ్ బాస్కెట్ లాంటి ప్రముఖ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌లో వెతికితే, 'అన్‌అవైలబుల్' (అందుబాటులో లేవు), 'సోల్డ్ అవుట్ ' (అమ్ముడైపోయాయి) అనే బ్యాడ్జీలు కనిపిస్తున్నాయి. చాలా నగరాల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉంది. సాధారణంగా, ఆర్డర్ చేసిన నిమిషాల్లోనే డెలివరీ చేస్తామని ఈ క్విక్‌కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు చెబుతుంటాయి. కానీ ఇప్పుడు ఒక్కసారిగా విద్యుత్‌తో పనిచేసే స్టవ్‌లు, పరికరాల కోసం డిమాండ్ పెరగడంతో వాటిని అందించలేకపోతున్నాయి. ఎల్‌పీజీ సిలిండర్లకు ప్రత్యామ్నాయాల కోసం గృహ వినియోగదారులు పెద్ద ఎత్తున ఒకేసారి ప్రయత్నిస్తుండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

**30 రెట్లు పెరిగిన ఆర్డర్లు**

అమెజాన్ , ఫ్లిప్‌కార్ట్ లాంటి అతిపెద్ద ఈకామర్స్ సంస్థలు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి. తమకు ఒకేసారి భారీ మొత్తంలో ఇండక్షన్ స్టవ్‌ల గురించి ఆర్డర్లు వస్తున్నాయని పేర్కొన్నాయి. "గత రెండు రోజుల్లో ఇండక్షన్ కుక్‌టాప్‌ల విక్రయాలు సాధారణం కంటే 30 రెట్లుకు పైగా పెరిగాయి. ఇక రైస్ కుక్కర్లు, ఎలక్ట్రిక్ ప్రెజర్ కుక్కర్‌లకు సాధారణం కంటే 4 రెట్లు డిమాండ్ పెరిగింది. ఎయిర్ ఫ్రయ్యర్లు, మల్టీయూజ్ కెటిల్స్ విక్రయాలు 2 రెట్లు వరకు పెరగడం జరిగింది" అని అమెజాన్ ఇండియా ప్రతినిధి తెలిపారు.

అయితే, వీటిని కొనుగోలు చేసేవారు కొన్ని తప్పులు చేయకూడదని అనుభవజ్ఞులు చెబుతున్నారు. చాలా మంది ఇండక్షన్ స్టవ్‌ల పవర్ రేటింగ్ గురించి పూర్తిగా తెలుసుకోకుండానే వీటిని కొంటుంటారు. సాధారణ మోడల్స్ 1200 వాట్స్ నుంచి 2 వేల వాట్స్ వరకూ పవర్ రేటింగ్‌తో ఉంటాయి. వాట్స్ పెరిగే కొద్దీ ఆహారం త్వరగా ఉడుకుతుంది.

ఇక ఇండక్షన్ స్టవ్‌లకు అనువైన పాత్రలనే వినియోగించాలి. ఈ స్టవ్‌లపై వినియోగించేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్, కాస్ట్ ఐరన్ (ఇనుము) వంటి ఫెర్రో మేగ్నెటిక్ పదార్థాలతో చేసిన పాత్రలనే ఎంచుకోవాలి. ఇతర పాత్రలు ఈ స్టవ్‌లకు అనువు కాదు.

కొందరు తమ వంటింట్లో ఎంత జాగా ఉందనే విషయాన్ని పట్టించుకోకుండా ఇండక్షన్ స్టవ్స్‌ను కొనుగోలు చేస్తారు. ఇది అస్సలు చేయకూడదని తప్పు. ఇక వివిధ వంటకాల కోసం ప్రీసెట్ కుకింగ్ మోడ్స్, మాన్యువల్ టెంపరేచర్ కంట్రోల్ ఉన్న మోడల్స్‌ను ఎంచుకుంటే వంట సులువవుతుంది.

ఇండక్షన్ స్టవ్‌ల విషయంలో భద్రతా ఫీచర్లకు పెద్దపీట వేయాలి. ఆటోమేటిక్‌గా స్టవ్ ఆఫ్ అవడం, ఓవర్ హీటింగ్ నుంచి రక్షణ ఉన్న వాటినే ఎంచుకోవాలి. కంట్రోల్ ప్యానెల్ డిజైన్, సర్వీస్ సపోర్టు వంటి విషయాలను పరిగణనలోకి తీసుకున్నాకే మంచి బ్రాండ్‌ను ఎంచుకోవాలి.

ఈ స్టవ్స్‌ను కొనే సమయంలో చాలా మంది ధరలకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. ఎంట్రీలెవెల్ మోడల్స్ రూ.1500లకే అందుబాటులో ఉన్నప్పటికీ కాస్త ధర పెడితే భద్రతా ఫీచర్లు, వారెంటీ ఉన్న స్టవ్‌ను సొంతం చేసుకోవచ్చు. కాబట్టి, ఈ జాగ్రత్తలను పాటిస్తూ వినియోగదారులు తమ అవసరాలకు తగిన ఇండక్షన్ స్టవ్‌ను ఎంచుకోవాలి.

# ఉస్తాద్ భగత్ సింగ్ ట్రైలర్ విడుదల



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా థియేట్రికల్ ట్రైలర్ వచ్చేసింది. శనివారం సాయంత్రం చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ ట్రైలర్‌ను విడుదల చేసింది. "ఇచ్చి పడేసే గోత్రం.. ఇరగదీసే నక్షత్రం" అంటూ పవన్ మార్కు డైలాగులతో ఉన్న ట్రైలర్ ఈ యాక్షన్ థ్రిల్లర్ సినిమాపై భారీ అంచనాలను పెంచేసింది.

'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఉగాది పండుగ కానుకగా మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. వాస్తవానికి మార్చి 26న విడుదల కావాల్సి ఉన్నా, మరో సినిమా వాయిదా పడటంతో 'ఉస్తాద్' ముందుగానే థియేటర్లలోకి వస్తోంది.

ఈ సినిమాకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. తొలి 10 రోజుల పాటు టికెట్ ధరలు పెంచుకునేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం సింగిల్ స్క్రీన్లలో రూ.100, మల్టీప్లెక్స్‌లలో రూ.125 అదనంగా వసూలు చేసుకోవచ్చు. అలాగే, మార్చి 19న తెల్లవారుజామున 4 లేదా 5 గంటల నుంచి బెనిఫిట్ షోలు ప్రదర్శించుకోవడానికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఈ సినిమాలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. పాటలకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించగా, నేపథ్య సంగీతాన్ని (బీజీఎం) తమన్ సమకూర్చడం విశేషం. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి U/A సర్టిఫికెట్ జారీ చేసింది.

ఈ సినిమా బెనిఫిట్ షోకు అనుమతి ఇస్తూ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మెమో జారీ చేసింది. మార్చి 19న ఉదయం 45 గంటల మధ్యలో ఈ బెనిఫిట్ షో ఉంటుంది. ఈ షో టికెట్ ధర రూ.500గా నిర్ణయించారు. అలాగే రిలీజైనప్పటి నుంచి తొలి పది రోజుల పాటు టికెట్ ధర పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించారు. దీంతో తొలి 10 రోజులు సింగిల్ స్క్రీన్స్‌లో రూ.100, మల్టీప్లెక్స్‌ల్లో రూ.125 చొప్పున రేట్లు పెరగనున్నాయి. ఈ ధరలు మార్చి 19 నుంచి మార్చి 28 వరకూ అమలులో ఉంటాయి.

కాగా, హరీశ్ పవన్ కాంబోలో 2012లో గబ్బర్‌సింగ్ సినిమా వచ్చింది. ఈ సినిమా అప్పట్లో భారీ విజయం అందుకుంది. ఆ తర్వాత ఈ ఇద్దరి కాంబోలో వస్తున్న మూవీ కావడంతో అంచనాలు కూడా భారీగానే ఉన్నాయి. ఈ సినిమాను హరీశ్ యాక్షన్ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కించారు. లుక్, మేనరిజం, యాటిట్యూడ్ పరంగా వింటేజ్ పవన్ కల్యాణ్‌ను చూపించే ప్రయత్నం చేశారు.

ఇప్పటికే రిలీజైన పాటలు, వీడియో గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఇంపాక్ట్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు ఈ ట్రైలర్‌తో మరింత హైప్ క్రియేట్ అయ్యింది. ఇక ఇందులో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటించారు. అషుతోష్ రానా, నవాబ్ షా, చమ్మక్ చంద్ర, రావు రమేశ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. దేవీశ్రీ ప్రసాద్ సంగీతం అందించగా, మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవిన్ యెర్నేనీ, రవి శంకర్ సంయుక్తంగా నిర్మించారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (బీజీఎం) తమన్ అందించారు. ఈనెల 19న ఈ చిత్రం వరల్డ్‌వైడ్ గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

# రాజేంద్రప్రసాద్‌పై విశాల్ ప్రశంసలు



సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ మనస్ఫూర్తిగా క్షమాపణ చెప్పడం పట్ల తమిళ నటుడు, నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి విశాల్ కృతజ్ఞతలు తెలిపారు. తమిళ దిగ్గజ నటుడు ఎంజీఆర్‌పై రాజేంద్రప్రసాద్ చేసిన వ్యాఖ్యల వివాదం ఆయన క్షమాపణతో ముగిసిన నేపథ్యంలో విశాల్ స్పందించారు. ఇది రాజేంద్రప్రసాద్ గారి నిజమైన గొప్పతనం, వినయానికి నిదర్శనమని అభినందించారు. ఎంజీఆర్‌ను అభిమానించే ఎంతోమంది ఆయన వ్యాఖ్యలతో బాధపడ్డారని, ఈ విషయంపై సౌత్ ఇండియా ఆర్టిస్ట్ అసోసియేషన్ (నడిగర్ సంఘం) వివరణ కూడా కోరిందని విశాల్ గుర్తుచేశారు. ఈ క్రమంలో రాజేంద్రప్రసాద్ హృదయపూర్వకంగా క్షమాపణ చెప్పడాన్ని తాను మెచ్చుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'కళాప్రపూర్ణ కాంతారావు జాతీయ అవార్డు 2025' కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు నటుడు కాంతారావును ప్రశంసించే క్రమంలో, ఆయన నటన చూసి ఎంజీఆర్ భయపడేవారని, వణికిపోయేవారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తమిళనాట తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. నటులు విశాల్, నాజర్‌తో పాటు పలువురు తీవ్రంగా స్పందించారు.

వివాదం పెద్దది కావడంతో రాజేంద్రప్రసాద్ తమిళంలో ఒక వీడియో విడుదల చేసి క్షమాపణ చెప్పారు. "నేను కూడా ఎంజీఆర్‌ను దైవంలా భావిస్తాను. కాంతారావు గారిని పొగిడే క్రమంలో నోరుజారాను. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధించి ఉంటే క్షమించండి. భవిష్యత్తులో ఇలాంటివి జరగవు" అని ఆయన వివరణ ఇచ్చారు. రాజేంద్రప్రసాద్ తన పొరపాటును అంగీకరించి క్షమాపణ చెప్పడంతో ఈ వివాదానికి తెరపడినట్లయింది.



# బాలీవుడ్‌లో కీర్తి సురేష్ మరో భారీ ప్రాజెక్ట్

ప్రస్తుతం బాలీవుడ్‌లో దక్షిణాది భామలదే హవా కొనసాగుతోంది. సాయిపల్లవి, శ్రీలీల, మీనాక్షి చౌదరితో పాటు పలువురు దక్షిణాది హీరోయిన్లు హిందీలో టాప్ స్టార్స్‌తో సినిమాలు చేస్తోన్నారు. తాజాగా మహానటి కీర్తి సురేష్ కూడా ఓ బాలీవుడ్ మూవీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సైలెంట్‌గా షూటింగ్ కూడా పూర్తి చేసేసింది. కీర్తి సురేష్ బాలీవుడ్ మూవీని శనివారం అఫీషియల్‌గా అనౌన్స్‌చేయడమే కాకుండా టైటిల్‌తో పాటు రిలీజ్ డేట్‌ను కూడా రివీల్ చేశారు. రాజ్‌కుమార్ రావ్ హీరోగా నటిస్తున్న ఈ బాలీవుడ్ మూవీకి రఫ్తార్ అనే టైటిల్‌ను కన్ఫామ్ చేశారు. ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు వెల్లడించారు. విద్యావ్యవస్థలో పెరుగుతోన్న పోటీతత్వం, విద్యార్థులు ఎదుర్కొనే సంఘర్షణ చుట్టూ సోషల్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. రఫ్తార్ రిలీజ్ డేట్‌ను కూడా ప్రకటించారు. 2026 జూలై 24న ఈ మూవీ థియేటర్లలోకి రానున్నట్లు వెల్లడించారు. సైలెంట్‌గా ఈ బాలీవుడ్ మూవీ షూటింగ్‌ను కీర్తి సురేష్ కంప్లీట్ చేసేసిందట. ప్రస్తుతం రఫ్తార్ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయట. ఇందులో గ్లామరస్ రోల్‌లో కాకుండా ఛాలెంజింగ్‌గా కీర్తి సురేష్ పాత్ర సాగుతుందని సమాచారం. కీర్తి సురేష్‌కు ఇదే తొలి బాలీవుడ్ మూవీ కాదు. 2024లో రిలీజైన బేబీ జాన్‌తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది కీర్తి సురేష్. దళపతి విజయ్ హీరోగా నటించిన తమిళ మూవీ తేరీ రీమేక్‌గా తెరకెక్కిన ఈ హిందీ మూవీ డిజాస్టర్‌గా నిలిచింది. డెబ్యూ సినిమా డిజాస్టర్‌గా నిలవడంతో ఏడాదిన్నర పాటు బాలీవుడ్‌కు గ్యాప్ ఇచ్చిన కీర్తి సురేష్ రఫ్తార్‌తో రీఎంట్రీ ఇస్తోంది. ప్రస్తుతం కీర్తి సురేష్ తెలుగులో విజయ్ దేవరకొండతో రౌడీ జనార్ధన మూవీ చేస్తోంది. కోలా రవికిరణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ ఈ ఏడాది డిసెంబర్‌లో రిలీజ్ కాబోతుంది. మలయాళం మూవీ తొట్టంలో హీరోయిన్‌గా కనిపించబోతుంది.



# ఆకుపచ్చ చీరలో కుందనపు బొమ్మ

టాలీవుడ్ ఇండస్ట్రీలో మోస్ట్ డిమాండ్ ఉన్న హీరోయిన్ అంటే ఠక్కున గుర్తొచ్చే పేరు ఆమెదే. తెలుగులో తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సంపాదించుకుంది. వరుస హిట్లతో ఏకంగా స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతుంది. పవన్ కళ్యాణ్, మహేష్ బాబు, రవితేజ వంటి స్టార్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకుంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఆమె షేర్ చేసిన ఫోటోస్ చూస్తుంటే కుర్రాళ్లకు మతిపోగొట్టేస్తుంది. పట్టు చీరకట్టులో అచ్చమైన తెలుగింటి ఆడపడుచులా మెరిసిపోతుంది. సంప్రదాయ చీరకట్టులో మరింత రెట్టింపు అందంతో కనిపిస్తూ అభిమానులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది ఈ వయ్యారి శ్రీలీల. రిచ్ కలర్ పట్టుచీరలో ఆమె లుక్ రాయల్ గా కనిపిస్తుంది. చీరకు మ్యాచింగ్ బ్లౌజ్, ఆమె కట్టుకున్న చీరు చాలా హుందాగా ఉంది. ఫోటోల్లో ఆమె చిరునవ్వు, నిండుదనానికి ఫిదా అవుతున్నారు నెటిజన్స్. అలాగే ఆమె ధరించిన నగలు సైతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కేవలం నగలు పెట్టుకోవడమే కాకుండా మన పూర్వీకుల కాలం నాటి సంప్రదాయ డిజైన్లను ఆమె ఎంచుకోవడం విశేషం. చోకర్ తోపాటు అందుకు తగినట్లుగా జుంకీలు ఆమె అందాన్ని మరింత పెంచేశాయి. ముఖ్యంగా నుదుట పెట్టుకున్న పెద్ద బొట్టు.. తలలో పూలు ఆమెను బంగారు ముద్దుగుమ్మలా చూపిస్తున్నాయి. ప్రతి నగలోనూ ఎంతో సున్నితమైన పనితనం కనిపిస్తుంది. సంప్రదాయం ఉట్టిపడేలా ఆమె ఎంచుకున్న జ్యూవెల్లరీ సెలక్షన్ ఇప్పుడు ఫ్యాషన్ ప్రియులకు ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం ఇన్ స్టాలో శ్రీలీల షేర్ చేసిన ఫోటోస్ క్షణాల్లోనే వైరలయ్యాయి. అందులో కళ్లతో పలికించిన హావభావాలు నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

# అజిత్‌కు కారును బహూకరించిన మహీంద్రా సంస్థ




ప్రముఖ సినీ నటుడు అజిత్‌కు మహీంద్రా సంస్థ బీఈ6 ఫార్ములా ఈథీమ్డ్ ఎస్‌యూవీని చెన్నైలో బహూకరించింది. ఇటీవలే అజిత్ దుబాయ్ నుంచి చెన్నైకి వచ్చారు. ఆయనకు మహేంద్రా ఆటోమోటివ్ టెక్నాలజీ, ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ ప్రెసిడెంట్ ఆర్.వేలుసామి ఈ కారును అందించారు. అజిత్ ప్రొఫెషనల్ రేసర్ అనే విషయం తెలిసిందే. ఆయనకు రేసింగ్ పట్ల ఉన్న ఇష్టాన్ని గౌరవిస్తూ ఈ కారును అందించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. మోటార్ స్పోర్ట్స్ ఈవెంట్స్ కోసం ఇటీవల ఆయన ఎక్కువగా దుబాయ్‌లోనే ఉంటున్నారు. అటు అజిత్ కుమార్ సరికొత్త BE 6 ఫార్ములా E కారుపై ఆనంద్ మహీంద్రా స్పందించారు. సూపర్ స్టార్ అజిత్ కుమార్ & మహీంద్రా BE 6 ఫార్ములా E ఎడిషన్ మేడ్ ఫర్ ఈచ్ అదర్ లా ఉన్నారని కామెంట్ చేశారు. త్వరలో ఆయనను వ్యక్తిగతంగా కలిసి అభినందనలు చెప్పడంతో పాటు తమ కారును కొనుగోలు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేయడానికి ఎదురుచూస్తున్నట్లు రాసుకొచ్చారు. ఈ కారు తీసుకునే ముందు అజిత్ షిరిడి సాయిబాబా ఆలయాన్ని సందర్శించారు. శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ షిర్డీ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీలో అజిత్ ఆలయాన్ని సందర్శించిన వీడియో పోస్ట్ చేసింది. అజిత్ తన బృందంతో వచ్చిన తర్వాత ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలుకుతున్నట్లు వీడియోలో ఉంది. అజిత్ ఆలయం లోపల ప్రార్థనలు చేస్తూ సాయిబాబా ఆశీర్వాదం కోరుతున్నట్లు వీడియోలో కనిపించింది. దర్శనం తర్వాత, ఆయన ఆలయ అధికారులతో ఫోటోలు దిగారు. వారు ఆయనకు సాయిబాబా విగ్రహం, శాలువాను బహుకరించారు. దర్శనం తర్వాత వారితో కాసేపు మాట్లాడి బయటకు వచ్చారు.

# రెండోసారి తల్లైన టాలీవుడ్ నటి పూర్ణ



టాలీవుడ్ నటి, 'ఢీ' ఫేమ్ పూర్ణ (షామ్నా ఖాసిమ్) తన అభిమానులతో ఒక సంతోషకరమైన వార్తను పంచుకున్నారు. ఆమె రెండోసారి తల్లి అయ్యారు. ఈ ఉదయం 4.25 గంటలకు ఒక పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు సోషల్ మీడియా వేదికగా ఆమె ప్రకటించారు. తన జీవితంలోకి వచ్చిన ఈ చిన్నారి అపురూపమైన కానుక అని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా డెలివరీ సాఫీగా జరిగినందుకు దేవుడికి, ఆసుపత్రి సిబ్బందికి పూర్ణ తన కృతజ్ఞతలు తెలిపారు.

పూర్ణకు 2022లో దుబాయ్ వ్యాపారవేత్త షానిద్ ఆసిఫ్ అలీతో వివాహం జరిగింది. వీరికి 2023లో బాబు హమ్దాన్ జన్మించాడు. ఇప్పుడు మరోసారి తల్లి అయినట్టు పూర్ణ తీపి కబురు అందించారు. ఈ సందర్భంగా సినీ తారలు, అభిమానులు పూర్ణ దంపతులకు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలుపుతున్నారు.

పెళ్లి, పిల్లల తర్వాత సినిమాలకు కొంత గ్యాప్ ఇచ్చిన పూర్ణ ఇటీవల మహేష్ బాబు నటించిన 'గుంటూరు కారం' సినిమాలోని 'కుర్చీ మడతపెట్టి' పాటతో మళ్లీ ప్రేక్షకుల ముందుకొచ్చింది. ప్రస్తుతం ఆమె పలు టీవీ, డ్యాన్స్ షోల్లో జడ్జిగా వ్యవహరిస్తూ బిజీగా ఉంది.

## మజ్జిగ vs కొబ్బరి నీళ్లు..

# ఎండాకాలంలో ఏది తాగితే ఎక్కువ లాభం?

మండుతున్న ఎండల బారి నుండి తప్పించుకోవడానికి, దాహార్తిని తీర్చుకోవడానికి మనం తరచుగా ఆశ్రయించేవి చల్లని పానీయాలనే. కూల్ డ్రింక్స్ కంటే సహజసిద్ధంగా లభించే మజ్జిగ, కొబ్బరి నీళ్లే ఆరోగ్యానికి మేలు చేస్తాయని మనకు తెలుసు. అయితే ఎండాకాలంలో శరీరానికి అవసరమైన పూర్తి హైడ్రేషన్ (నీటి శాతం) అందించడంలో ఈ రెండింటిలో ఏది ముందుంటుంది? దేని ప్రయోజనాలు ఏమిటి? ఇక్కడ చూడండి.

### హైడ్రేషన్ ఎందుకు అంత ముఖ్యం?

హైడ్రేషన్ అంటే కేవలం గొంతు తడుపుకోవడం మాత్రమే కాదు. ఎండలో తిరిగినప్పుడు చెమట రూపంలో మన శరీరం నుండి సోడియం, పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్స్ (ఖనిజ లవణాలు) బయటకు వెళ్లిపోతాయి. అలసటను పారద్రోలి, కోల్పోయిన ఈ ఖనిజాలను తిరిగి శరీరానికి అందించి, కణాలను ఉత్తేజపరచడమే సరైన హైడ్రేషన్. ప్రకృతి ప్రసాదించిన ఎనర్జీ డ్రింక్ కొబ్బరి నీళ్లు

కొబ్బరి నీళ్లలో పొటాషియం, మెగ్నీషియం వంటివి సమృద్ధిగా ఉంటాయి. ఇది తాగడానికి చాలా తేలికగా, కాస్త తియ్యగా ఉండి, సులభంగా జీర్ణమవుతుంది. మీరు తేలికపాటి పనులు చేసినప్పుడు లేదా కొద్దిగా చెమట పట్టినప్పుడు తక్షణ శక్తి కోసం కొబ్బరి నీళ్లు అద్భుతంగా పనిచేస్తాయి. అయితే ఇందులో సోడియం శాతం చాలా తక్కువ. కాబట్టి విపరీతంగా చెమటలు పట్టినప్పుడు ఇది మాత్రమే మీ శరీరానికి సరిపోకపోవచ్చు.

### చల్లని అమృతం - మజ్జిగ

మన భారతీయుల ఇళ్లలో మజ్జిగ లేని వేసవి ఉండదు. మజ్జిగలో నీటితో పాటు సహజమైన సోడియం, పొటాషియం, ప్రోటీన్లు ,ఆరోగ్యకరమైన ప్రోబయోటిక్స్ (మంచి బ్యాక్టీరియా) ఉంటాయి. ఇది కేవలం శరీరాన్ని చల్లబరిచే పానీయం మాత్రమే కాదు..అద్భుతమైన డైజెస్టివ్ డ్రింక్ కూడా.. వేసవిలో విపరీతంగా చెమటలు పట్టినప్పుడు కోల్పోయిన సోడియంను తిరిగి భర్తీ చేయడంలో ఉప్పు కలిపిన మజ్జిగను మించినది లేదు. ఇందులోని ప్రోటీన్ల వల్ల



కడుపు నిండిన భావన కలుగుతుంది.

### ఎండాకాలానికి ఏది ఉత్తమం?

ఈ రెండింటిలో ఏది ఎంచుకోవాలి అనేది మీ అవసరాన్ని బట్టి ఉంటుంది. మీకు తక్షణమే తేలికపాటి హైడ్రేషన్ కావాలన్నా, లేదా వ్యాయామం చేసిన వెంటనే రిఫ్రెష్ అవ్వాలన్నా కొబ్బరి నీళ్లు బెస్ట్ ఆప్షన్. కానీ మీరు ఎండలో తిరిగి బాగా అలసిపోయి, చెమటలు చిందించినట్లయితే.. లేదా భోజనం తర్వాత మీ జీర్ణక్రియ సాఫీగా సాగాలనుకుంటే.. సోడియం, ప్రోబయోటిక్స్ ఉన్న మజ్జిగ తీసుకోండి.

### కొన్ని జాగ్రత్తలు

* సూపర్ మార్కెట్లలో దొరికే ఆర్టిఫిషియల్ చక్కెరలు కలిపిన కొబ్బరి నీళ్లు, మజ్జిగ ప్యాకెట్లకు దూరంగా ఉండండి.
* కిడ్నీ సమస్యలు ఉన్నవారు పొటాషియం ఎక్కువగా ఉండే కొబ్బరి నీళ్లు తీసుకునే విషయంలో డాక్టరు సలహా పాటించాలి.
* పాలు, పెరుగు పడని వారు మజ్జిగకు బదులుగా కొబ్బరి నీళ్లను ఎంచుకోవడం బెటర్.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com